
జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


పురుషుల కంటే మహిళలే తెలివైన వారు

ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరగలేదు

దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించారు 05


సంపుటి 09, సంచిక: 99 | సోమవారం | 09-03-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ప్రమాదకర పరిస్థితులు

# హైదరాబాద్‌కు రానీయొద్దు

## ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీపడేలా తీర్చిదిద్దుతాం



- డిసెంబర్ 9 నాటికి నగరంలో 100శాతం ఎలక్ట్రిక్ ఆర్‌టిసి బస్సులను ప్రవేశపెడతాం
- హైదరాబాద్‌ను దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలి
- మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- మహళా జర్నలిస్టులకు సత్కారం
- మహిళలు ఆర్థికంగా ఎదగడం వల్లే కొన్ని దేశాలు బలమైనవిగా నిలబడ్డాయని వెల్లడి
- ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే మహిళల రక్షణకు కమిటీలు



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులు సమీప భవిష్యత్తులో హైదరాబాద్‌కు తలెత్తకుండా నివారించడంతో పాటు ఈ నగరాన్ని ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాలుష్య తరువాయి 12లో



# యుద్ధం ఉద్ధృతం



- క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్న ఇరాన్
- గల్ఫ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాలపై దాడులు
- ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం
- అగ్నిగుండంగా టెహ్రాన్ : ప్రళయ దృశ్యం ఆవిష్కృతం

**టెహ్రాన్:** ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య పోరు భీకరంగా సాగుతోంది. వారం రోజులుగా సాగుతున్న పోరు పరాకాష్ఠకు చేరింది. ఆదివారం దాడులు ప్రతిదాడులు మరింత తీవ్రతరమయ్యాయి. మొదటిసారిగా ఇరాన్‌లోని చమురు క్షేత్రాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. వైమానిక దాడులు చేశాయి. చమురు నిల్వ కేంద్రాల నుంచి మంటలు ఎగిసిపడుతూ, ఆకాశాన్ని నల్లటి పొగ కమ్మేసింది. దీంతో టెహ్రాన్ అగ్నిగుండంగా మారి... ప్రళయ దృశ్యం ఆవిష్కృతమైంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తెహ్రాన్, అల్బోర్జ్ ప్రావిన్స్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై అనేక దాడులు చేసింది. కరజ్ డిపో, షహ్రాన్ ఆయిల్ డిపోపైనా బాంబులు వేసింది. మంటలు ఆర్పేందుకు అత్యవసర బృందాలు నిర్విరామంగా పనిచేస్తున్నట్లు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశ ఇంధన నిల్వలకు ఢోకా లేదని తెలిపింది. కొరతను నివారించడం కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. కుహక్, షహ్రాన్ ప్రాంతాల్లోని మూడు డిపోలతో పాటు కరజ్ కేంద్రంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడులు చేసినట్టు తెలిపింది. చమురు క్షేత్రాలపై దాడులను ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. ఇరాన్ సాయుధ దళాలు ఇంధన నిల్వ చేసే కాంప్లెక్సులను వినియోగిస్తున్నందుకే వాటిపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఇరాన్ సైన్యానికి కీలక మద్దతు ఇచ్చే మౌలిక వసతులకు నష్టం కలిగించడమే ఈ ఆపరేషన్ ఉద్దేశంగా తెలిపింది. ఇంధన కేంద్రాలే కాదు బాలిస్టిక్ క్షిపణుల తయారీకి కీలకమైన రెండు చోట్ల దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇజ్రాయెల్‌పై ప్రతి దాడులు కొనసాగించినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపింది. ఆత్మరక్షణలో భాగంగానే ప్రతి దాడులు చేస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరాగ్చీ స్పష్టతిచ్చారు. నూతన అధినేత పేరుపై త్వరలోనే ప్రకటన వెలువడుతుందని సంకేతాలిచ్చారు. మరింత బలంగా కొడతామని అమెరికా... యుద్ధం ఇక్కడితో ఆగదని ఇజ్రాయెల్ హెచ్చరించడంతో శత్రు సేనలను తమ వీర సైనికులు మట్టికరిపించగలరని అరాగ్చీ వక్కాణించారు. ఇరాన్ తలొగ్గే ప్రసక్తే లేదని మరోమారు స్పష్టంచేశారు.

**పేలుళ్లతో దద్దరిల్లిన ఇరాన్ :**

ఇరాన్ సెంట్రల్ యాజ్డ్ ప్రావిన్స్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్‌లోని ఇస్ఫాహన్ విమానాశ్రయంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఎఫ్ 14 యుద్ధ విమానాలను తరువాయి 2లో

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

# నేటి నుంచి రెండో సెషన్

పశ్చిమాసియా సంఘర్షణపై ప్రభుత్వ విధానాన్ని నిలదీయనున్న ప్రతిపక్షాలు 05



## జూరాల నుంచి శ్రీశైలంకు 'పాలమూరు' తరలింపుతో

# తీవ్ర అన్యాయం

- 2028 డిసెంబర్ నాటికి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేస్తాం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు ప్రాజెక్ట నుు జూరాల నుంచి శ్రీశైలంకు తరలించడం వల్ల తీరని అన్యాయం జరిగిందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల పనులపై మంత్రులు వాకిటి శ్రీహరి, తరువాయి 12లో




# మహిళల పట్ల అన్నింటా వివక్షే

- కేంద్రంలోని బిజెపి సర్కార్‌ది నిరంకుశ పాలన
- దేశవ్యాప్తంగా రోజురోజూ మహిళలపై పెరిగిపోతున్న దాడులు, అత్యాచారాలు
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ ఆందోళన
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో వివక్షను ఎదుర్కొంటున్నరని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి (ఎన్‌ఎఫ్ ఐడబ్ల్యు), అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఎఐఎస్‌ఎఫ్) బాలికల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర కార్యాలయం నుండి నారాయణ గూడ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పశ్య పద్మ అంతకు ముందు ఎన్ ఎఫ్‌ఐడబ్ల్యు తరువాయి 12లో

# నేపాల్‌లో ఆర్‌ఎస్‌పి హవా

- 120 సీట్లు కైవసం
- యువ సంగీతకారుడి నుంచి రాజకీయ నేతగా మారిన ప్రధానమంత్రి అభ్యర్థి బాలెన్‌కు ప్రజలు పట్టం
- ఘోర పరాజయాన్ని చవిచూసిన వారసత్వ పార్టీలు



**ఖాట్మాండు :** నేపాల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలలో యువ సంగీతకారుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన బాలేంద్ర షా 'బాలెన్' రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పి) అనూహ్యమైన రీతిలో అద్భుత విజయందిశగా దూసుకువెళ్తోంది. వారసత్వ పార్టీలు ఈ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని తరువాయి 2లో

## మహిళల సమస్యలు

# ఇప్పటికీ తీరలేదు

సిపిఐ వ్యాఖ్య




**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనూ మహిళా హక్కులు సంపూర్ణంగా అమలవుతున్న దాఖలాలు లేవని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, హక్కుల కోసం మహిళలు చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకుంది. సామ్యవాద ఉద్యమంతోపాటు మహిళలు చేసిన ఉద్యమాల కారణంగానే చారిత్రాత్మక దినంగా మార్చి 8 అవతరించిందని పేర్కొంది. మహిళలపై జరుగుతున్న దోపిడీ, అసమానతలు, రాజకీయ హక్కుల నిరాకణ వంటి సమస్యలపై పోరాడాలంటూ 1910లో, విప్లవ యోధురాలు క్లారా జెట్కిన్ ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు పిలుపునిచ్చిన విషయాన్ని పార్టీ ప్రస్తావించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నప్పటికీ, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, హింస, కుల వివక్ష, పితృస్వామ్యం వంటి ఎన్నో సమస్యలతో, దేశంలోని మహిళలు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ తన ప్రకటనలో పేర్కొంది. మహిళల పట్ల అసమానతలను, వివక్షను, అణచివేతను పూర్తిగా నిర్మూలించామని ప్రకటించుకోగల స్థితిలో ఏ ఒక్క దేశం కూడా లేదని వ్యాఖ్యానించింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యంతో, అకుంఠిత దీక్షతో ముందుకు వెళుతున్న మహిళలకు జేజేలు పలుకుతున్నట్టు తెలిపింది. సమానత్వం, గౌరవం, దోపిడీ రహిత, వివక్ష లేని సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నట్టు పార్టీ పునరుద్ఘాటించింది.

# గిట్టుబాటు ఒట్టి మాటే!



- వ్యవసాయ ఉత్పత్తులకు లభించని మద్దతు ధర
- మక్క మద్దతు ధర క్వింటా రూ. 2,400 : కొనుగోలు చేస్తున్నది రూ. 1,400 మాత్రమే

ప్రజాపక్షం/ ఖమ్మం

వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర లభించడం లేదు. పాలకులు ఎవరైనా ఏమి చెప్పినా మద్దతు ధర కేవలం ప్రకటనలకే పరిమితమవుతుంది. గడిచిన రెండేళ్లతో పోల్చినప్పుడే ఈ ఏడాది మొక్కజొన్న గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది అతివృష్టి కారణంగా పత్తి దిగుబడి రాకపోవడం, కొద్దో గొప్పో పండితే దానికి గిట్టుబాటు ధర లభించ లేదు. రైతులు పత్తిని తొలగించి మొక్కజొన్నను సాగు చేశారు. పునాస పంటల తర్వాత నీటి వసతి గల రైతులు మొక్కజొన్న వైపే మొగ్గు చూపారు. ఇప్పుడు మొక్కజొన్న పంట చేతికి రాగా దళారులు ధర నియంత్రించి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారన్న ఆవేదనలో రైతులు ఉన్నారు. ప్రభుత్వ తరువాయి 2లో

## 'విశ్రాంతం'లోనూ

# మనోవేదనే



- ఆర్థిక ఇబ్బందులు.. అనారోగ్య సవాళ్లు
- జీవిత చరమాంకంలో ఆర్థిక క్షోభతో 74 మంది పెన్షనర్లు కన్నుమూత
- పని చేయని హెల్త్ కార్డులు.. వైద్యం అందక అప్పుల పాలు

ప్రజాపక్షం/హనుమకొండ

దశాబ్దాల తరబడి ప్రభుత్వ యంత్రాంగంలో పని చేసి.. సమాజ సేవలో తమ జీవిత కాలాన్ని ధారబోసిన రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి నేడు ఇబ్బందుల్లో పడింది. జీవిత కాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాల్సిన వేళ.. తమ సొంత నిధుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక గడిచిన ఏడాది కాలంలో.. దాదాపు 24,678 మంది విశ్రాంత ఉద్యోగులు తమ గ్రాట్యుటీ, జిపిఎఫ్ సొమ్ము కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తు న్నారు. ఆర్థిక క్షోభతో, సరైన వైద్యం అందక ఇప్పటికే 74 మంది తరువాయి 2లో



# మమ్దానీ ఇంటిపై దాడికి విఫలయత్నం

## ఇద్దరి అరెస్టు.. న్యూయార్క్‌లో హైఅలర్ట్

**న్యూయార్క్:** న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఇంటిపై దాడికి విఫలయత్నం జరిగింది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ సంయుక్తంగా భీకర దాడులు చేస్తున్న వేళ న్యూయార్క్ మేయర్ అధికారిక నివాసంపై దాడికి యత్నం స్థానికంగా కలకలం రేపింది. అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. మమ్దానీ తొలి ముస్లిం మేయర్. ఇస్లాం వ్యతిరేకులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దాడి జరిగినప్పుడు మమ్దానీ, ఆయన భార్య ఇంట్లోనే ఉన్నారు. అయితే వారికి ఎలాంటి గాయాలు కాలేదు. మేయర్ దంపతులు సురక్షితంగా ఉన్నారని మేయర్ ప్రతినిధి జో కాల్వెల్లో ధవీకరించారు. ఈ దాడిని హేయమైన చరగా ఖండించారు. మేయర్ అధికారిక నివాసం 'గ్రేసీ మాన్షన్' లక్ష్యంగా దాడి ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మేయర్ ఇంటి వద్ద రెండు వర్గాల మధ్య వాగ్వాదం ఈ దాడికి దారి తీసినట్లు వెల్లడించారు. ఇన్‌ఫ్ల్యూయెన్సర్ జేక్ లాంగ్ అధ్వర్యంలో ఇస్లాంకు వ్యతిరేకంగా నిరసన జరుగుతుండగా... దానికి దీటుగా సుమారు 125 మంది 'డ్రైవ్ ది నాజీస్ అవుట్ ఆఫ్ న్యూయార్క్' పేరుతో మరో నిరసన చేపట్టారు. ఇదే క్రమంలో నిరసనకారుల్లో పెప్పర్ స్ప్రే ప్రయోగించడం ఉద్రిక్తత పెరిగింది. ఓ 18 ఏళ్ల యువకుడు అనుమానాస్పద పేలుడు పరికరాన్ని నిరసన ప్రాంతం మీదకు విసరగా, అది మంటలు, పొగ చిమ్ముతూ పోలీసుల బారికేడ్లను తాకి, అధికారులకు కొద్ది దూరంలో పడింది. మరో యువకుడి వద్ద నుంచి రెండో పరికరాన్ని తీసుకుని విసిరేందుకు ప్రయత్నిస్తుండగా అతనిని పోలీసులు పట్టుకున్నారు. రెండు పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. అవి ఫుట్‌బాల్ కంటే కొంచెం చిన్నగా ఉన్నాయని పోలీసు కమీషనర్ జెసికా టిష్ వెల్లడించారు. గాజు సీసాకు నల్ల చుట్టి, అందులో బోల్టులు, స్క్రూలు వేసి, ఒక 'హాబీ ఫ్యూజ్' (వెలిగించేందుకు వీలుగా) అమర్చి ఆ పరికరం ఉన్నదని, బాంబు స్క్వాడ్, ఎఫ్‌బీఐ తనిఖీ చేసినట్లు తెలిపారు. కేవలం భయపెట్టేందుకు వీటిని వాడారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఈ ఘటనతో న్యూయార్క్ అప్రమత్తమైంది. మామ్దానీ నివాసమున్న ప్రాంతంలో హై అలర్ట్ విధించారు. భద్రతా బలగాలను మోహరించారు. స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దించారు. ఎక్కడైనా పేలుడు పదార్థాలు ఉన్నాయా అని పోలీసులు తనిఖీలు చేశారు. న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ ఈ దాడిని ఖండించారు. న్యూయార్క్‌లో విద్వేషానికి, హింసకు చోటు లేదని స్పష్టం చేశారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధంతో ఈ ఘటనకు సంబంధం లేదని పోలీసులు నిర్ధారించారు.

# మీ యుద్ధ నౌకలతో మాకు పనిలేదు

## స్టార్మర్‌కు ట్రంప్ స్పష్టీకరణ



**వాషింగ్టన్:** ఇరాన్‌పై యుద్ధంలో ఇప్పటికే గెలిచామని, ఇక బ్రిటన్ నౌకలతో తమకు పనేముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ మిత్రదేశమైన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌నుద్దేశించి మీ సాయం మాకు అక్కర్లేదని తేల్చి చెప్పారు. ఇరాన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు సంకేతాలు ఇచ్చారు. స్టార్మర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అమెరికా గెలిచిన తర్వాత యుద్ధ విమాన వాహక నౌకలు పంపుతామని చెప్పడంలో అర్థం లేదని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా వ్యాఖ్యానించారు. 'మా గొప్ప మిత్రదేశమైన యునైటెడ్ కింగ్‌డమ్.. పశ్చిమాసియాకు రెండు యుద్ధ నౌకలను పంపాలని ఆలోచిస్తోంది. స్టార్మర్.. ఇప్పుడు మాకు వాటి అవసరం లేదు. సమయం మించిపోయాక మీ స్పందనను గుర్తుపెట్టుకుంటాం' అంటూ ట్రంప్ చురకలు అంటించారు. వేల ఏళ్ల చరిత్రలో ఇరాన్ పొరుగు దేశాల ఎదుట లొంగిపోవడం ఇదే మొదటిసారన్నారు. ఇరాన్ తన పద్ధతి మార్చుకోకపోతే తదుపరి దాడులు అత్యంత భయంకరంగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. తన నాయకత్వంలోనే పశ్చిమాసియా ప్రశాంతంగా మారుతోందని, ఇందుకు అందరూ తనకు 'థాంక్యూ' చెబుతున్నారని ట్రంప్ తనను తాను ప్రశంసించుకున్నారు.

**భారత్‌పై ఒత్తిడి తగ్గించేందుకే....**

హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఇంధన ధరలు అమాంతం పెరిగిపోయాయి. చమురు ధరలు పెరగడంపై తమకు ఆందోళన లేదని ట్రంప్ అన్నారు. ఎదురయ్యే పరిస్థితికి అమెరికా సిద్ధమన్నారు. అమెరికా వద్ద చమురు నిధి ఉన్నట్లు చెప్పారు. తాజా పరిణామాల క్రమంలో భారత్‌పై ఒత్తిడి తగ్గించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకునేలా మినహాయింపు ఇచ్చామన్నారు. ఇప్పటికే సముద్ర మార్గంలో ఉన్న చమురు రవాణాకు ఇది వర్తిస్తుందని, దీనివల్ల రష్యాకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని ట్రంప్ అన్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరల ఒత్తిడిని తగ్గించడానికి అమెరికా వద్ద అపారమైన చమురు నిల్వలు ఉన్నాయన్నారు. ఈ సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని చెప్పారు. 'గత నెలాఖరుకు అమెరికా వద్ద 415 మిలియన్ బారెళ్ల పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. అత్యవసరమైతే వాటిని వినియోగిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. భారత్ తమ కీలక భాగస్వామి దేశమన్నారు. భవిష్యత్తులో అమెరికా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు పెంచుతుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

# ట్రంప్ మూల్యం చెల్లించుకోవాల్సిందే

## ఇరాన్ భద్రతా విభాగం చీఫ్ అలీ లారిజానీ హెచ్చరిక



**టెహ్రాన్:** తమ అధినేత ఖామేనీ హత్యకు అమెరికాపై ప్రతీకారం తప్పక తీర్చుకుంటామని ఇరాన్ భద్రతా విభాగం చీఫ్ అలీ లారిజానీ హెచ్చరించారు. 'మా నాయకుడిని చంపిన ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని అన్నారు. వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 'మా నాయకుడి రక్తం చిందించి, వెయ్యి మందికి పైగా మా పౌరులను బలి తీసుకున్నందుకు ప్రతీకారం తీర్చుకుంటాం. ట్రంప్‌ను వదిలిపెట్టం.. ఆయన మూల్యం చెల్లించాల్సిందే' అని లారిజానీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పొరుగు దేశాలకు హెచ్చరిక చేశారు. తమ స్థావరాలను ఇరాన్‌పై దాడులకు అమెరికా వాడుకోకుండా అడ్డుకోవాలని, లేదంటే తామే నేరుగా రంగంలోకి దిగుతామని ఇరుగు పొరుగు దేశాలకు స్పష్టంచేశారు. ఇదిలావుంటే, అసలు లారిజానీ అంటే ఎవరో తనకు తెలియనది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్ హెచ్చరికలనుపారేశారు. ఇరాన్ లొంగిపోయిందన్నారు. ఇరాన్ వెంటనే షరతులు లేని లొంగుబాటు ప్రకటించాలని, లేదంటే అమెరికా దాడులు కొనసాగుతాయని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌ను ముక్కలు చేసేందుకు అమెరికా కుట్ర చేస్తోందని లారిజానీ ఆరోపించారు. వెనిజులా సీన్ రిపీట్‌కు ప్రయత్నిస్తోందన్నారు. పశ్చిమాసియా పరిస్థితులను అమెరికా తప్పుగా అంచనా వేస్తోందని, ఇప్పటికే మా ఉచ్చులో చిక్కుకున్నారు' అని ఎద్దేవా చేశారు. తమ వద్ద కొందరు అమెరికా సైనికులు బందీలుగా ఉన్నట్లు లారిజానీ వెల్లడించారు.

# అమెరికాను వణికిస్తున్న 'హ్యూమన్ మెటాన్యుమో'



**వాషింగ్టన్:** అమెరికాకు కొత్త ముప్పు పొంచి వుంది. సాధారణ జలుబుగా మొదలై ప్రాణాంతకంగా మారే హ్యూమన్ మెటాన్యుమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) ఆ దేశ పశ్చిమ తీర ప్రాంతాలను వణికిస్తోంది. ఉత్తర కాలిఫోర్నియాలో వైరస్ వ్యాప్తి చెందింది. శాన్ ఫ్రాన్సిస్కో, మారిన్, వల్లెజో, నాపా, నోవాటో, శాంటారోసా, సాక్రమెంటో, డేవిస్ వంటి ప్రధాన నగరాల్లో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంది. హ్యూమన్ మెటాన్యుమోవైరస్ అనేది శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేసే సింగిల్ స్ట్రాండెడ్ ఆర్ఎన్ఏ వైరస్. దీనిని 2001లోనే గుర్తించారు. జనవరి నుంచి మార్చివరకు ఈ వైరస్ సోకిన కేసులు భారీగా నమోదు అయ్యాయి. ఈ వైరస్ సోకిన వారిలో సాధారణ జలుబు లక్షణాలే కనిపిస్తాయి. దగ్గు, జ్వరం, ముక్కు కారడం లేదా దిబ్బడ ఉండటం, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఒంటిపై దద్దుర్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిని త్వరగా సోకుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 6.5 లక్షల మంది ఈ వైరస్ కారణంగా ఆసుపత్రి పాలవుతున్నారని ప్రముఖ డాక్టర్ మార్క్ సీగల్ తెలిపారు. ఈ వైరస్‌ను నయం చేసే యాంటీ వైరల్ మందులు గానీ, టీకాలు గానీ లేవు. బాధితులకు సపోర్టివ్ కేర్ మాత్రమే అందించగలరు. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు ఆక్సిజన్ థెరపీ, ఐవీ ఫ్లూయిడ్స్, కార్టికోస్టెరాయిడ్స్ వంటి చికిత్సలను వైద్యులు ఉపయోగిస్తున్నారు. వైరస్ సోకిన వ్యక్తి తుమ్మితే, దగ్గితే వచ్చే తుంపర్ల ద్వారా లేదా వైరస్ ఉన్న ఉపరితలాలను తాకితే ఈ వ్యాధి వ్యాపిస్తుంది. తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, వైద్య నిపుణులు సూచించారు.

# ప్రపంచం ఆటవిక రాజ్యం కారాదు: చైనా

## ఇరాన్‌పై యుద్ధానికి ఖండన అమెరికాతో చర్చలకు పిలుపు



**బీజింగ్:** పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతం కావడంపై చైనా తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. సైనిక చర్యలను తీవ్రంగా ఖండించింది. అమెరికా తీరును ఆక్షేపించింది. అదే సమయంలో తమ దేశంతో ఉన్న విబేధాలను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని అమెరికాకు పిలుపునిచ్చింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆదివారం రాజధానిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇరాన్‌పై యుద్ధం అసలు జరగాల్సింది కాదని అన్నారు. ప్రపంచం ఆటవిక రాజ్యంగా మారిపోకూడదని తేల్చిచెప్పారు. అమెరికాతో చర్చలకు చైనా సిద్ధమని, అయితే 'రెడ్ లైన్స్'ను దాటోమని హామీనిచ్చారు. ఈ వారం ప్రారంభమైన టూ సెషన్స్ అనే రాజకీయ సదస్సు క్రమంలో వాంగ్ యీ స్పందించారు. అమెరికాచైనా బంధానికి ఈ ఏడాది కీలకమన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతున్నట్టు తెలిపారు. వాణిజ్య యుద్ధం, పరస్పరం సుంకాలు విధించుకోవడాన్ని గుర్తుచేశారు. సుస్థిరత పర్యావరణం, విభేదాల పరిష్కారం, అనవసర జోక్యాల నివారణ కోసం చైనా, అమెరికా రాజీ కుదుర్చుకోవాలని వాంగ్ యీ సూచించారు. రష్యాతో తమ దేశానికి సుస్థిరపటిష్ఠ బంధం ఉన్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో చైనారష్యా సంబంధాలపై పశ్చిమ దేశాల విమర్శలను తోసిపుచ్చారు. క్లిష్టమైన... ఒడిదుడుకులతో కూడుకున్న అంతర్జాతీయ పరిణామాల మధ్య చైనా రష్యా బంధం చెక్కుచెదరకుండా దృఢంగా ఉన్నదని వాంగ్‌యీ వెల్లడించారు.

**భారత్, చైనా భాగస్వాములుగా ఉండాలి**

భారత్, చైనా ప్రత్యర్థ దేశాలుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని వాంగ్ యీ అన్నారు. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపర్చుకునే విషయానికి రెండు దేశాలు కట్టుబడి ఉండాలని చెప్పారు. 2024లో కజాన్ వేదికగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ తర్వాత రెండు దేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని వాంగ్ యీ వెల్లడించారు. గతేడాది తియాంజిన్‌లో నేతలిద్దరు భేటీ అయిన తర్వాత రెండు దేశాల సంబంధాల్లో మెరుగుదల కనిపించినట్లు తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటితో భారత్‌చైనాకు ప్రయోజనం' అని వాంగ్ యీ అన్నారు. భారత్, చైనా సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని... సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించాలని... అభివద్ధిపై దష్టి సారించాలని సూచించారు. భారత్, చైనా దీర్ఘకాల భాగస్వాములుగా పరస్పర విశ్వాసం, సహకారంతో ముందుకెళ్లాలన్నారు. భజనవాదం, ఘర్షణలు.. అభివద్ధిని దెబ్బతీస్తాయని వాంగ్ యీ అన్నారు.

# యుద్ధం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ధ్వంసం చేసింది. అటు ఇరాన్ కూడా ప్రతి దాడులతో యూఏఈ, కువైట్, సౌదీ అరేబియాను ఉక్కిరిబిక్కిరి చేసింది. గల్ఫ్ దేశాలతో పాటు ఇజ్రాయిల్‌పై క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ విరుచుకుపడింది. రాజధాని రియాద్‌లోని దౌత్య కేంద్రంపై డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా పేర్కొంది. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఇంధన ట్యాంకులు లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడులు చేసినట్లు కువైట్ వెల్లడించింది. టెహ్రాన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్దఎత్తున వైమానిక దాడులను ఇజ్రాయిల్ సైన్యం చేసింది.

**ఇజ్రాయిల్, గల్ఫ్‌పైకి ఇరాన్ క్షిపణులు**

ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌పైకి క్షిపణులు ప్రయోగించింది. దీంతో జెరూసలేం, టెల్ అవీవ్ సహా దేశవ్యాప్తంగా తమ పౌరులకు షెల్టర్లలో ఆశ్రయం పొందాలంటూ ఇజ్రాయిల్ ఆదేశాలిచ్చింది. ఆదివారం తెల్లవారుజామున ఎయిర్ రైడ్ సైరెన్లు మోగిన తర్వాత ఉత్తర ఇజ్రాయిల్ వాసులంతా షెల్టర్లకు తరలిపోయారు. ఇరాక్‌లోని ఇర్బిల్ అంతర్జాతీయ విమానాశ్రయంపై డ్రోన్ దాడిలో ఇద్దరు గాయపడ్డారు. బహ్రెయిన్‌లోని సీపోర్టు సమీప కేంద్రంపై ఇరాన్ దాడి చేసింది. దీంతో అక్కడి దుకాణాలు దెబ్బతిన్నాయి. ఒకరు గాయపడ్డారు. ఇరాక్‌లోని ఉత్తర కుర్దిష్ ప్రాంతం సులేమనియాలో అనేక చోట్ల దాడులు జరిగాయి. యూఏఈలో అనేకసార్లు సైరన్లు మోగాయి. క్షిపణులు, డ్రోన్లను తమ దేశం అడ్డుకున్నట్లు యూఏఈ ప్రకటించింది. దాడుల్లో దుబాయ్ మరీనా టవర్‌కు స్వల్పంగా దెబ్బతిన్నట్లు వెల్లడించింది. ఇరాన్‌పై దాడుల్లో ఇప్పటివరకు 1300 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారు. వీటిలో 180 మందికిపైగా చిన్నారులు ఉన్నారు. మరో 1,023 మంది లెబనాన్ ప్రజలు గాయపడ్డారని అక్కడి ఆరోగ్యశాఖ వెల్లడించింది.

**మరో ఆరు నెలలు ఉధృత పోరుకు సిద్ధం: ఐఆర్‌జిసి**

మరో ఆరు నెలల వరకు ఉధృత యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధికారి అలీ మహమ్మద్ నైనీ ప్రకటించారు. గల్ఫ్‌తో పాటు ఇజ్రాయిల్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా రాయబార కేంద్రాలు, దౌత్య కార్యాలయాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోంది. రియాద్‌లోని అమెరికా ఎంబసీతో పాటు ఇతర విదేశీ మిషన్లు ఉన్న డిప్లొమాటిక్ క్వార్టర్‌పై డ్రోన్ దాడి చేసినట్లు సౌదీ రక్షణ శాఖ వెల్లడించింది. అలాగే ఇరాన్ రాజధాని బాగ్దాద్‌పై కత్యుషా రాకెట్లతో దాడి జరిగింది. అక్కడి అమెరికా ఎంబసీ లక్ష్యం కాగా ఓస్లోలోనూ పేలుళ్లు సంభవించాయి.

# ఆర్ఎస్‌పి హవా

(మొదటి పేజీ తరువాయి)

చవిచూశాయి. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ 2022లో ఆవిర్భవించింది. 165 ప్రత్యక్ష ఎన్నికల స్థానాలలో 120 సీట్లను గెలుచుకుంది. కాగా మరో ఆరు స్థానాలలో ఆధిక్యత కొనసాగిస్తోందని ఎన్నికల సంఘం వెల్లడించింది. 165 స్థానాలకుగాను కడపటి వార్తలు అందే సమయానికి ఎన్నికల సంఘం 156 స్థానాల ఫలితాలను ప్రకటించింది. ఇంకా కేవలం 9స్థానాలకు మాత్రమే ఫలితాలు వెలువడాల్సి ఉన్నదని ఎన్నికల సంఘం అధికారులు తెలియజేశారు. ఆదివారం రాత్రి వరకూ కౌంటింగ్ ప్రక్రియలో ఆలస్యం కావచ్చని, సోమవారం ఉదయం నాటికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉందని వారు చెప్పారు. శనివారం 1వ తేదీన పోలింగ్ పూర్తి అయిన వెంటనే లెక్కింపు ప్రారంభమైంది. ఫలితాలు ప్రకటించబడ్డాయి. ప్రధాన అంశం ఏమిటంటే నాలుగుసార్లు ప్రధాన మంత్రిగా కొనసాగిన కె.పి.శర్మ ఓలిని 35ఏళ్ల వయసున్న ప్రధానమంత్రి అభ్యర్థి బాలెన్ ఓడించడం ఆశ్చర్యకర పరిణామం. నేపాల్‌లో పెద్ద పార్టీలలో ఒకటైన సిపిఎన్‌యుఎంఎల్ అధ్యక్షుడైన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలిని ఝూప5 నియోజకవర్గంలో దాదాపు 50,000ఓట్ల భారీ తేడాతో ఓడించారు. బాగా నిలదొక్కుకున్న పార్టీలను తిరస్కరించడం ద్వారా ప్రజలు బాలెన్‌కు అపూర్వ విజయాన్ని అందించి ఆయనను నేపాల్ తదుపరి ప్రధానమంత్రిగా భావిస్తున్నారు. హిమాలయ దేశమైన నేపాల్‌కు ఆయన మొట్టమొదటి మాధేశీ ప్రధానమంత్రిగానే కాకుండా నేపాల్ పార్లమెంట్ చరిత్రలో అత్యున్నత పదవిని అధిష్ఠించిన నవయువకుడిగా చరిత్ర సృష్టించారు. ఎన్నికల ఫలితాలలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ తర్వాత నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సి) 17స్థానాలలో గెలుపొంది రెండవ స్థానంలో నిలిచింది. కాగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునిఫైడ్ మార్క్సిస్టులెనినిస్టు) సిపిఎన్(యుఎంఎల్‌కు సారథ్యం వహించిన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి కేవలం ఏడు స్థానాలను గెలుచుకుని, మరో మూడు స్థానాలలో లీడింగ్‌లో ఉన్నది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌సిపి) ఏడు స్థానాలలో గెలుపొందింది. శ్రమ్ సంస్కృతి పార్టీ (ఎస్ఎస్‌పి) మూడు స్థానాలను గెలుచుకోగా, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పిపి) కేవలం 1స్థానాన్ని మాత్రమే గెలుచుకున్నదని ఎన్నికల సంఘం సమాచారం వెల్లడించింది. విజయం సాధించినవారిలో 1 ఇండిపెండెంట్ కూడా ఉన్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి రాజీనామా చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి మహాబీర్ పున్ మారుమూల పర్వత జిల్లాలోని మయాగ్డీ1 నియోజకవర్గం నుంచి విజయం సాధించాడు. మహాబీర్ పున్ తన సమీప సిపిఎన్(యుఎంఎల్), ఎన్‌సిలను ఓడించి గెలిచాడు. అయితే ఆర్ఎస్‌పి అతనికి వ్యతిరేకంగా అభ్యర్థిని నిలబెట్టలేదు. కాథ్‌లోని మూడు జిల్లాల్లోని 15 నియోజకవర్గాలలో రవి లామిచ్చనే నేతృత్వంలోని ఆర్ఎస్‌పి గెలుచుకున్న సీట్లను ఎన్నికల సంఘం డేటాలో చూపించింది. అవినీతిపై పోరాటం, బంధు ప్రీతికి ముగింపు పలకడం, దేశ రాజకీయ నాయకత్వంలో తరాల మార్పు వంటి అంశాలకు సంబంధించి ఓటర్లను ఒప్పించడంలో వారసత్వ పార్టీలు విఫలమయ్యాయని రాజకీయ విశ్లేషకులు తెలియజేశారు.

నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న గగన్ థాపా(49) తన పార్టీ తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో ఉన్నప్పటికీ ధనుషా నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఆర్ఎస్‌పి అమరేష్ సింగ్ చేతిలో ఓడిపోయారు. అమరేష్‌సింగ్‌కు 33,688 ఓట్లు లభించగా, ఆయనకు వ్యతిరేకంగా పోటీ చేసిన థాపాకు 22,831 ఓట్లు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది.నేపాలీ కాంగ్రెస్ లోని ఇతర సీనియర్ నాయకులు ప్రధానకార్యదర్శి గురు రాజ్ ఘిమిరే సహా శేఖర్ కొయిరాలా, బిమలేంద్ర నిధి కూడా ఓటమిపాలైన వారిలో ఉన్నారు. ప్రధానకార్యదర్శి శంకర్ పోఖారెల్ సహా సిపిఎన్‌యుఎంఎల్‌కు చెందిన 10మంది ఆఫీస్ బేరర్లు కూడా ఈ ఎన్నికల్లో ఓడిపోయారు.శ్రమ్ సంస్కృతి పార్టీ చైర్మన్ హర్కా రాయ్ సున్సారీ1 నియోజకవర్గం నుంచి ఆర్ఎస్‌పి అభ్యర్థి గోమా తమంగ్‌పై గెలుపొందారు. ఈ ఎన్నికలలో 10 మంది మహిళా అభ్యర్థులు విజయం సాధించగా, వీరిలో ఆర్ఎస్‌పి నుంచి 9మంది, ఎన్‌సి నుంచి ఒకరు గెలుపొందారు.ఈ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు నేపాల్ ప్రజలను, ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం అభినందించారు.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు పదవీ కాలాన్ని మరోసారి పొడిగించండి

## కేంద్ర ప్రభుత్వానికి సిఎం లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు పదవీకాలాన్ని మరోసారి పొడిగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. రెండు రోజుల క్రితమే సిఎంఒ నుంచి ప్రధాని కార్యాలయానికి లేఖ వెళ్లినట్టు సమాచారం. ఇప్పటికే రామకృష్ణరావు పదవీకాలాన్ని పొడిగించగా, ఈ నెల 31వ తేదీతో ఆయన పదవీకాలం ముగియనుంది. ఈనెల 16వ తేదీ నుంచి తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయని, అలాగే మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు జనగణన షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో రామకృష్ణరావు పదవీకాలాన్ని మరోసారి పొడిగించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. రాష్ట్రంలో ముఖ్యమైన కార్యాక్రమాలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన కార్యదర్శి మారితే పరిపాలనపరమైన ఇబ్బందులు వస్తాయని కేంద్రం దృష్టికితీసుకెళ్లినట్టు తెలిసింది.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

## ప్రొఫెసర్ కోదండరాం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందున్నప్పుడే ఆ సమాజం అగ్ర భాగాన నిలుస్తుందని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అన్నారు. టిజెఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం కార్యదర్శి పుష్పలత అధ్యక్షతన ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదండరామ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మి, సిపిఐ రాష్ట్ర నాయకురాలు, న్యాయవాది విజయలక్ష్మి పండిత్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, టిజెఎస్ మహిళా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గీతాంజలి,న్యాయవాది రేఖ గుప్తా , నాయకులు ఎస్ పుష్పనీల, మెదక్ సక్కుబాయి, లావణ్య, రేఖ, వరలక్ష్మి, రాణి, వేంరెడ్డి లక్ష్మి, జ్యోతి ,శాంతి బాయ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ 1908 లోనే మహిళలు తమకు సమాన హక్కులు కావాలని, ఓటు హక్కు ఉండాలని, సమాన వేతనం కావాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. కుటుంబం నుండే స్త్రీ, పురుష, లింగ వివక్ష పోవాలని, మానవ, నైతిక విలువలను చిన్నప్పటినుండే పిల్లల్లో పెంపొందించే విధంగా చూడాలని సూచించారు.

# ఒట్టి మాటే!

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం దళారుల దోపిడీని చేష్టలూడిగి చూస్తున్నారు తప్ప ఏమి చేయలేని స్థితి.

**రంగంలోకి రాని మార్క్‌ఫెడ్ :**

మొక్కజొన్న పంట చేతికి వచ్చి రైతులు విక్రయించేందుకు సిద్ధమవుతున్న క్రయ, విక్రయాలు జరుగుతున్న మార్క్‌ఫెడ్ మాత్రం రంగంలోకి దిగలేదు. గతేడాది మార్క్‌ఫెడ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,200 చొప్పున కొనుగోలు చేసింది. ఈ ఏడాది రూ.2,400 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించగా ఇంత వరకు మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. మార్క్‌ఫెడ్ రంగంలోకి రాకపోవడంతో దళారులు చెప్పింది ధర అన్న చందంగా తయారైంది. మద్దతు ధర రూ.2,400 ఉండగా ఇప్పుడు క్వింటా కేవలం రూ.1,400 నుంచి రూ.1,500లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్నను విక్రయించేందుకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది గతేడాదితో పోల్చి చూసినప్పుడు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న సాగుతో లాభాలు రాకపోయినా నష్టరాదులే అన్న దీమా రైతుల్లో ఉండేది. ఇప్పుడు మొక్కజొన్న సాగు చేసిన రైతులకు కూడా గిట్టుబాటు ధర లభ్యం కాకపోతే నష్టపోవాల్సి వస్తుందన్న ఆవేదనలో ఉన్నారు.

**మద్దతు ధర అమలుపై కరువైన చిత్తశుద్ధి :**

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులకు నిర్ణయిస్తున్న మద్దతు ధర, పెట్టుబడి, దిగుబడి ఆధారంగా లేదన్నది వాస్తవం. దశాబ్ద కాలంలో వ్యవసాయ రంగ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. కొన్ని పంటలకు సంబంధించి నాలుగు రేట్లు పెరగగా మరికొన్నింటికి పెట్టుబడి ఆరేడు రేట్లు పెరిగింది. వ్యవసాయ యాంత్రీకరణ, రసాయనిక, పురుగు మందుల ధరల పెరుగుల, కూలీ రేట్లు పెంపు వ్యవసాయ పెట్టుబడులు పెరిగేందుకు కారణమయ్యాయి. డా॥ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కాకపోయినా కనీస పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించడం లేదు. వ్యవసాయేతర విషయాలకు వస్తే వస్తు ఉత్పత్తికి అయ్యే ఖర్చు, లాభాలను కలిపి వస్తు ధర నిర్ణయించినప్పుడు ఆమోద ముద్ర వేస్తున్న ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సంబంధించి భిన్నంగా ఆలోచిస్తుంది. అందుకే వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలన్న డిమాండ్‌తో అనేక దశాబ్దాలుగా రైతాంగ ఉద్యమాలు జరుగుతున్నాయి. పాలకులు ఎవరైనా రైతుల పట్ల వివక్షనే ప్రదర్శిస్తున్నారు. రైతాంగ సమ్మతం కాకపోయినా నిర్ణయించిన మద్దతు ధర పైన వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఏ చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మొక్కజొన్నను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామని రైతు సంఘాలు హెచ్చరించాయి.

# మనోవేదన

(మొదటి పేజీ తరువాయి)

రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో దశాబ్దాల పాటు సేవలందించి, పదవీ విరమణ చేసిన వేలాది మంది ఉద్యోగుల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ప్రశాంతంగా గడపా ల్సిన వృద్ధాప్యంలో తమ సొంత నిధుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములై, తమ జీవిత కాలమంతా ప్రభుత్వ సేవకే జీవితం అంకితం చేసిన రిటైర్డ్ ఉద్యోగుల బతుకులు నేడు సర్కార్ తీరు వల్ల దయనీయంగా మారింది.ఉద్యోగం నుండి పదవీ విరమణ చేసిన తర్వాత వచ్చే నిధులతో పిల్లల పెళ్లిళ్లు చేయాలని, ఇల్లు కట్టుకోవాలని, లేదా అనారోగ్య సమయాల్లో వాడుకోవాలని ఆశపడ్డ వేలాది మంది పెన్షనర్లకు నేడు నిరాశే మిగులుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి వారి ప్రాణాల మీదికి తెస్తోంది.

**ఆర్థిక సంక్షోభంలో పెన్షనర్లు..**

తెలంగాణలో మార్చి 2024 నుంచి నేటి వరకు రిటైరైన సుమారు 24,678 మంది ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వీరికి రావాల్సిన గ్రాట్యుటీ, ఎన్ క్యాష్మెంట్, జీఎల్ఐసీ, కమ్యూటేషన్ సహా ఇతర ప్రయోజనాలన్నీ పెండింగ్ లో ఉన్నాయి. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు సుమారు రూ.10వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, అది మాటలకే పరిమితమైంది. ఇదే వేగంతో చెల్లింపులు జరిగితే, మొత్తం బకాయిలు తీరడా నికి మరో పదేళ్లు పడుతుందని, అప్పటి వరకు పెన్షనర్లు బతికి ఉంటారా? అని ఉద్యోగ సంఘాలు నిలదీస్తున్నాయి.

**వైద్యం అందక గాల్లో ప్రాణాలు..**

పదవీ విరమణ చేసిన వారికి వయస్సు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యలు నేడు శాపంగా మారుతున్నాయి. మెరుగైన వైద్యం అందించాల్సిన హెల్త్ కార్డులు రెండేళ్లుగా అలంకార ప్రా యంగా మారాయి. రేవంత్ సర్కార్ హయాంలో ఆర్థిక ఇబ్బందులు, మానసిక క్షోభ కారణంగా ఇప్పటివరకు సుమారు 74 మంది రిటైర్డ్ ఉద్యోగులు మర ణించడం అత్యంత బాధాకరం.

**ప్రాధాన్యత లేని పథకాలకు వేల కోట్లు..**

ఒకవైపు మూసీ పునరుద్ధరణ, ఫోర్త్ సిటీ, అందాల పోటీలు, గాంధీ సరోవర్ వంటి సుంద రీకరణ ప్రాజెక్టుల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. ప్రాణాలు కాపాడే పెన్షనర్ల బకాయిలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మీకు ఇవ్వడానికి ఏ సంక్షేమ పథకం ఆపాలి? అని సీఎం స్వయంగా ఉద్యోగులను అడగడం వారిని బెదిరించడమే నని విమర్శలు వస్తున్నాయి. రైతు భరోసా, రుణ మాఫీ, పెన్షన్ల పేరుతో కాలయాపన చేస్తూ, అనవసరపు హంగులకు ప్రాధాన్యత ఇస్తున్నా రని రిటైర్డ్ ఉద్యోగులు మండిపడుతున్నారు.

**హెల్త్ స్కీమ్ పై పెన్షనర్ల ఆందోళన**

కాంట్రిబ్యూషన్ హెల్త్ స్కీమ్ కింద ఉద్యోగులు, పెన్షనర్ల మూలవేతనం నుంచి 1.5శాతం కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా ఏటా రూ.600 కోట్లు జమ అవుతాయి. అయితే, ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిన రూ.600 కోట్లను విడుదల చేస్తుందా? లేక ఉద్యోగుల నుంచి వసూలు చేసి చేతులు ఎత్తేస్తుందా? అన్న అనుమానం పెన్షనర్లలో బలంగా ఉంది. మొదట ప్రభుత్వం తన నిధులు విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేదంటే ఇది మరో మోసంగా మిగిలిపోతుందనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోరాటాల ఫలితమే.. మహిళలకు హక్కులు



## ఇస్కఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ పాషా

**హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా మహిళలు అనేక పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్, అమృత ఎస్టేట్స్, ఇస్కఫ్ ప్రధాన కార్యాలయంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారి ప్రభాకర్ రావు అధ్యక్షతన 'భారత రాజ్యాంగం మహిళా హక్కులు' అనే అంశంపై సదస్సు జరిగింది. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులతో పాటు సామాజికవేత్తలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ గతంలో మహిళలు అనేక విషయాల్లో వివక్షకు గురయ్యారని, కానీ ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మహిళలు మరింతగా ప్రగతి పథంలో ముందుకు వెళ్ళాలని ఆకాంక్షించారు.

మాజీ ఎం.ఎల్.సి బి.కమలాకర్ రావు మాట్లాడుతూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మహిళలు అనేక రంగాల్లో తమ హక్కులను పోరాడి సాధించుకోవడం హర్షణీయమన్నారు. ఇందిరాగాంధీ, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకుని, తమ హక్కులు సాధించే దిశగా పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాల్, రాష్ట్ర కోశాధికారి ఎ.విజయలక్ష్మి, న్యాయవాది కౌసర్ జాఫోన్, పి.వి. దుర్గాప్రసాద్, కె.శ్రీనివాస్, ఉషారాణి, కమల, సంధ్య, దుర్గాదేవి, ప్రొఫెసర్లు లలితా దాక్షాయని, అరుణాదేవి, కొండల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పునరుద్ధరించిన శాసనమండలి భవనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పునరుద్ధరించిన శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి మేళ తాళాల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండలిలో పూజా కార్యక్రమాలను, అలాగే శాసనమండలిలోని సిఎం చాంబర్‌లో కూడా సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎంఎల్‌సిలతో కలిసి మండలిలో సిఎం కొద్దిసేపు కూర్చొని, వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలోమంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్షనేత మదుసూదన చారి, టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ కుమార్‌గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫండి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ చదువుకుంటే ఒక తరం ముందుకు వెళ్తుంది

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలకు అవకాశం కల్పిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఒక మహిళ చదువుకుంటే ఒక తరం ముందుకు వెళ్తుందని, ఏ సమాజంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తారో ఆ సమాజం అభివృద్ధి చెందిన సమాజమని అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందజేస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్, హెచ్‌పివి వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాళ్లను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్కతో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. అనంతరం మహిళల ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్ టీకాలపై రూపొందించిన స్వల్పకాలిక వీడియోను ఆడిటోరియంలో ప్రదర్శించారు. ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో ఉండే మహిళల భద్రత, వసతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను, సెర్ప్ గతేడాది సాధించిన విజయాలకు సంబంధించిన బుక్‌లెట్లను మంత్రులు ఆవిష్కరించారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులను మంత్రులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మహిళలు ఎదగడానికి ఆకాశమే హద్దని, అవకాశం ఇస్తే వారు అసాధ్యాన్ని కూడా సాధిస్తారని కొనియాడారు. ఆర్‌టిసిలో మహిళాలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా శక్తికి గుర్తింపుగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. మహిళా సంఘాలకు రికార్డు స్థాయిలో రుణాలు మంజూరు చేయడంతో పాటు, సుమారు రూ.1,200 కోట్ల వడ్డీ రాయితీని అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని దాదాపు 46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ హెల్త్ రికార్డును సృష్టించి, ఈ హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో భద్రపరుస్తారని మంత్రి వెల్లడించారు.తద్వారా భవిష్యత్తులో వారి ఆరోగ్య సమస్యలను సులభంగా గుర్తించి, అందుకు తగిన చికిత్స అందించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

## 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026'లో మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు 'ట్రిపుల్ టీ'(టెక్నాలజీ, ట్రస్ట్, టాలెంట్) వ్యూహంతో ముందుకెళ్తున్నామన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం పోలీస్ ఉన్నతాధికారులకు 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026' పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.... ఒకప్పుడు పోలీసింగ్ అంటే కేవలం శాంతి భద్రతల పరిరక్షణ మాత్రమే, ఇప్పుడు డేటా సెక్యూరిటీ, డిజిటల్ ట్రస్ట్‌గా రూపాంతరం చెందిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్రైం కూడా భౌతిక సరిహద్దులను దాటి డిజిటల్ రూపంలోకి విస్తరించిందన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోనింగ్, ఆటోమేటెడ్ ఫిషింగ్ స్కామ్‌లు పోలీసులకు పెను సవాల్‌గా మారాయన్నారు. ప్రస్తుతం నేరగాళ్లకు ఆయుధాలతో పనిలేదని, స్మార్ట్‌ఫోన్, డేటా, డిజిటల్ ఐడెంటిటీస్ తో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఒక్క 2024లో దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ.22,845 కోట్లు కొల్లగొట్టారని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 206 శాతం ఎక్కువన్నారు. సైబర్ బాధితుల్లో నిరక్షరాస్యుల కంటే అక్షరాస్యులే అధికంగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్రొఫెషనలిజం, ఆపరేషనల్ రెడీనెస్, లీడర్‌షిప్, ఇన్నోవేషన్, కొలాబరేషన్, ఎథిక్స్‌తో కూడిన ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ ఆవశ్యకమన్నారు. ఇప్పటికే టెక్నాలజీ ఎనేబుల్డ్ పోలీసింగ్‌లో తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో డేటా అనలిటిక్స్, ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో నేరాల జరగకముందే అడ్డుకునే 'ప్రెడిక్టివ్ పోలీసింగ్'కు పెద్దపీట వేస్తామన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్నప్పుడే అసలైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. నక్సలిజంపై పోరాటంలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్మరించుకున్నారు. వారి త్యాగం వృథా కాలేదన్నారు. కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష భిష్త్, రిటైర్డ్ డిజిపిలు హెచ్‌జె దొర, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడి ఆపాలి



## ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామ్రాజ్యవాద దురాక్రమనే లక్ష్యంగా అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ దేశ అధ్యక్షుడు నేతన్యాహు జియోనిస్ట్ కూటమి ఇరాన్‌పై దాడిని తక్షణమే నిలిపివేసి శాంతిని నెలకొల్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాన్, ప్రధాన కార్యదర్శి కె.దర్మేంద్రలు డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాల దాడిని నిరసిస్తూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రపంచ శాంతి, మానవత్వం కోసం యుద్ధం కాకుండా చర్చలు, రాజదౌత్యం మాత్రమే మార్గమని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించిందన్నారు. అయినప్పటికీ ప్రపంచంలోని సామ్రాజ్యవాద శక్తులు అమెరికా, ఇజ్రాయెల్ తమ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు మధ్యప్రాచ్య దేశాలను యుద్ధ వేదికగా మార్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధం ఎప్పటికీ సాధారణ ప్రజలకు మేలు చేయదని, యుద్ధం వల్ల కార్మికులు, రైతులు, పేద ప్రజలు, మహిళలు, పిల్లలే అత్యంత భయంకరమైన నష్టాన్ని ఎదుర్కొంటారన్నారు. యుద్ధాన్ని ప్రోత్సహించే రాజకీయాలను ఖండిస్తూ ప్రపంచ శాంతి కోసం ప్రజలు పోరాటం చేయాలని ఎఐవైఎఫ్ పిలుపునిస్తోందన్నారు. ఇరాన్‌పై యుద్ధం జరుగుతుంటే మన దేశ ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత విదేశాంగ విధానంలో బాధ్యతారహిత్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు . భారత్ రష్యాతో చమురు ఒప్పందానికి సంబంధించి డొనాల్డ్ ట్రంప్ గడువు నిర్దేశించడమంటే బిజెపి ప్రభుత్వం దేశం యొక్క సార్వభౌమ నిర్ణయాధికారంలో రాజీ పడడమేనన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ తీర్పారీ వెంకటేశ్వర్లు, కూనుకుంట్ల శంకర్, చేపూరి కొండల్, మెస్రం భాస్కర్, మహమూద్ పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే తెలంగాణ రైతు తలెత్తుకుని నిలబడేలా చర్యలు

## మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే తెలంగాణా రైతు తలెత్తుకుని నిలబడేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దనసరి అనసూయ (సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంని పురస్కరించుకొని, 2026ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ, పిజెటిఎయూ, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఆదివారం రెండు రోజుల పాటు జరగనున్న మెగా రైతు మేళాను ప్రారంభమైంది. ఈ మేళాలో రాష్ట్రం నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ రంగ నిపుణులు, వ్యవసాయ విద్యార్థులు ఈ మేళాకి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం వ్యవసాయం, రైతాంగ సంక్షేమమే ఊపిరిగా నిరంతరం పని చేస్తోందన్నారు. అధునాతన నైపుణ్యాలు, టెక్నాలజీలని ఉపయోగించుకొని ప్రజల అవసరాలకి సరిపడా అహారధాన్యాలని రైతులు పండించాలని రాష్ట్ర ఐ.టీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. అలాగే భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణలపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టా లని సూచించారు. మెగా రైతు మేళా నిర్వహిస్తున్నందుకు జయశంకర్ యూనివర్సిటీని పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి ధనసరి అనసూయ సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా 30 మంది మహిళా రైతులకి, ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకి మంత్రులు అవార్డులు అందచేశారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మీన్ బాషా, శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ కోరమాండల్ ఎం.డి.శంకర సుబ్రహ్మణ్యం, ఐకార్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

## 16న శాసనసభ బడ్జెట్ సమావేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11:45 నిమిషాలకు ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాసనసభ మండలి కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి నోటిఫికేషన్ జారీచేశారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజున ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. కాగా, 2026–27 వార్షిక బడ్జెట్‌ను మార్చి 20న శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఈనెల 30 వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి.

# కన్వీనర్ పదవిలో ఎటువంటి నిబంధనలు లేవు

## ఎఐఎఫ్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా దయానంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) తాత్కాలిక కన్వీనర్ అంబటి జోజి రెడ్డి పార్టీకి ద్రోహం చేశారని, పార్టీకి కట్టుబడి ఉన్న కార్యకర్తలను పక్కన పెట్టి, సమన్వయం చేయడంలో విఫలమయ్యారని ఎఐఎఫ్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా దయానంద్ వివరించారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో చేసిన ఏకగ్రీవ తీర్మానం ప్రకారం,రాజ్యాంగానికి విరుద్ధంగా ఏర్పడిన కన్వీనర్ పదవిని రద్దు చేశామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి పదవి కౌన్సిల్ లేదా ప్రతినిధుల సమావేశం ద్వారా మాత్రమే భర్తీ చేయాలని, జనరల్ బాడీ సమావేశంలో, రాష్ట్ర కమిటీ సభ్యుల నుండి ఎటువంటి సంప్రదింపులు, ఆమోదం లేకుండా అంబటి జోజి రెడ్డిని ఏకపక్షంగా కన్వీనర్‌గా ప్రకటించారని తెలిపారు. ఎఐఎఫ్‌బి రాజ్యాంగంలో 'కన్వీనర్' పదవికి ఎటువంటి నిబంధన లేదని, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలను దెబ్బతీసిందన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల కోసం జాగృతి నాయకులకు బిఫామ్‌లను జారీ చేయడంలో రాష్ట్ర కమిటీ ఏలాంటి నిర్ణయం తీసుకోలేదని, కానీ తెలంగాణ జాగృతికి కోట్ల రూపాయలకు బిఫాములను విక్రయించారనే విస్తృతమైన ఆరోపణలు ఉన్నాయన్నారు.

# ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందుకున్న మహిళా పాత్రికేయులకు శుభాకాంక్షలు

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజ అభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా మహిళా జర్నలిస్టులు నిబద్ధతతో, ధైర్యంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చడం అభినందనీయమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందుకున్న మహిళా పాత్రికేయులకు ఆయన అభినందనలు తెలిపారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ, నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ బాధ్యతను మహిళా పాత్రికేయులు అత్యంత కర్తవ్యబద్ధతతో నిర్వర్తిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. ఈ అవార్డులు మహిళా జర్నలిస్టుల కృషికి లభించిన గౌరవమే కాకుండా, మరింత బాధ్యతను కూడా పెంచుతాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

# తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నాం

## ఎఐఎఫ్‌బి కేంద్ర కమిటీ కార్యదర్శి డి.దేవరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) కేంద్ర కమిటీ, పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకత్వంపై జరుగుతున్న తప్పుడు ప్రచారం, ఆధారరహిత వార్తలను ఎఐఎఫ్‌బి కేంద్ర కమిటీ కార్యదర్శి డి.దేవరాజన్ తీవ్రంగా ఖండించారు. ఎఐఎఫ్‌బి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా అంబటి జోజి రెడ్డి కొనసాగుతారని కేంద్ర కమిటీ తరపున ఆయన స్పష్టం చేశారు. బండా సురేందర్ రెడ్డి అకాల మరణం అనంతరం 2025 డిసెంబర్ 4న హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశంలో, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సమక్షంలో అంబటి జోజి రెడ్డిని తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. అనంతరం 2026 జనవరి 10న కోల్‌కతాలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించారని తెలిపారు. పార్టీ తదుపరి రాష్ట్ర మహాసభ జరిగే వరకు, పార్టీ నిబంధనావళి ప్రకారం కొత్త రాష్ట్ర కమిటీ ఎన్నికయ్యే వరకు అంబటి జోజి రెడ్డి రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగుతారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన చేశారు. కన్వీనర్ పోస్టు విషయంలో ప్రచారం జరుగుతున్న విరుద్ధమైన వార్తలు పూర్తిగా అసత్యం, కల్పితం, రాజకీయ ఉద్దేశ్యాలతో ప్రచారం చేయబడుతున్నవేనని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఎఐఎఫ్‌బి రాష్ట్ర అధ్యక్షులు జావేద్ లతీఫ్, కొండా దయానంద్ అనధికారికంగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కేంద్ర కమిటీ గమనించిందని, ఈ చర్యలపై వివరణ కోరుతూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు దేవరాజన్ తెలిపారు. పార్టీ సమిష్టి నిర్ణయాలను దెబ్బతీయడం లేదా పార్టీ ఐక్యతను బలహీనపరిచే చర్యలపై పార్టీ నిబంధనావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర కమిటీ హెచ్చరిస్తోందన్నారు.

# ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు



## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే కాలంలో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమానికి చేవేళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. వారికి రాంచందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీడియాతో రాంచందర్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, గతంలో బిఆర్‌ఎస్‌కు, ప్రస్తుతం కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చినా ఆ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణ ప్రజల డబ్బును ఖర్చు చేస్తోందని విమర్శించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఫుల్‌పేజ్ ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపించారు.



బదిలీపై వెళ్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



బదిలీపై వెళుతున్న జిష్ణదేవ్ వర్మని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళుతున్న జిష్ణదేవ్ వర్మని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి దనసరి అనసూయ(సీతక్క)



జిష్ణదేవ్ వర్మకు హృదయపూర్వక వీడ్కోలు పలికిన లోక్‌భవన్ అధికారులు, సిబ్బంది

## ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉచితంగా న్యాయ సలహాలు సూచనలు పొందాలని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారద, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గోపు రవళిలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు గల వివిధ రకాలైన భూతగాదాల విషయంలో, ఇతర సివిల్ ఇష్యూస్‌లలో ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అత్యవసర సలహాలకు, ఇతర వివరాలకు ప్రభుత్వ ఉచిత న్యాయ సేవా కేంద్రం సలహాదారు పంతంగి కృష్ణ గౌడ్‌ను 9948378995ను సంప్రదించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహశీల్దార్ కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శీతాకాల ప్రత్యేక శిబిరం

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** స్థానిక కెఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో ఆదివారం శీతాకాల ప్రత్యేక శిబిరం రెండవ రోజు మిర్యాలగూడ మండలంలోని గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. గూడూరు పాఠశాలలో నిర్వహించిన పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణయ్య పాల్గొని విద్యార్థుల శ్రమశక్తి ద్వారానే పల్లెల అభివృద్ధి సాధ్యమని గ్రామాల్లో అపరిశుభ్రమైన సమస్యలన్నీ వేగంగా పరిష్కారం కావడానికి విద్యార్థుల సేవలు అమూల్యమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సత్యం, కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, నాగరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్‌రావు, డాక్టర్ స్వప్న, లింగరాజు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## గ్యాస్ ధరలు పెరగడంపై నిరసన

**ప్రజాపక్షం/చిట్యాల :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం వంట గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర పభుత్వం గ్యాస్ ధరలను పెంచడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధరల పెంపును ఉపసంహరించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను చూరగొనక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటి సభ్యురాలు జిట్ట సరోజ, నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, మెట్టు నర్సింహ్మా, మెట్టు పరమేష్, జిట్ట స్వామి, బెల్లి మల్లేశం, ఏళ్ళ మాయ్య, గోధుమగడ్డ వెంకట్‌రెడ్డి, బండారు శంకరయ్య, కందుల అనిత, జిట్ట ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఒకరు అరెస్ట్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి ఒక లారీ, రెండున్నర లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ప్రకాష్ రాజేంద్ర సకరే అనే లారీ డ్రైవర్ ఎస్ కే. షరీఫ్ అనే వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ అంతరాష్ట్ర ముఠా దొంగలతో చేతులు కలిపి చెన్నైకి గోద్రెజ్ కంపెనికి చెందిన 112 రసాయన డ్రమ్ములను తీసుకువెళుతూ ఫిబ్రవరి 08వ తేదిన కొండమల్లేపల్లి గ్రామ శివారులో లారీని దొంగతనం చేశారు. లారీ యజమాని ఎస్‌కే షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా లారీ డ్రైవర్ ప్రకాష్ చెన్నారం గేటువద్ద ఆదివారం అనుమానస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి ఒక లారీని, రెండున్నర లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాలోని మిగతా ఆరుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేధించిన సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్, కృష్ణారెడ్డి, హోమ్‌గార్డ్ శేఖర్‌లను ఎస్పి శరత్ చంద్ర పవార్, డిఎస్పి శ్రీనివాస రావులు అభినందించి నగదు రివార్డులను అందజేసినట్లు తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కార్పొరేటర్ కవిత దయాకర్ పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి రాజకీయ,సామాజిక,వ్యాపార రంగాల్లో పురుషులతో సమానంగా ఎదగాలని 48వ డివిజన్ కార్పొరేటర్ యామా కవిత దయాకర్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని హీరో బైక్ షోరూంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై లింగ వివక్ష, వరకట్న వేధింపులు,లైంగిక దాడులు,గృహహింస వంటి ఘటనలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
మహిళల రక్షణ కోసం చట్టాలు మరింత కఠినంగా అమలు కావాలని అన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో భద్రతతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.షోరూం యాజమాన్యం గట్టు వెంకన్న, గట్టు రాంప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థలో 200 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా అందులో దాదాపు 50 శాతం మంది మహిళలేనని చెప్పారు. కార్యక్రమంలో అమరేశ్వరి,ప్రియాంక, శైలజ, సైదులు, సాయి, సోమ హైమావతి, మురారిశెట్టి నందిని, సంతోషిని, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అధర్మ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలి

అరుణోదయ విమలక్క



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న సామ్రాజ్యవాద అధర్మ యుద్ధాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్ లో (తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం) వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ ఆధిపత్యం కోసం ఇరాన్‌పై దాడులు చేస్తూ వందలాది మందిని హత్య చేస్తుందన్నారు.
యుద్ధనీతిని మరచి హాస్పిటల్స్, బడుల మీద బాంబులు వేస్తూ చిన్న పిల్లలను సైతం హతమారుస్తున్నారని వీరి చర్య అత్యంత దుర్మార్గమైనదన్నారు. అణ్వస్త్రలు ఉన్నాయని నెపంతో దాడులు చేస్తూ గల్ఫ్ దేశాలు అన్నింటిని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి అమెరికా యుద్ధాలు చేస్తుందన్నారు. వినని దేశాల మీద బాంబు దాడులు ప్రయోగిస్తూ హత్యలు కొనసాగిస్తూ తన అనుకూలులతో ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నం చేస్తుందని,అందులో భాగమే ఈ యుద్ధాలన్నారు.మా దగ్గర అపరిమితంగా ఆయుధాలున్నాయని ఎవరైనా నేను(అమెరికా)చెప్పింది వినకుంటే ఇలాంటి పరిణామాలే జరుగుతాయని హెచ్చరించడం సరైంది కాదన్నారు.మార్చి 8 పోరాట స్ఫూర్తిని, సావిత్రి బాయి సామాజిక విప్లవకృషిని ఎత్తి పడదామంటూ,సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి కృషితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్శ అధ్యయన వేదిక నాయకులు కాకి భాస్కర్,మానవ హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షులు చింతమల్ల గురూజీ,మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులువీరస్వామి,అరుణోదయసమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.అనిత, పల్లెబోయిన జానీ, రైతుకూలీ సంఘం నాయకులు బొమ్మకంటి కొమరయ్య,బంటు రామలింగయ్య,వెంకటేశ్వర రావు, జహీరా బేగం, రాజు, వెంకటయ్య, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కలవరపడొద్దు.. కంటికి రెప్పలా కాపాడుకుంటా

బాధితులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య భరోసా



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** 'మీ ఇంటి స్థలంపై సర్వహక్కులు మీవే.. ఒక్క గజం భూమి కూడా ఎక్కడికీ పోదు.. అసత్య ప్రచారాలతో ఆందోళన చెందకండి' అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట వాసులకు కొండంత అండగా నిలిచారు. గత కొద్దిరోజులుగా పట్టణంలోని భూములు, ఇళ్లపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలతో ఆందోళన చెందుతున్న పేద కుటుంబాల్లో ఆయన ధైర్యాన్ని నింపారు. ఆదివారం ఉదయం యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీల్లో 'మార్నింగ్ వాక్' చేస్తూ సామాన్య ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఇళ్లు, ప్లాట్లు కోల్పోతామన్న భయంతో కన్నీరుమున్నీరవుతున్న మహిళలను, వృద్ధులను ఆయన దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కొంతమంది స్వార్థపరులు రాజకీయ ప్రయోజనాల కోసం ధర్నాలు చేస్తూ, సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిషేధిత జాబితాలో కొన్ని సర్వే నంబర్లు ఉన్నప్పటికీ, నివాసముంటున్న ఇళ్లకు కానీ, ప్లాట్లకు కానీ ఎలాంటి ముప్పు లేదని ఆయన సాంకేతిక అంశాలతో సహా వివరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా విష ప్రచారం చేస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు వాస్తవాలను వివరించాలని, ఎవరూ అభద్రతా భావానికి లోనుకాకుండా చూడాలని అధికారులకు సూచించారు.
ప్రభుత్వం పేదల పక్షపాతి అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. నాయకులు చెప్పే అబద్ధాలను నమ్మి ఆందోళన చెందవద్దని, ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పర్యటనతో కాలనీల్లో నెలకొన్న ఉద్రిక్తత తగ్గి, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఎమ్మార్వో గణేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి భరత్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ బరిగే రమ్య,కౌన్సిలర్లు బబ్బురి శ్రీధర్, ముక్కెర్లమల్లేష్, బూడిద మధు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, శ్రీధర్ గౌడ్, కాటపర్తిని ఆంజనేయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రాష్ట్రంలోని మహిళలా అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళా కౌన్సిలర్లను, మహిళా సంఘాల నాయకులను, మహిళా మున్సిపల్ సిబ్బందిని, పారిశుద్ధ్య కార్మికులను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. స్త్రీ సాధికారత కోసం ప్రభుత్వం రుణాలు, సబ్సిడిలు అందిస్తుందన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా రాణించాలన్నారు. మహిళలు ఆకాశంలో సగమే కాదని అన్ని రంగాల్లోనూ తానే అగ్రభాగమని నిరూపిస్తుందని అన్నారు. ఇంటిని చక్కదిద్దే ఇల్లాలుగా, దేశాన్ని నడిపే నాయకురాలిగా స్త్రీ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయాల్లో కూడా మహిళా నాయకత్వాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్వయం సహాయక సంఘాల, వివిధ పథకాల ద్వారా చేయూతనిస్తున్నామన్నారు.
కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ భవనం, ఇండస్ట్రియల్ రోడ్డు నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** మండలంలోని జంకుతండా గ్రామపంచాయతీ భవన కేటాయింపుకు, ఇండస్ట్రీయల్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జంకుతండాలో ఆయన పర్యటించి మాట్లాడారు. ఇండస్ట్రియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వేర్ హౌసింగ్ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న భవనాన్ని గ్రామపంచాయతీ భవన నిర్వహణకు కేటాయించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రోడ్డుపై ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరావత్ చిన్నదానమ్మ, మాలోతు దశరధనాయక్, పాండునాయక్, చందునాయక్, మక్లానాయక్, సోమానాయక్, బిచ్యానాయక్, రవీందర్ నాయక్, నిర్వాహకులు, లక్కనాయక్, మంగి, శంకర్‌నాయక్, సోమానాయక్, దాస్య నాయక్, రాజన్న, గోనానాయక్ పాల్గొన్నారు.



## కొత్త జీవితాన్ని ప్రారంభించాలి

మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతి వ్యక్తికి జీవితంలో మార్పు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నల్లగొండ జిల్లా కారాగారంలో ఏర్పాటుచేసిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళా ఖైదీలు ధైర్యంగా కొత్త జీవితాన్ని ప్రారంభించాలని జైళ్లు శిక్షించే స్థలాలు మాత్రమే కాదు, పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయని అన్నారు. జైలు సూపరింటెండెంట్ కూన ఆనందరావు తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నేరాన్ని ద్వేషించాలి గానీ నేరస్థులను కాదు అనే భావనతో పునరావాస కార్యక్రమాలు మహిళా ఖైదీల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ జైలర్ వెంకట్ రెడ్డి, సుబ్బరాజు,పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది, మహిళ ఖైదీలు పాల్గొన్నారు.

# భజన మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 19 నుండి 28 వరకు జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీ వేదాంత భజన మందిరములో జరుగు శ్రీ సీతారామచంద్ర స్వామి నవరాత్రి ఉత్సవముల సందర్భంగా ఆదివారం ప్రారంభ సూచికగా భక్తులు పసుపు కొట్టి శ్రీరామ నవమి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది పాల్గొని స్వామి సన్నిధిలో పసుపు కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి వేదాంత భజన మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు దేవాలయ ప్రధాన అర్చకులు ధరూరీ సింగరాచార్యులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, నకరికంటి రాజశేఖర్, సోమ అశోక్, ఉప్పల లలిత ఆనంద్, సోమ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

* ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు :** యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చండూరు మండలం బంగారగడ్డ గ్రామంలో నవయుగభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వం , పట్టుదల, జట్టు స్ఫూర్తివంటి విలువలు పెంపొందిస్తాయని తెలిపారు. యువత దేశ భవిష్యత్తు అని యువత చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ చూపి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. క్రీడా మైదానంలో చూపించే కృషి, పట్టుదల, క్రమశిక్షణ జీవితంలో కూడా విజయానికి దారి తీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, బంగారిగడ్డ సర్పంచ్ బోయపల్లి సునీత శ్రీను, సిపిఐ చండూరు మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, ఉప సర్పంచ్ మహబూబ్ ,పల్లె నర్సింహ్మా, పల్లె శంకరయ్య, బోయపల్లి చెన్నయ్య ,టోర్నమెంట్ ఆర్గనైజర్స్ మాదగోని అరుణ్ గౌడ్, బోయపల్లి రమేష్, నాగార్జున, ఖాజా, శ్రీకాంత్ , యగ్నేశ్వర్, రాకేష్, గణేష్, జితేందర్, లెనిన్, చరణ్,రాజు పాల్గొన్నారు.

## మరణంలోనూ మహోన్నతం... ఆరుగురికి ప్రాణదాతగా నిలిచిన యాదమ్మ



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మనిషి జీవితం ముగిసినా మానవత్వం కొనసాగుతుందని మర్రిగూడ గ్రామానికి చెందిన యాదమ్మ కుటుంబం చూపించింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాదమ్మ బ్రెయిన్ డెడ్‌కు గురై శనివారం కన్నుమూసింది. వైద్యులు ఆమె ఇక కోలుకునే అవకాశం లేదని ధృవీకరించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయితే ఆ దుఃఖ సమయంలోనూ వారు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. యాదమ్మ మరణం మరికొందరికి జీవనంగా మారాలని భావించి ఆమె అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. వైద్యుల సహకారంతో ఆమె శరీరం నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన బాధితులకు అమర్చడంతో ఆరుగురికి కొత్త జీవితం లభించనుంది.మా ఇంటి మనిషి దూరమైనా మరికొందరి రూపంలో ఆమె జీవించి ఉంటుందనే భావన మాకు ధైర్యం ఇస్తోంది అని కుటుంబ సభ్యులు భావోద్వేగంగా తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాపక్షం/హాలియా :** పట్టణ పరిధిలోని సాగర్ రోడ్డులో కొత్త మాసు ట్రేడర్స్ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్ఐ తెలిపిన ప్రకారం హాలియాలోని సాగర్ రోడ్డులో కొత్త మాసు ట్రేడర్స్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతాన్ని గాలించి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించినప్పటికీ వెంటాడి మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్దనుండి రూ.53,600 నగదు 7 మొబైల్ ఫోన్లు,మూడు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో బిజిలి సుధాకర్ అలీ నగర్, బొడ్డుపల్లి సైదులు హాలియా, పల్లె మధుసూదన్ రెడ్డి కొత్తపల్లి, జిల్లేపల్లి శ్రీనివాస చారి హాలియా,ఉడుతూరి ప్రభాకర్ రెడ్డి కొత్తపల్లి, షేక్ సైదా హాలియా,వర్కాల శేఖర్ రెడ్డి హాలియా ఉన్నట్లు చెప్పారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జూదం,పేకాట వంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై హాలియా పోలీసులు జీరో టోలరెన్స్ విధానం పాటిస్తున్నారని చెప్పారు.



## మంత్రిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాదులో ఆయన స్వగృహంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని కాజ్వేలకు, పెండింగ్లో ఉన్న బీటి రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలనీ కోరగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయకోడె నగేష్, కాంగ్రెస్ నాయకులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, నోముల వెంకట్ రెడ్డి, దొంతరబోయిన భాస్కర్, పైల్ల మహేష్ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం

**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం చెందుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రామన్నపేట పట్టణ కేంద్రంలో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం స్థానిక నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకొని సిపిఎం ప్రజా ఉద్యమాలకు ప్రజావిరాళం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకనాటి పాత తాలూకా, నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేట నేడు సమస్యల వలయంలో ఉన్నదని, పట్టణ అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని అన్నారు. పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యపై ప్రత్యేక చొరవ చూపి ప్రజా పార్కులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కందుల హనుమతు, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, నాయకులు పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం, బాబూచారి, వేముల మల్లేశం, బండ శ్రీశైలం, మునికుంట్ల రాణి, కుందూరు వెంకటేశం, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'విబి– జి రామ్ జి' లోగో డిజైన్ పోటీ

విజేతకు రూ.50వేల నగదు బహుమతి

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ)' (విబి–జి రామ్ జి) చట్టం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో విబి–జి రామ్ జి పథకం కోసం ప్రత్యేకంగా లోగో డిజైన్ పోటీని ప్రారంభించినట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ పోటీని ప్రభుత్వ అధికారిక పోర్టల్ MyGovలో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో 'గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన' థీమ్‌ను ప్రతిబింబించే విధంగా సృజనాత్మకమైన లోగోలను రూపొందించి పంపాలని ప్రజలను కోరింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టింది. ఈ పోటీలో గెలిచిన వారికి రూ.50వేల నగదు బహుమతిగా అందిస్తామని పేర్కొంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'విబి– జి రామ్ జి' బిల్లు2025 తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 100 రోజులుగా ఉన్న పనిదినాల సంఖ్యను 125కి పెంచింది.



'నేడు' పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ సెషన్ షురూ...

# ప్రతిధ్వనించనున్న ప్రతిపక్షాల నిరసన స్వరం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం చర్చకు రెడీ
- పశ్చిమాసియా సంఘర్షణపై ప్రభుత్వ విధానాన్ని నిలదీయనున్న విపక్షాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ సెషన్‌లో ప్రతిపక్షాల నిరసన స్వరాల గర్జన ప్రతిధ్వనించనుంది. ఈ రెండవ సెషన్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. స్పీకర్ ఓం బిర్లా తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు ప్రతిపాదించిన తీర్మానంపై లోక్‌సభలో చర్చసాగనుంది. ఇరాన్ పట్ల ప్రభుత్వ వైఖరి, భారతదేశానికి రష్యన్ చమురు సరఫరాపై అమెరికా కొంత సడలింపు వంటి ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఇప్పటికే దాడిచేస్తున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కూడా ప్రతిపక్షానికి ప్రధాన అంశం చర్చగా మారనుంది. దీనికి తోడు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో దాదాపు 60లక్షల ఓట్ల తొలగింపునకు దారితీసిన సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) ఓటర్ల జాబితా షాడో పార్లమెంట్ కార్యకలాపాలపై పడుతుందని ఊహిస్తున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా పలువురు ప్రతిపక్షనాయకులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన సభలో బహిరంగంగా పక్షపాత ధోరణిని కనబరుస్తూ కార్యకలాపాలు నిర్వహించారని వారు ఆరోపించారు. లోక్‌సభలో 'ఊహించని చర్య' గురించి మాట్లాడినప్పుడు కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్ కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో చర్చకు సమాధానం ఇవ్వడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీని సభకు రావొద్దని కోరారు. నోటీసు సమర్పించిన తేదీ నుంచి ఓం బిర్లా స్వయంగా సభా కార్యకలాపాలకు హాజరు కాకుండా తప్పుకున్నారు. లోక్‌సభ ఎజెండాను పరిష్కరించిన తర్వాతే తాను తిరిగి సభకు వస్తానని బిర్లా చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం బిర్లాకు మద్దతు ఇచ్చారు. అందరు పార్లమెంట్ సభ్యులను కలుపుకుని వెళ్లానని, తాను భారత రాజ్యాంగ సూత్రాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. అవిశ్వాస నోటీసుతో పాటు అమెరికాఇజ్రాయెల్ దాడులతో పెరుగుతోన్న ఉద్రిక్తతలను పశ్చిమాసియా ఎదుర్కొంటోంది. దీని ఫలితంగా క్రూయిడ్ ఆయిల్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై తీవ్ర నిరసన వ్యక్తం చేయాలని సమాయత్తం అవుతుండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని సభలో జరిగే చర్చల్లో బిజెపి దాడికి సిద్ధమయ్యే అవకాశం లేకపోలేదు. బడ్జెట్ సమావేశాల రెండవ సెషన్‌లో విద్యుత్ సవరణ బి ల్లును ప్రభుత్వం పైలట్ చేయాలని, అదేవిధంగా మొదటి సెషన్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఇతర లెజిస్టేటివ్ పనులను చేపట్టాలని కూడా భావిస్తున్నారు. సోమవారం నాటి అజెండా పేపర్ ప్రకారం స్పీకర్‌కు వ్యతిరేకంగా తీర్మానం మాత్రమే లోక్‌సభ కార్యకలాపాలల్లో జాబితా చేయబడిన అంశంగా ఉందని తెలిసింది. ఈ అంశం పరిశీలనకు వచ్చినప్పుడు సభకు హాజరుకావాలని అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ రెండూ తమ లోక్‌సభ ఎంపీలకు విప్ జారీచేశాయి. ప్రభుత్వానికి అనుకూలంగా లోక్‌సభ సభ్యుల సంఖ్యాబలం గట్టిగానే ఉన్నందున ఈ అంశంపై తీర్మానం లోక్‌సభలో వీగిపోనుంది. కాంగ్రెస్ పార్టీ తమ 118 మంది ఎంపీల నోటీసుపై చర్చకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు వ్యతిరేకంగా తీర్మాణానికి మద్దతు ఇస్తామని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించింది. అయితే ఫిబ్రవరి 19న మరణించిన షిల్లాంగ్ సిట్టింగ్ ఎంపి రికీ సింగ్కాన్‌కు నివాళులు అర్పించేందుకు లోక్‌సభ సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టకపోవచ్చు. ముగ్గురు లోక్‌సభ స్పీకర్లు జి.వి.మావ్లంకర్ (1954), హుకం సింగ్ (1966), బలరాం జక్కర్ (1987) గతంలో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. కాగా అవి తీరస్కరించబడ్డాయి.

పశ్చిమాసియాలో యుద్ధం..

# గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మంది భారత్‌కు



**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుఎఇ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్ దేశాలపైనా ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌లు ప్రయోగిస్తున్నది. దాంతో ఆయా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారత పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే భారత ప్రభుత్వం వారిని అక్కడి నుంచి స్వదేశానికి తీసుకువస్తోంది. ఈ క్రమంలో ఈ నెల మొదటి వారంలో గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మందికిపైగా భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. పశ్చిమాసియాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. గల్ఫ్ రీజియన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి విమానాల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించడంతో ఈ నెల 1 నుంచి 7 మధ్యలో 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వారిలో సుమారు 32 వేల మంది భారత విమానాల్లో స్వదేశానికి చేరుకున్నారని పేర్కొంది. రానున్న రోజుల్లో మరిన్ని విమాన సర్వీసులను అందుబాటులోకి రానున్నాయని వెల్లడించింది. విమాన కార్యకలాపాలు ఇంకా అందుబాటులోకి రాని దేశాల్లో ఉన్న భారత పౌరులు స్థానిక రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌ను సంప్రదించాలని విదేశాంగ శాఖ తన ప్రకటనలో సూచించింది. విదేశాల్లోని భారత పౌరుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఆయా దేశాల్లోని ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తోందని పేర్కొంది.

# జెడియులో చేరిన నితీశ్ తనయుడు

- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి



**పాట్నా:** బిహార్ జనతాదళ్ యునైటెడ్ (జెడియు)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ నాయకత్వంలో జనరేషన్ మార్పునకు సంకేతంగా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ లాంఛనంగా జెడియులో ఆదివారం నాడు చేరారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. 40 ఏళ్ల వయసున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్‌ను కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లాలన్', జెడి(యు) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా వంటి అగ్ర నాయకుల సమక్షంలో పాట్నాలోని ప్రధాన కార్యాలయంలో పార్టీలోకి చేర్చుకున్నారు. పార్టీలో చేరిన తర్వాత నిశాంత్ మాట్లాడుతూ 'నా తండ్రి రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన వ్యక్తిగత నిర్ణయం. మనమందరం దానిని గౌరవించాలి. ఆయన మార్గదర్శకత్వంలో మేము పని చేస్తూనే ఉంటాము. పార్టీని బలోపేతం చేయడానికి నేను కృషి చేస్తాను' అని అన్నారు. బిహార్‌లో ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన తన తండ్రి గత ఇరవై ఏళ్లలో రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని నిశాంత్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చేసిన సహకారాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని ఆయన అన్నారు. 'అందరికీ నా కృతజ్ఞతలు. మీరందరూ నాపై ఉంచిన నమ్మకాన్ని నేను గౌరవిస్తాను. గత 20 ఏళ్లలో నా తండ్రి చేసిన దానికి దేశం, మన రాష్ట్రం, నేను గర్విస్తున్నాము. సిఎం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తాను' అని నిశాంత్ అన్నారు. నితీష్ కుమారుడు వచ్చిన వెంటనే జెడి(యు) కార్యాలయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. పార్టీ కార్యకర్తలు కార్యాలయం వెలుపల గుమిగూడి పార్టీ జెండాలు ఊపుతూ, డప్పులు వాయిస్తూ కనిపించారు. కొత్త ప్రభుత్వంలో నిశాంత్‌ను డిప్యూటీ సిఎంగా చేస్తారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. నితీష్ కుమార్ సన్నిహితుడు శనివారం తన తండ్రి రాజీనామా తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వంలో నిశాంత్‌ను డిప్యూటీ సిఎంగా చేయాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. సిఎం నితీష్ కుమార్ గురువారం రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. హర్నౌత్‌కు చెందిన జెడి(యు) ఎమ్మెల్యే హరి నారాయణ్ సింగ్, నిశాంత్ వచ్చే నెలలో రాష్ట్ర శాసన మండలికి ఎన్నికవుతారని పేర్కొన్నారు.

# ఆలోచించే.. రాజీనామా నిర్ణయం తీసుకున్నా

- గవర్నర్ పదవికి రాజీనామాపై ఆనంద్ బోస్ వెల్లడి



**కోల్‌కతా :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు పశ్చిమబెంగాల్ గవర్నర్ పదవికి ఆనంద బోస్ ఆకస్మికంగా రాజీనామా చేయడం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఆయన స్పందించారు. ఆలోచించే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇందుకు గల కారణాలు సరైన సమయం వచ్చే వరకు గోప్యంగా ఉంటాయన్నారు. కోల్‌కతా ఎయిర్ పోర్టులో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటు వేసేందుకు తిరిగి బెంగాల్‌కు వస్తానన్నారు. 'ప్రవేశం ఉన్నచోట నిష్క్రమణ కూడా ఉంటుంది. బెంగాల్ గవర్నర్‌గా 1200 రోజులు సేవలందించా. క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే 12 సెంచరీలు చేశా. ఇంతకాలం సేవలందించడం చాలు. నిష్క్రమించడానికి ఇదే సరైన సమయమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నా' అని ఆనంద్ బోస్ వివరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పశ్చిమ బెంగాల్‌లో ఎదురైన చేదుఘటన గురించి అడిగిన ప్రశ్నకు బోస్ పరోక్షంగా స్పందించారు. రాష్ట్రపతి ఎంతో అనుభవజ్ఞురాలు, గౌరవప్రదమైన వ్యక్తి అని.. ఆమె అలా మాట్లాడటానికి కారణాలు ఏమైనా ఉండవచ్చన్నారు. రాష్ట్రపతి మాటలపై తాను వ్యాఖ్యలు చేయబోనని అన్నారు. మరోవైపు, కేరళకు చెందిన ఆనంద బోస్.. రాజీనామాకు వారం రోజుల ముందే తన ఓటు హక్కును పశ్చిమ బెంగాల్‌కు మార్చుకున్నట్లు తెలిసింది.

# పురుషుల కంటే మహిళలే తెలివైన వారు

- ముగ్గురు మహిళలు బాస్‌లుగా ఉన్న కుటుంబంలో పెరిగాను
- వారికి ఉన్న సున్నితత్వం, అవగాహన, మేధస్సు సమాజానికి తగిన సమతుల్యతను అందిస్తాయి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** 'ముగ్గురు మహిళలు బాస్‌లుగా ఉన్న కుటుంబంలో తాను పెరిగానని' అన్నారు. సాధారణంగా పురుషుల కంటే మహిళే తెలివైన వారని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని రోజుల క్రితం కేరళ కేరళలో లంచ్ ఇంటరాక్షన్ సమయంలో కొంత మంది విద్యార్థినులను కలిశానని, వారితో చాలా ఆసక్తికర సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళ విద్యార్థులతో ముచ్చటించిన ఓ వీడియోను ఆదివారం తన యూట్యూబ్ ఛానల్‌లో పోస్టు చేశారు. అందులో రాహుల్ గాంధీ విద్యార్థులతో మాట్లాడుతూ 'ప్రతి విద్యార్థిని కలలు, ఉత్సుకత, ఆత్మవిశ్వాసం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు తమ సామర్థ్యాన్ని గుర్తించి, ఓపెన్ మైండ్‌తో ముందుకు సాగినప్పుడు, వారు అసాధారణ మార్పులను తీసుకురాగలరని ఇటువంటి సంభాషణలు మనకు గుర్తు చేస్తాయి' అని రాహుల్ అన్నారు. 'ప్రతి మహిళ ఒక విశిష్టమైనది. వారికున్న సున్నితత్వం, అవగాహన, మేధస్సు (ఎమోషనల్ ఇంటెలిజెన్స్) సమాజానికి తగిన సమతుల్యతను, దిశానిర్దేశాన్ని అందిస్తాయి. మహిళలు తమదైన మార్గాల్లో చాలా ఓర్పుతో, దీర్ఘకాలిక దృక్పథంతో అధికారాన్ని కలిగి ఉంటారు. కాబట్టి వాళ్లు సమాజం విధించే పరిమితులకు లోబడకుండా, తమ గుర్తింపు, వ్యక్తిత్వం, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగేందుకు అవసరమైన ప్రతి హక్కును కలిగి ఉంటారు' అని ఆయన ఎక్స్‌లో మరో పోస్టు పెట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'మీ బలం, ధైర్యం, కలలు సమాజాన్ని సానుకూల భవిష్యత్తు వైపునకు నడిపించాలి' అని ఆకాంక్షించారు. కేరళలోని యువ విద్యార్థులతో ముచ్చటించడం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. 'వారి ఆత్మవిశ్వాసం, తమ కలలపై ఉన్న నమ్మకం, మహిళలే మార్పునకు అంతిమ శక్తి అని నిరూపిస్తున్నాయి' అని అన్నారు. ఆ వీడియోలో రాహుల్ గాంధీ విద్యార్థినులతో సరదాగా ముచ్చటిస్తూ కనిపించారు. 'నేను మహిళలే బాస్‌లుగా ఉన్న కుటుంబంలో పెరిగాను. మా కుటుంబానికి మా నాన్నమ్మ ఇందిరా గాంధీ బాస్. ఈ వద్ద ఉన్నట్లే, మా కుటుంబంలో కూడా ఎప్పుడూ మహిళలే ఎక్కువగా ఉండేవారు. చాలా వరకు పురుషుల కంటే మహిళలే బాగా తెలివైనవారు. పురుషులకు తొందరపాటు ఉంటుంది. పనికిరాని విషయాల్లో గుడ్డిగా వ్యవహరిస్తుంటారు. కానీ మహిళలు దీర్ఘకాలిక దృక్పథంతో ఆలోచిస్తారు. వారు నేరుగా అధికారాన్ని ప్రదర్శించకుండా, పరోక్ష పద్ధతుల్లో అధికారాన్ని ఉపయోగిస్తారు. అది చాలా ప్రభావవంతంగా ఉంటుంది' అని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా లింగ సమానత్వంపై తనదైన రీతిలో స్పందించారు. 'బిఆర్ అంబేద్కర్ చెప్పినట్లు మహిళలు బాధపడడానికి కాదు, ఎదగడానికి జన్మించారు' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'మహిళలు కేవలం అభివృద్ధిలో భాగస్వాములు మాత్రమే కాదు. వారు అభివృద్ధి చోదక శక్తులు. తమ విజ్ఞత, కరుణ, పట్టుదలతో సమాజాలను మరింత బలోపేతం చేస్తారు. బలమైన దేశాలను నిర్మిస్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ధైర్యం, నాయకత్వం, సహకారాన్ని మేము కొనియాడుతున్నాం. సమానత్వం అనేది కేవలం ఆకాంక్షగా కాకుండా, ప్రతి మహిళకు జీవన వాస్తవంగా మారినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది' అని మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ మహిళా దినోత్సవం సందర్భంగా, ప్రతి మహిళ తన శక్తిని, హక్కులను, భవిష్యత్తును తీర్చిదిద్దుకోలిగే తన సామర్థ్యాన్ని గుర్తించాలి. మీ ఉనికి, మీ స్వరం, మీ కలలు ముఖ్యం' అని ఎక్స్‌లో తన సందేశాన్ని ఇచ్చారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరగలేదు

- రాష్ట్రపతి కార్యక్రమంపై బెంగాల్ సిఎం మమతా బెనర్జీ స్పష్టీకరణ



**కోల్‌కతా :** బెంగాల్‌లో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన వివాదం రాజకీయంగా మరింత వేడెక్కింది. రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటే వాటికి ప్రైవేట్ నిర్వాహకులు, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. అయితే పర్యటనలో అవమానం జరిగిందని ఆరోపిస్తూ బిజెపి నేతలు తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడిన మమతా బెనర్జీ, రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని చెప్పారు. దేశంలో రాష్ట్రపతి పదవికి, రాజ్యాంగానికి తాము ఎప్పుడూ గౌరవం ఇస్తామని తెలిపారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయలేదని ఆమె ఆరోపించారు. ప్రైవేట్ నిర్వాహకులు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో చెత్త సమస్య, గ్రీన్ రూమ్ లోపాలు, మహిళల కోసం సరైన టాయిలెట్లు లేకపోవడం వంటి సమస్యలు ఉంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించదని స్పష్టం చేశారు.

**ప్రధాని ఫోటో చూపించిన మమత**

ఈ సందర్భంగా మమతా బెనర్జీ ఒక ఫోటోను చూపిస్తూ బిజెపిపై విమర్శలు గుప్పించారు. ఆ ఫోటోలో ప్రధాని నరేంద్ర మోదీ కూర్చుని ఉండగా రాష్ట్రపతి నిలబడి ఉన్నారని ఆమె పేర్కొన్నారు. 'మేం రాష్ట్రపతిని అవమానించే సంస్కృతి కలిగినవారు కాదు. రాష్ట్రపతిని అవమానించే సంస్కృతి బిజెపిదే' అని ఆమె వ్యాఖ్యానించారు. తాము ఎప్పుడూ రాజ్యాంగాన్ని తల్లిగా భావిస్తామని కూడా ఆమె అన్నారు. ఈ వివాదాన్ని రాజకీయంగా మలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేయాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కాగా, అంతర్జాతీయ సంతాల్ సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్రపతి ముర్ము శనివారం బెంగాల్ వెళ్లారు. అయితే ఆ సదస్సుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో, చివరి నిమిషంలో మరో చోటికి మార్చారు. దీంతో కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే అక్కడికి వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతిని స్వాగతించేందుకు సిఎం, మంత్రులు రావాల్సి ఉండగా రాలేదు. దీనిపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు.

# దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించారు

- మమతా బెనర్జీపై ప్రధాని మోదీ మండిపాటు



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పందించారు. ఢిల్లీలోని పలు ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒక రోజు ముందు బంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం రాష్ట్రపతిని తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు. ఒక్క ముర్మునే మాత్రమే కాకుండా దేశాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని మండిపడ్డారు. గిరిజన సమాజానికి చెందిన ముఖ్యమైన కార్యక్రమాన్ని టిఎంసి బహిష్కరించిందని అన్నారు. రాష్ట్రపతికి గౌరవం ఇవ్వడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సంతాల్ గిరిజన సమాజానికి ఆ వేడుక ఎంతో ప్రాధాన్యం కలిగినదని, రాష్ట్రపతి ముర్ము కూడా గిరిజన సమాజం నుంచే వచ్చిన నాయకురాలని గుర్తుచేశారు. గిరిజనుల సంక్షేమం పట్ల ఆమెకు ప్రత్యేక శ్రద్ధ ఉందని తెలిపారు. ఇక మహిళా సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లక్షపతి దీదీ కార్యక్రమాన్ని ప్రధాని ప్రస్తావించారు. కొన్ని సంవత్సరాల క్రితం మూడు కోట్ల మహిళలను లక్షపతి దీదీలుగా తీర్చిదిద్దుతామని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడుతున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అపారమని, సమాజాన్ని ముందుకు నడిపించడంలో వారు కీలక శక్తిగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు దేశానికి కొత్త శక్తిని అందిస్తూ అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. ఏడాది క్రితం ఢిల్లీ ప్రజలు కొత్త ఆశలు, సంకల్పంతో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నిర్ణయం ఫలితంగా రాజధానిలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు.

**ఢిల్లీలో 33 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభం**

ఢిల్లీలో రూ.33,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. అలాగే కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. నగర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే మెట్రో విస్తరణ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై కూడా ప్రధాని విమర్శలు చేశారు. గత దశాబ్దంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రాజెక్టులు ఫైళ్లలోనే నిలిచిపోయాయని ఆరోపించారు. ఆప్ ప్రభుత్వాన్ని ఆపద ప్రభుత్వంగా పేర్కొంటూ, ప్రజల సమస్యల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. 'ఢిల్లీకి ఏడాది క్రితం వచ్చిన ఆపద నుంచి విముక్తి చాలా అవసరం. ఆ ప్రభుత్వం లేకపోతే మెట్రో ఫేజ్4 ప్రాజెక్టు చాలా ముందే పూర్తయ్యేది. కానీ గత ప్రభుత్వం పనులు చేయకుండా సాకులు చెప్పడానికే పరిమితమైంది' అని మోదీ విమర్శించారు. ప్రస్తుతం ఢిల్లీలో అభివృద్ధి పనులు మిషన్ మోడ్‌లో జరుగుతున్నాయని తెలిపారు. యమునా నది శుభ్రత కోసం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంతో లక్షల వాహనాలు నగరంలోకి రావాల్సిన అవసరం తగ్గిందని వివరించారు. మెట్రో విస్తరణతో తూర్పు, ఈశాన్య ఢిల్లీ ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగవుతుందని ప్రధాని తెలిపారు. అలాగే గాజియాబాద్, నోయిడా, ఫరీదాబాద్, గురుగ్రామ్ గరాలకు ప్రయాణం సులభతరం అవుతుందని చె ప్పారు.

# ఒక్క రూపాయికే ప్రీమియం షూస్..

- భారీగా ఎగబడ్డ జనం.. పోలీసుల లాఠీఛార్జ్

**కోజికోడ్ :** భారీ ఆఫర్లు అంటే చాలు.. జనం ఎగబడి పోతున్నారు. వ్యాపార సంస్థలేమో జనాన్ని ఆకట్టుకునేందుకు రకరకాల ట్రిక్స్ ప్రయోగిస్తున్నాయి. ఇలాంటి ప్రకటనలతో గందరగోళ వాతావరణం ఏర్పడుతున్నా జనాలు మారడం లేదు. తాజాగా కేరళలో ఒక షాపు యాజమాన్యం ప్రకటించిన ఆఫర్.. చివరికి వినియోగదారులపై లాఠీఛార్జి వరకు వెళ్లింది. కేరళలోని, కోజికోడ్‌కు చెందిన ఒక ఫుట్‌వేర్ షాపు తాజాగా ఒక ఆఫర్ ప్రకటించింది. ఒక్క రూపాయికే ప్రీమియం షూస్ అందిస్తామని ప్రకటించింది. కాకపోతే.. అది రూపాయి నోటు తీసుకొస్తేనే. ఒక్క రూపాయి నోటు తీసుకొచ్చిన మొదటి 100 మందికి ఆదివారం ఉదయం తమ షాప్ వద్ద ప్రీమియమ్ షూస్ అందిస్తామని యాజమాన్యం ప్రకటించింది. దీంతో చాలా మంది వినియోగదారులు ఈ ఆఫర్‌కు ఆకర్షితులయ్యారు. వందల సంఖ్యలో, రూపాయి నోటుతో ఆదివారం షాపు వద్దకు చేరుకున్నారు. కొందరైతే శనివారం అర్ధరాత్రి రెండు గంటల నుంచే షాపు వద్దకు చేరుకున్నారు. చాలా దూర ప్రాంతాల నుంచి, ఇతర జిల్లాల నుంచి కూడా జనాలు వచ్చారు. ఆదివారం ఉదయం కల్లా జనాలు భారీగా పోగయ్యారు. దీంతో ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అర్ధరాత్రి నుంచే జనాలు వేచి ఉండటం, భారీ సంఖ్యలో కస్టమర్లు రావడంతో షాపు వద్ద గందరగోళ పరిస్తితి తలెత్తింది. వందల సంఖ్యలో జనాలు ఒకరిపై ఒకరు తోసుకుంటూ ఉన్నారు. అనేకసార్లు తోపులాట జరిగింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరికి పరిస్తితి అదుపుతప్పడంతో కస్టమర్లపై లాఠీఛార్జి ప్రయోగించాల్సి వచ్చింది. ఎలాగోలా పోలీసులు జనాల్ని చెదరగొట్టారు. అయితే, దీనంతటికీ కారణమైన షాపు యాజమాన్యాన్ని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.



ఢిల్లీ ఉత్తమ్ నగర్‌లో యువకుడి హత్య ఘటన..

# నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌లో తరుణ్ అనే యువకుడి హత్య ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో నిందితులపై కఠిన చర్యలకు దిగింది ఢిల్లీ ప్రభుత్వం. ఈ కేసులో ఇప్పటికే ఏడుగురు నిందితుల్ని అరెస్టు చేసిన ఢిల్లీ ప్రభుత్వం తాజాగా నిందితుడి ఇంటిపైకి బుల్డోజింగ్‌కు దిగింది. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) అధికారులు ఉత్తమ్ నగర్‌లోని ప్రధాన నిందితుడి ఇంటిలోని అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేసింది. ఇంటికి సంబంధించి అక్రమంగా నిర్మించిన కొన్ని నిర్మాణాలను బుల్డోజర్ ద్వారా ఆదివారం కూల్చివేసింది. ఈ నేపథ్యంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ చర్య ద్వారా హత్య, హింసను సహించేది లేదని ప్రభుత్వం హెచ్చరించినట్లైంది. హోలీ నాడు చెలరేగిన ఘర్షణలో ఒక కుటుంబంపై మరో వర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో తరుణ్ అనే 25 ఏళ్ల యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో పాల్గొన్న నిందితుల్లో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒక మైనర్ కూడా ఉన్నాడు. మిగతా నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టైన వారిని ఉమర్దీన్ (49), జుమ్మాదీన్ (36), కమ్రుద్దీన్ (36), ముస్తాక్ (46), ముజాఫిర్ (25), తాహిర్ (18)తోపాటు ఒక మైనర్ ఉన్నాడు. ఈ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా కూడా తరుణ్ హత్యపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో పూజ చేసుకుంటున్న వారిపై బాంబుదాడి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో రోజురోజుకీ హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయి. తాజాగా మరో దారుణం చోటు చేసుకుంది. కోమిల్లా ప్రాంతంలో శనివారం పూజ చేసుకుంటున్న హిందూ బృందంపై గుర్తు తెలియని దుండగులు బాంబులు విసిరారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు అక్కడి నుంచి పరుగులు తీశారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు ఈ ఘటనలో గాయపడినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. పూజారి కేశవ్ చక్రవర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగాయి. అప్పటి నుంచి దేశంలోని హిందువులను టార్గెట్ చేస్తూ దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో హిందువులు ప్రాణాలు కోల్పోయారు.

# విప్లవ సాహిత్యం అవసరమా?

నక్సల్స్ ఏరివేత పేరుతో రాజ్యం సృష్టిస్తున్న అరాచకాల ప్రభావం సాహిత్యంపైన కూడా ఉంటుందా? ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ, పరోక్షంగానైనా ప్రభుత్వ విధానాలు సాహిత్యాన్ని ప్రభావితం చేస్తాయనడంలో అనుమానం లేదు. ఈ తరుణంలోనే, విప్లవ రచనలకు సాహిత్యంలో చోటు ఉందా? అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. కొన్ని సామాజిక మాధ్యమాల్లో చర్చ కూడా జరుగుతున్నది. ప్రశ్న చిన్నదే, కానీ, సమాధానం చెప్పడం మాత్రం కష్టం. ముందుగా విప్లవం అంటే ఏమిటనేది ప్రశ్న. విప్లవాన్ని హింసగా, రక్తపాతంగా, మారణహోమంగా చూస్తే మాత్రం అలాంటి సాహిత్యం అవసరం లేదన్నభావం కలగవచ్చు. కానీ, విప్లవాన్ని ఒక మార్పుగా, కుళ్లిపోయిన సమాజాన్ని ప్రక్షాళన చేసే ప్రయత్నంగా చూసినప్పుడు, అలాంటి సాహిత్య అవసం ఎప్పటికీ ఉంటుంది. దోపిడీ కొనసాగుతున్నంత కాలం... అణచివేత ఉన్నంతకాలం... ఆర్థిక అంతరాలు వేధిస్తున్నంత కాలం.. మార్పును ఆహ్వానించక తప్పదు. సమస్యను ప్రజల ముందు ఉంచి, వాటి మూలాలను వివరించి, ప్రశ్నించేలా చేయడమే సాహిత్యమే విప్లవ సాహిత్యమైతే, అలాంటి సాహిత్యం అత్యవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకుంటూ, పేదవాడు మరింత పేదగా మారిపోతూ, అన్యాయాలు, అక్రమాలు రాజ్యమేలుతున్న తరుణంలో, సాహిత్యంపై బాధ్యత మరింతగా పెరిగింది. సాహిత్య చరిత్రను పరిశీలిస్తే రచయితలు అందరూ ఒకే విధమైన పాత్రను పోషించలేదని స్పష్టమవుతుంది. కొందరు రచయితలు వ్యక్తిగత భావోద్వేగాలను, సౌందర్యానుభూతులను, మానసిక సంఘర్షణలను చిత్రిస్తారు. మరికొందరు సమాజంలోని నిర్మాణాత్మక అసమానతలను ప్రశ్నిస్తూ మార్పు కోసం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగిస్తారు. ఈ రెండవ వర్గానికి చెందినవారే విప్లవ సాహితీకారులు. వీరిని రచయితలను మిగతా రచయితలతో సమానంగా చూడాలా? లేక ప్రత్యేకంగా విశ్లేషించాలా? ఈ ప్రశ్న కేవలం సాహిత్యానికి సంబంధించినది కాదు. అది సిద్ధాంతం, చరిత్ర, రాజకీయ చైతన్యం, సామాజిక బాధ్యతలతో సంబంధం కలిగిన ప్రశ్న. ఈ వ్యాసం విప్లవ సాహితీకారుల ప్రత్యేకతను వివిధ కోణాల్లో పరిశీలిస్తుంది. కొంత మంది సాహిత్యం తటస్థంగా ఉండాలన్న ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తడం సహజం. నిజానికి సాంప్రదాయ సాహిత్య దృక్పథం కళను తటస్థంగా చూస్తుంది. కళ కళ కోసమే అనే భావన ప్రకారం రచన రాజకీయాల నుంచి దూరంగా ఉండాలి. కానీ సామాజిక శాస్త్రాలు, ముఖ్యంగా మార్క్సిస్టు సాహిత్య విమర్శ, ఈ భావనను సవాలు చేసింది. ప్రతి రచన ఒక సామాజిక సందర్భం నుంచి పురుడుపోసుకుంటుంది. రచయిత జీవిస్తున్న ఆర్థిక వ్యవస్థ నుంచి వర్గ సంబంధాల వరకు... రాజకీయ పరిస్థితులు నుంచి సంస్కృతిక విలువవల వరకూ ఎన్నో అంశాలు రచనలపై ప్రభావం చూపుతాయి. కాబట్టి, తటస్థ సాహిత్యం అనే భావన సిద్ధాంతపరంగా సందేహాస్పదం. విప్లవ రచయిత ఈ వాస్తవాన్ని స్పష్టంగా అంగీకరిస్తాడు. ఇతర రచయితలు కొన్నిసార్లు అవగాహన లేకుండా పాలక భావజాలాన్ని పునరుత్పత్తి చేస్తారు. ఇక్కడ విప్లవ సాహితీకారుడంటే ఎవరు? అనే ప్రశ్నపై దృష్టి పెట్టాలి. చాలా మంది అనుకున్నట్టు విప్లవ సాహిత్య సృష్టికర్త అంటే కేవలం విప్లవాల గురించి రాసేవాడు కాదు. సమాజాన్ని వర్గ సంబంధాల దృష్టిలో అర్థం చేసుకోవడం, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు అనుసంధానం చేయడం, రచనను ప్రజల అనుభవాలతో జతకలపడం అనే మూడు రకాలైన వర్గ సంబంధాలను అర్థం చేసుకొని ఆలోచించేవాడే విప్లవ రచయిత. సాధారణంగా అనేక సాహిత్య ప్రక్రియలు వ్యక్తి అనుభవాల చుట్టూ తిరుగుతాయి. ప్రేమ, ఒంటరితనం, వ్యక్తిగత సంక్షోభం ప్రధాన అంశాలుగా ఉంటాయి. విప్లవ సాహిత్యం మాత్రం వ్యక్తి అనుభవం సమాజంతో అనుసంధానమవుతుంది. వ్యక్తిగత బాధ వెనుక సామాజిక నిర్మాణం కనిపిస్తుంది. 'నేను' అనే భావన 'మనం'గా



మాక్సిమ్ గోర్కీ



బెర్టోల్ట్ బ్రెఖ్ట్

మారుతుంది. ఈ మార్పే ఇతర రచయితల నుంచి విప్లవ రచయితను వేరుగా చూపిస్తుంది. ప్రత్యేకంగా నిలబెడుతుంది. మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితా సంకలనానికి ముందు మాట (యోగ్యతాపత్రం) రాస్తూ..
'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచ బాధ అంతా శ్రీశ్రీ బాధ' అంటాడు చలం.
సాహిత్య రీతుల దిశను మార్చిన కొత్త ఒరవడిని చలం సూటిగా... సులభంగా చెప్పేశాడు. నిజమే.. ప్రపంచ బాధను అనుభవిస్తేగానీ ఒక అక్షరకారుడు రచయితగా పునీతుడుకాడు. సమాజం మొత్తం వర్గాలుగా విభాజితమైందని వామపక్ష సాహిత్య సిద్ధంతం స్పష్టం చేస్తుంది. నేడు కనిపిస్తున్న నిజం కూడా అదే. ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ ఉన్న వర్గం పాలక వర్గం. చెమట చిందిస్తున్నప్పటికీ, దోపిడీకి గురవుతున్నది మాత్రం శ్రామిక వర్గం. ఈ తేడాను అద్దంలో చూపినట్టు, అక్షరాలలో పొందుపరిచేవారు ఎంతో మంది ఉండవచ్చు. కానీ, ఇలాంటి వ్యవస్థ నిర్మాణానికి మూల కారణాలను శోధించి, మార్పు కోసం ఏం చేయాలో చెప్పగలిగిన వాళ్లు చాలా తక్కువ. ఆ కొద్దిమంది రచయితలనే విప్లవ సాహితీకారులుగా పేర్కోవచ్చు. ఎందుకంటే, అలాంటి రచయిత దోపిడీ నిర్మాణాన్ని విశ్లేషిస్తాడు. శ్రమ విలువను గుర్తుచేస్తాడు. సామూహిక చైతన్యాన్ని పెంచుతాడు. కేవలం భావోద్వేగ స్పందనలా కాకుండా సిద్ధాంతపూర్వక దృష్టితో సమాజాన్ని చదువుతాడు.
ఆంటోనియో గ్రామ్షీ ప్రతిపాదించిన సాంస్కృతిక ఆధిపత్యం భావన ప్రకారం, పాలకవర్గం తన విలువలను సహజమైనవిగా చూపిస్తుంది. ఈ ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి సాహిత్యం కీలకంగా మారుతుంది. అధికారిక కథనాలను ప్రశ్నించినప్పుడు.. ప్రత్యామ్నాయ చరిత్రను వెలికితీసినప్పుడు... ప్రజల అనుభవాలను కేంద్రంగా ఉంచినప్పుడు మాత్రమే విప్లవ సాహిత్య సృష్టి సాధ్యమవుతుంది. రష్యాలో మాక్సిమ్ గోర్కీ, జర్మనీలో బెర్టోల్ట్ బ్రెఖ్ట్, లాటిన్ అమెరికాలో పాబ్లో నెరూడా వంటి రచయితలు ఈ కోవకే చెందుతారు. వారు సాహిత్యాన్ని ఉద్యమంతో కలిపారు. వారు కథలు చెప్పలేదు.. చైతన్యాన్ని నిర్మించారు. వారి రచనలే అందుకు తార్కాణం. బ్రెఖ్ట్ నాటకాలు ప్రేక్షకుడిని భావోద్వేగంలో ముంచకుండా ఆలోచింపజేశాయి. గోర్కీ రచనలు కార్మిక వర్గ స్వీయ అవగాహనకు దారి తీశాయి. నెరూడా కవిత్వం ప్రజా పోరాటాలకు స్వరం ఇచ్చింది. ఈ లక్షణాలు సాధారణ సాహిత్య ధోరణుల నుంచి విప్లవ రచయితలను వేరుచేస్తాయి. మన దేశంలో వలస పాలన, సామంత వ్యవస్థ, కుల అసమానతల నేపథ్యంలో విప్లవ సాహిత్యం పుట్టింది. ప్రజా జీవితాన్ని సాహిత్యంలోకి తీసుకువచ్చిన రచయితలు సాంప్రదాయ సాహిత్యానికి ప్రత్యామ్నాయం సృష్టించారు. స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా, దోపిడీ పెరిగిందే తప్ప తగ్గలేదు. పేదవాడి కష్టాలు తీరనేలేదు. అభివృద్ధి ఫలాలు అతికొద్ది మంది ఖాతాల్లోకి చేరిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విప్లవ రచనలు తప్పనిసరి. ఎందుకంటే, విప్లవ రచయితలు రైతు ఉద్యమాలను ప్రతిబింబిస్తారు. కార్మిక పోరాటాలను గీతాలుగా మలుస్తారు. సామాజిక న్యాయం కోసం సాహిత్యాన్ని ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే భాషను కూడా రాజకీయ, సామాజిక కోణంలోనే చూస్తారు. సంప్రదాయ సాహిత్యంలో రచయిత సంక్లిష్ట పదజాలాన్ని ఉపయోగించి, కేవలం అత్యున్నత మేధావి వర్గానికే రచనలను పరిమితం చేస్తాడు. అందుకు భిన్నంగా విప్లవ సాహిత్యం ప్రజల భాషను ఎంచుకుంది. ప్రజలతో నేరుగా మాట్లాడింది. వారితో మమేకమైంది.
ఎంత గొప్ప సాహిత్యమైనా... ఎంత కీలక స్థానమైనా... ఎక్కడో ఒక చోట, ఏదో ఒక విమర్శ వినిపించకమానదు. విప్లవ సాహిత్యంపైన కూడా అలాంటి విమర్శే ఒకటి తరచు వినిపిస్తూ ఉంటుంది. ఇలాంటి సాహిత్యానికి ప్రచారం ఎక్కువగా ఉంటుందే తప్ప, ప్రనావం చాలా స్వల్పమని, ఎక్కువ కాలం నిలదొక్కుకోలేదని కొంత మంది విమర్శిస్తూ ఉంటారు. అయితే, గొప్ప విప్లవ రచనలు కళాత్మకంగా కూడా ఉన్నాయని చరిత్ర నిరూపించింది. వాస్తవానికి భావజాల స్పష్టత కళాత్మకతను బలహీనపరచదనేది నిజం. ఎందుకంటే, కళాత్మకతకు ఒక స్పష్టతనిస్తుంది. దిశానిర్దేశనం చేస్తుంది. ఒక సాధారణ రచయిత పరిశీలకుడిలా మాత్రమే ఉంటాడు. కానీ, విప్లవ రచయిత మాత్రం ఎంతోకొంత అనుభవాన్ని సంపాదించుకొని ఉంటాడు. ప్రజలతో కలిసి లేకపోతే, ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోలేకపోతే, ప్రజల పక్షాన ఆలోచించకపోతే, విప్లవ సాహిత్యం పండదు. కల్పన ఎంతమందైనా చేస్తారు. వాస్తవంలో కొద్ది మంది మాత్రమే బతుకుతారు. విప్లవ సాహితీకారులు ఈ కొద్ది మంది జాబితాలో చేరతారు. ఒక కరంగా విప్లవ రచయిత ప్రజల మధ్య జీవించి, ఉద్యమ అనుభవాలకు అక్షరరూపాన్ని ఇస్తాడు. సాంస్కృతిక చైతన్యాన్ని నిర్మిస్తాడు. అందువల్ల అతని రచన జీవన అనుభవంతో నిండి ఉంటుంది. అనుభవాలను రాస్తాడు కాబట్టే ఆ రచనలు మానవ విముక్తి ఆశను వ్యక్తపరుస్తాయి. వర్గ భేదాలు లేని సమాజాన్ని కోరుకుంటాయి. దోపిడిని ఎండగడతాయి. అక్రమాలను నిలదీస్తాయి. బాధితుల స్వరమై వినిపిస్తాయి. సాధారణంగా వ్యక్తిగత భావోద్వేగాలు ఏవైనాసరే కాలంతో మారిపోతూ ఉంటాయి. కానీ, సమానత్వ ఆకాంక్ష ఎప్పటికీ మారదు. అందుకే, అలాంటి రచనలకు శాశ్వతత్వం ఉంటుంది. నేటి గ్లోబల్ కాపిటలిజం యుగంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. కార్మికుల సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. దోపిడీ సాధారణమైపోయింది. ఈ పరిస్థితుల్లో విప్లవ సాహిత్య దృష్టి మరింత అవసరం. డిజిటల్ యుగంలో సాహిత్య రూపాలు మారుతున్నాయి. అయినప్పటికీ అసమానతలు కొనసాగుతున్నంత వరకు విప్లవ సాహిత్యం అవసరం ఉంటుంది. కొత్త మీడియా, కొత్త భాష, కొత్త రూపాలతో ఇది కొనసాగుతుంది. అణచివేతలు ఉన్నంత కాలం... దోపిడీ కొనసాగినంతకాలం... మార్పు కోసం, స్ఫూర్తిదాయ రచనలు అవసరం. విప్లవ సాహిత్యం ఆ అవసరాన్ని తీరుస్తుంది. ప్రజలకు మార్గదర్శకం చేస్తుంది.

— సత్యశ్రీ

# బానిస కాదు.. సాహితీ రారాజు

మార్చి 9న జయంతి

ఏదైనా ఒక రంగంలో ప్రావీణ్యం సంపాదించడమే చాలా కష్టం. అలాంటిది సాహిత్యం, చిత్రకళ, జానపద పరిశోధన వంటి రంగాల్లో తిరుగులేని ప్రతిభ కనబరచడం మరింత కష్టం. వీటితోపాటు సామాజిక, రాజకీయ తత్వవేత్తగా కూడా పేరుప్రఖ్యాతులు సంపాదించిన ఘనత తరాస్ హైహొరొవిచ్ షెవ్‌చెన్కో (1814 మార్చి 9–1861 మార్చి 10)కు దక్కుతుంది. నాటి రష్యా సామ్రాజ్య పాలననలోని ఉక్రేన్‌లో ఒక పేద బానిస కుటుంబంలో జన్మించిన అతను చిన్నతనంలో ఎన్నో కష్టాలు పడ్డాడు. ఆ కాలంలో ఎంతో మంది రైతులు సెర్ఫ్స్ అనే వ్యవస్థలో భూస్వాములకు బానిసలుగా జీవించాల్సి వచ్చేది. చిన్ననాటి నుంచే ఆయనకు చిత్రలేఖనంపై ఆసక్తి, ప్రతిభ కనిపించింది. ఈ ప్రతిభ కారణంగా కొంతమంది విద్యావంతుల సహాయం లభించి ఆయనకు కళా విద్య పొందే అవకాశం వచ్చింది. తరువాత సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కళా అకాడమీలో చదివి చిత్రకారుడిగా గుర్తింపు పొందాడు. కళా రంగంలోనే కాకుండా సాహిత్యంలో కూడా ఆయన ప్రతిభ వికసించింది. ఆ క్రమంలో షెవ్‌చెన్కో ఉక్రేన్ భాషలో ఎక్కువగా కవితలు రాశాడు. అప్పట్లో ఉక్రేన్ భాషను తక్కువగా చూడటం సాధారణంగా ఉండేది. అయినప్పటికీ ఆయన తన మాతృభాషలోనే రచనలు చేసి ప్రజల జీవితాలను, బాధలను, ఆశలను కవిత్వంగా వ్యక్తపరిచాడు. ఆయన ప్రసిద్ధ కవితా సంకలనం కోబ్జార్ 1840లో ప్రచురితమైంది. ఈ గ్రంథం ఉక్రేన్ సాహిత్యంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. ఇందులోని కవితలు సామాజిక అన్యాయం, బానిసత్వం, రాజకీయ దోపిడీపై వ్యతిరేక స్వరం వినిపించాయి. ప్రత్యక్షంగా విప్లవానికి పిలుపు ఇవ్వకపోయినా స్వేచ్ఛపై గాఢమైన ఆకాంక్షను వ్యక్తం చేశాయి. షెవ్‌చెన్కో కవిత్వంతో పాటు ఆయన కథలు కూడా రాశాడు. మొత్తం తొమ్మిది నవలికలు, ఒక డైరీ, తన స్వీయచరిత్ర వంటి రచనలు రష్యన్ భాషలో వెలువడ్డాయి. హైదమాకీ అనే ఇతిహాసాత్మక కవిత, మారియానా ది నన్, డ్రౌన్డ్, బ్లైండ మాన్ వంటి రచనలు ఆయన సాహిత్య ప్రతిభను ప్రతిబింబిస్తాయి.



షెవ్‌చెన్కో రచనల్లో ఉక్రేన్ ప్రజల చరిత్ర, సంస్కృతి, జానపద సంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. 1840లలో ఉక్రేన్‌లో జాతీయ చైతన్యం పెరుగుతున్న సమయంలో షెవ్‌చెన్కో కూడా ఆ ఉద్యమంతో పాల్గొన్నాడు. బ్రదర్‌హుడ్ ఆఫ్ సెయింట్స్ సిరిల్ అండ్ మెథోడియస్ అనే రహస్య సంఘంతో ఆయనకు సంబంధం ఏర్పడింది. ఈ సంఘం రష్యా సామ్రాజ్యాన్ని ప్రజాస్వామ్య దిశగా మార్చాలని, స్లావిక్ దేశాలకు సమాన హక్కులు కల్పించాలని కోరుకుంది. ఈ కారణంగా 1847లో ఆయనను అరెస్టు చేశారు. అరెస్టు తరువాత ఆయనపై విచారణ జరిగింది. ముఖ్యంగా ఆయన రాసిన 'డ్రీమ్' అనే కవిత రష్యా సామ్రాజ్యంపై తీవ్ర విమర్శగా పేర్కొనేవారు. ఆ కవితలో జార్ పాలన, సామాజిక అసమానతలను వ్యంగ్యంగా చిత్రించాడు. దీని కారణంగా జార్ నికోలస్ I తీవ్రంగా ఆగ్రహించి ఆయనను మధ్య ఆసియాలోని దూర ప్రాంతాలకు ప్రవాసానికి పంపించాడు. ప్రవాసంలో ఉండగా కవితలు రాయకూడదని, చిత్రాలు గీయకూడదని కూడా ఆదేశించాడు. అయినప్పటికీ షెవ్‌చెన్కో ఆంక్షలను లెక్కచేయకుండా రహస్యంగా రచనలు కొనసాగించాడు. దాదాపు పది సంవత్సరాల తరువాత 1857లో ఆయనకు క్షమాభిక్ష లభించింది. అయితే వెంటనే ఉక్రేన్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. కొంతకాలం తరువాత సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు వెళ్లి మళ్లీ కళాసాహిత్య కార్యకలాపాలను ప్రారంభించాడు. ఆ సమయంలో ఆయనను విద్యావంతుల వర్గాలు గొప్ప రచయితగా గౌరవించాయి. అనేక కళాకారులు, రచయితలతో ఆయనకు పరిచయాలు ఏర్పడ్డాయి. అనేకానేక ఒడిదుడుకుల మధ్య జీవితం సాగడంతో అతని ఆరోగ్యం క్షీణించింది. దానికి తోడు అతిగా మద్యం తీసుకోవడం ఆయన ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీశాయి. అయినప్పటికీ, షెవ్‌చెన్కో చివరి వరకు రచనలు కొనసాగించాడు. 1861లో కేవలం 47 సంవత్సరాల వయసులో ఆయన మరణించాడు. చిన్న వయసులోనే మృతి చెందినప్పటికీ, షెవ్‌చెన్కో సాహిత్య వారసత్వం ఉక్రేన్ సంస్కృతిలో అత్యంత విలువైనదిగా నిలిచింది. ముఖ్యంగా కోబ్జార్ గ్రంథం ఆధునిక ఉక్రేన్ సాహిత్యానికి పునాది వేసింది. ఆయన రచనలు ఉక్రేన్ భాష అభివృద్ధికి కూడా ప్రేరణగా నిలిచాయి. అందుకే కొంతమంది విమర్శకులు ఆయనను స్కాట్లాండ్ కవి రాబర్ట్ బర్న్స్‌తో పోలుస్తారు. ఇద్దరూ తమ తమ దేశాల జాతీయ భావజాలాన్ని కవిత్వం ద్వారా వ్యక్తం చేశారు. సాహిత్యంపై తనదంటూ ముద్రవేసిన షెవ్‌చెన్కోను కవిగానేగాక, జాతీయ చైతన్య ప్రతీకగా పేర్కొంటారు. బానిసత్వం నుండి వచ్చిన ఒక సాధారణ వ్యక్తి తన ప్రతిభతో, ధైర్యంతో ఒక దేశ సాంస్కృతిక చరిత్రను ప్రభావితం చేయగలడని ఆయన జీవితం రుజువు చేస్తుంది. ఆయన కవిత్వం న్యాయం, స్వేచ్ఛ, జాతీయ గౌరవం వంటి విలువలను ప్రతిబింబిస్తూ నేటికీ ఉక్రేన్ ప్రజలకు ప్రేరణగా నిలుస్తోంది.

ఈ వారం కవితలు

## కలంతో ప్రభంజనం



కలమే నా ఆయుధం –
పేనా చేతబట్టి
భావాల సముద్రాన్ని
ఉప్పొంగింపజేస్తా.

పదాలు అల్లుతా –
మనసుల నూలుతో
అర్థాల వస్త్రాన్ని
సూక్ష్మంగా నేస్తా.

పంక్తులు కూర్చుతా –
స్వరాల తాకిడిలో
సౌందర్యపు
సింహాసనం నిర్మిస్తా.

పుటలు నింపుతా –
ప్రాణం పోసిన
ఆలోచనలతో
హృదయాల్లో వెలుగులు
నింపుతా.

మౌనంలో దాగిన
స్వరాలకు
సామాజిక వేదికనిచ్చి
సత్యాన్ని గర్జనగా నిలుపుతా.

అలసిన ఆశలకు
ఆధారమవుతూ
నిరుత్సాహ నిశిలో
నూతన నక్షత్రం నాటుతా.

రసధార ప్రవాహంలో
మనసులను ముంచెత్తి
అక్షరాల అమృతంతో
జీవితార్థం తెలుపుతా.

ఇదే నా ప్రయాణం –
కలంతో ప్రభంజనం,
కవిత్వంతో క్రాంతి,
భావంతో భవిష్యత్తు!

— గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

## రాబందు



పతనం అంచున వాడు
వాడి ఆలోచనలో తొట్రుపాటు
జనాన్ని ఆలోచించనీయడు
యుద్ధానికి తెరదీసి గట్టెక్కే తెంపరి
తనం

ఆ తెల్లని భవనంలో ఎవడున్నా
ఆక్రమణే ధ్యేయంగా
వనరులున్న నేలపై విస్ఫోటనాలు
అనాదిగా!
దేశాధ్యక్షుల చెర లేదంటే హత్య !

ఎన్నెన్నో సమితిలు పుట్టి
బతుకుతున్నా జీవచ్ఛవాలుగా
వున్నాయ్
అధికారాలు అడకత్తెరలో పోక
చెక్కలా
కత్తిరించబడుతున్నాయ్

యుద్ధం నాగరికతను సమాధి
చేస్తోంది
దోచుకునే కొత్త ఎత్తుగడ యుద్ధం
యుద్ధమే లేకపోతే వ్యాపారమే
లేదు !
వాడికి మనుగడే లేదు!
మనిషిని బుగ్గి చేయనిదే వాడికి
నిద్ర పట్టదు !

జాతుల్లేవ్ మతాల్లేవ్ జెండాలు
ఎజెండాల్లేవ్
వున్నదల్లా వనరులపై రాబందు
కన్ను!
కాటేసే దాకా ఊరుకోడు వాడు
వాడి నైజమే అది! వెన్నతో పెట్టిన
విద్య!!

కెవ్వున ఏడుస్తున్న పసిపాపల
రోదనల వెనుక
ఆకలి లేదు! దప్పిక లేదు!!
పుట్టిన నేరానికి బతకనివ్వమనే ఆ
ఏడుపులు వాడికెక్కవు!
వాడొక కఠిన శిల!!
ఏదోనాడు చెక్కే శిల్పి ఉదయి
స్తాడు లే!!

— గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## చదవాల్సిన పుస్తకం

### ఉత్తరాలలో విజ్ఞానం



భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన కుమార్తె, ఇందిరా గాంధీకి రాసిన లేఖల సంకలనం 'లెటర్స్ ఫ్రంట్ ఎ ఫాదర్ టు హిస్ డాటర్' పేరుతో వెలువడింది. ఈ పుస్తకం 1929లో మొదట ప్రచురితమైంది. ఇందులో మొత్తం 30 ఉత్తరాలు ఉన్నాయి. వీటిని 1928 వేసవికాలంలో రాశారు. అప్పుడు ఇందిర వయస్సు కేవలం పది సంవత్సరాలు మాత్రమే. నెహ్రూ అలహాబాద్‌లో ఉండగా, ఇందిర ముస్సూరీలో నివసిస్తూ చదువుకుంటోంది. ఆ సమయంలో తండ్రి–కుమార్తె మధ్య దూరం ఉన్నందున నెహ్రూ ఉత్తరాల ద్వారా ఆమెకు విద్యాబోధ చేయాలని నిర్ణయించాడు. అందుకే, ఈ ఉత్తరాలు సాధారణ కుటుంబ ఉత్తరాలు కాకుండా, ఒక చిన్నారికి ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధంగా రాసిన చిన్న చిన్న పాఠాలుగా కనిపిస్తాయి. విజ్ఞానాన్ని అందిస్తాయి. నెహ్రూ ప్రకృతి చరిత్ర, మానవ చరిత్ర, నాగరికత అభివృద్ధి వంటి విషయాలను చాలా సరళంగా వివరించాడు. చిన్న పిల్లలకూ అర్థమయ్యేలా ఆయన క్లిష్టమైన విషయాలను కథలా చెప్పాడు. అందువల్ల ఈ పుస్తకం విద్యాత్మకమైనదిగా కూడా గుర్తింపు పొందింది. ఈ ఉత్తరాలలో ప్రధానంగా భూమి ఎలా ఏర్పడింది, జీవులు ఎలా అభివృద్ధి చెందాయి, మానవ సమాజం ఎలా ఎదిగింది అనే విషయాలను వివరించారు. ప్రకృతి, నదులు, పర్వతాలు, జంతువులు, మొక్కల సృష్టి వంటి ఎన్నో అంశాలను ప్రస్తావించారు. తన కుమార్తెకు ప్రపంచాన్ని విశాలంగా చూడాలని, ప్రకృతిని గౌరవించాలని నెహ్రూ భావించారు. ఈ కోణంలోనే ఆయన చరిత్రను కూడా ఒక కథలా వివరించారు. మానవ నాగరికత ఎలా మొదలైందో, మనుషులు ఎలా సమాజాలను నిర్మించారో ఆయన వివరించారు. ఈ ఉత్తరాలలో కనిపించే ముఖ్యమైన అంశం నెహ్రూ విద్యా దృష్టి. ఆయన విద్యను పుస్తకాలకే పరిమితం చేయకుండా, ప్రపంచాన్ని గమనించడం, ప్రకృతిని అర్థం చేసుకోవడం, ప్రశ్నలు అడగడం వంటివి కూడా అత్యవసరమని స్పష్టం చేశారు. ఇందిరకు కూడా అదే విధంగా ఆలోచించాలని ప్రోత్సహించారు. ఈ విధంగా ఈ ఉత్తరాలు ఒక తండ్రి తన కుమార్తెకు ఇచ్చే బోధనలుగా కనిపిస్తాయి. ఈ పుస్తకానికి మరో ప్రత్యేకత భాష. నెహ్రూ చాలా సరళమైన, చక్కటి ఆంగ్లంలో ఈ ఉత్తరాలను రాశారు. అందువల్ల చిన్నపిల్లలు కూడా సులభంగా చదవగలుగుతారు. క్లిష్టమైన చరిత్ర విషయాలను కూడా ఆయన చిన్న కథల మాదిరిగా వివరించారు. ఈ విధానం వల్ల ఈ పుస్తకం పిల్లలకు మాత్రమే కాదు... పెద్దలకు కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ పుస్తకం తరువాత అనేక భాషల్లోకి అనువాదమైంది. హిందీలో ప్రసిద్ధ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ దీనిని 'పితా కే పత్ర్ పుత్రి కే నామ్' అనే పేరుతో అనువదించారు. ఈ అనువాదం వల్ల భారతదేశంలో మరింత మంది పాఠకులకు ఈ పుస్తకం అందుబాటులోకి వచ్చింది. తరువాత మరెన్నో భాషల్లో కూడా దీనికి అనువాదాలు వచ్చాయి. దీనిని తెలుగులోకి కాటూరి వేంకటేశ్వరరావు 'చిరంజీవి ఇందిరకు... జవహర్‌లాల్ నెహ్రూ లేఖలు' పేరుతో అనువదించారు. గజిబిజి లేకుండా, జిగి బిగి సడలకుండా అద్భుతంగా తెలుగులో అందించారు. నెహ్రూ దార్శనికత, ప్రపంచ విజ్ఞానం అనే రెండు కోణాలు ఈ పుస్తకంలో స్పష్టంగా ఉంటాయి. అందంగా పలకరిస్తాయి. చరిత్ర పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

**పుస్తకం పేరు**

చిరంజీవి ఇందిరకు... జవహర్‌లాల్ నెహ్రూ లేఖలు
వెల: రూ. 80
అనువాదం: కాటూరి వేంకటేశ్వరరావు

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## యుద్ధ ప్రభావాన్ని వివరించే 'మార్చి 10, ఎన్‌వై'



కొన్ని కవితలు నిత్యం గుర్తుకొస్తునే ఉంటాయి. అలాంటి వాటిలో జీన్నెట్ ఎల్. క్లారియాండ్ రాసిన 'మార్చి 10, ఎన్‌వై' ఒకటి. ఈ కవిత 2003లో, ఇరాక్‌పై అమెరికా జరిపిన దాడిని ప్రతిబింబిస్తుంది. ఇరాక్ రాజధాని బాగ్దాద్ నగరంపై జరిగిన వైమానిక దాడులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. ఆ సంఘటన మానవీయ ప్రభావాన్ని, యుద్ధం వల్ల కలిగే బాధను ఈ కవిత ప్రతిబింబిస్తుంది. ఈ కవితలో కవయిత్రి న్యూయార్క్ నగరంలో ఉన్నప్పటికీ, బాగ్దాద్‌లో జరుగుతున్న వినాశనాన్ని తన మనసులో అనుభూతి చెందుతుంది. మార్చి 10, న్యూయార్క్ అనే శీర్షికలోని ఎన్‌వై అనే అక్షరాలు న్యూయార్క్‌కు సంక్షిప్త రూపం. అంటే ఒక నగరంలో ఉన్న వ్యక్తి దూరంలోని మరో దేశంలో జరుగుతున్న యుద్ధాన్ని ఎలా భావోద్వేగానికి గురి చేస్తుందనే విషయాన్ని ఈ కవిత తెలియజేస్తుంది. ప్రపంచం ఎంత పెద్దదైనా, మానవ బాధ మాత్రం అందరికీ ఒకేలా అనిపిస్తుందని ఈ కవిత స్పష్టం చేస్తుంది. ఇందులో, యుద్ధం, మానవత్వం మధ్య ఉన్న విరుద్ధతే ప్రధానంగా కనిపించే అంశం. యుద్ధం రాజకీయ నిర్ణయాల వల్ల జరుగుతుంటుంది, కానీ దాని ప్రభావం సాధారణ ప్రజల జీవితాలపై పడుతుంది. బాంబు దాడులు, భయం, నాశనం వంటి దృశ్యాలు కవితలో భావోద్వేగ పూరితంగా ఆవిష్కృతమవుతాయి. కవయిత్రి ప్రత్యక్షంగా యుద్ధాన్ని వివరించకుండా, ఆ సంఘటనల వల్ల కలిగే మానసిక వేదనను ప్రతిబింబిస్తుంది. కవితలోని శైలి చాలా నిశ్శబ్దంగా, ఆలోచనాత్మకంగా ఉంటుంది. అది ఒక వార్తా నివేదికలా కాకుం డా, ఒక మనిషి మనసులో ఉద్భవించే ప్రశ్నలలా ఉంటుంది. ఎందుకు యుద్ధం జరగాలి?, ఎందుకు నిరపరాధులు బాధపడాలి? వంటి భావనలు కవితలో ప్రతిఫలిస్తాయి. ఈ విధంగా కవిత మనలను యుద్ధం యొక్క నైతికత గురించి ఆలోచింపజేస్తుంది. ఈ కవితను మరో కోణంలో చూస్తే, ఇది ప్రపంచీకరణ కాలంలో అడుగంటుతున్న మానవ సంబంధాల గురించి కూడా చెబుతుంది. అదే సమయంలో, ఆధునిక మీడియా, వార్తల ద్వారా దూర ప్రాంతాల్లో జరిగే సంఘటనలు కూడా మన జీవితాలను ప్రభావితం చేయగలవని నిరూపించింది. ఒక నగరంలో కూర్చొని ఉన్న వ్యక్తి వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న సంఘటనల వల్ల బాధపడగలడు. ఈ భావనను కవిత సున్నితంగా వ్యక్తం చేస్తుంది. స్థూలంగా చెప్పాలంటే, యుద్ధం వల్ల కలిగే మానవీయ విషాదాన్ని ప్రతిబింబించే ఆలోచనాత్మక రచన ఈ కవిత. ఇది రాజకీయ వ్యాఖ్య మాత్రమే కాదు; మానవ హృదయం ఎలా స్పందిస్తుందో చూపించే రచన. యుద్ధం వెనుక ఉన్న బాధ, భయం, అనిశ్చితి వంటి భావాలను గుర్తుచేస్తూ ఈ కవిత శాంతి విలువను మనకు గుర్తుచేస్తుంది.

## మహిళల ప్రతిభ.. దేశ ప్రగతికి శక్తి



**ప్రజాపక్షం/కరీంనగర్:** మహిళలు శక్తికి స్వరూపులని, వారు ఆకాశమే హద్దుగా భావిస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ పిలుపునిచ్చారు. మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, ఐకీయాలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలో ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్ తదితర జిల్లా అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ మహిళ సాధికారత దేశ అభివృద్ధికి పునాది అని తెలిపారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో మహిళల పాత్ర అపారమని, మహిళలకు మరిన్ని విస్తృతంగా అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతి మరింత వేగంగా సాగుతుందని అన్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్‌లను మహిళా అధికారులు శాలువాలతో సత్కరించారు. వారు మహిళా అధికారులు సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ, సీడీపీవోలు, సూపర్వైజర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ కలలు గన్న స్వరాజ్యాన్ని నిజం చేసిన కెసిఆర్: హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** మహాత్ముని స్ఫూర్తితో కెసిఆర్ హయాంలో గ్రామాలకు మహర్ధశ అని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. గాంధీ గ్రామస్వరాజ్యం స్ఫూర్తితో పల్లెల అభివృద్ధికి కెసిఆర్ పాటుపడ్డారన్నారు. చిన్నకోడురు మండలం చౌడారం గ్రామంలో గాంధీ విగ్రహా ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో సిసి కెమెరాలు ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మగాంధీ అహింస మార్గదర్శి అన్నారు. మహాత్మగాంధీ జీవితం గొప్ప సందేశమన్నారు. వారు చూపించిన అహింస, సత్యగ్రహ మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. గాంధీజీ బాటలోనే కెసిఆర్ యావత్ తెలంగాణ సమాజం, స్వరాష్ట్రం కోసం శాంతియుత పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో పల్లెల అభివృద్ధికి కెసిఆర్ పాటుపడినట్లు తెలిపారు. గాంధీజీ కలలు నిజం చేసారన్నారు. 60 ఎండ్లలో చేయని అభివృద్ధి కెసిఆర్ గ్రామాల అభివృద్ధి చేసి గ్రామాల స్వరూపాలను మార్చారన్నారు. పల్లెల్లో తాగునీరు మిషన్‌భగరథ, పల్లె ప్రగతి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి రైతుభరోసా, రైతుబంధు. రైతుబీమా లాంటీ ఏన్నో అద్భుతమైన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో చౌడారం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకొని ఆదర్శంగా నిలుపుకుందామన్నారు. ఐక్యతతో ఉండి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడు నాసహాకారం ఉంటుందన్నారు. చౌడారంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలకు 2లక్షలు అందచేసిన ముక్కెర శ్యామలను మాజీ మంత్రి హరీష్‌రావు అభినందించారు.

## నాణ్యమైన విద్యా ప్రమాణాలకు నిదర్శనం సిద్ధార్థ విద్యాసంస్థలు



**ప్రజాపక్షం/చొప్పదండి:** నాణ్యమైన విద్యాప్రమాణాలకు నిదర్శనంగా సిద్దార్థ విద్యాసంస్థలు నిలుస్తున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి పట్టణంలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా విద్యారంగానికి అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. నాణ్యమైన ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థలు కొన్ని మాత్రమే ఉంటాయని, ఆ కొన్నింటిలో సిద్దార్థ విద్యాసంస్థలకు చోటు ఉందని అన్నారు. విధ్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడం హర్షణీయమన్నారు. ఈ సంధర్బంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోవడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య గౌడ్, సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర నాయకులు పుల్యాల లక్ష్మారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, విధ్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అడవి శ్రీరాంపూర్‌లో తాటి చెట్టుకు పసుపు రంగులో వింతగా కల్లు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని తాటి వనంలో తాటి చెట్టుకు వింతగా పసుపు రంగులో తాటి కల్లు పారడం పట్ల గౌడ కులస్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు.రోజువారీగా తాటి చెట్లు ఎక్కేందుకు వచ్చిన కునూరి సత్తయ్య గౌడ్ తాటి చెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా తాటికల్లు పసుపు రంగులో అర లీటర్ బాటిల్ రాగా ఆ గౌడ్ ఆశ్చర్యానికి గురయ్యారు. రోజు తాటికల్లు తెలుపు రంగులో వచ్చే కళ్ళు ఆదివారం రోజున ఈ పసుపు రంగులో కళ్ళు రావడం ఏంటని గౌడ్ ఆశ్చర్యానికి గురవుతూ వెంటనే తాటి చెట్టును దిగుతూ తోటి గీత కార్మికులకు ఈ విషయాన్ని తెలిపారు. అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని తాటి వనంలో ఎల్లమ్మ గుడి నిర్మాణం పనులు పూర్తి అయి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉన్నందున ఎల్లమ్మ తల్లి దివ్య ఆశీస్సులతోనే తాటికల్లు పసుపు రంగులో పారిందంటూ గౌడ కులస్తులు ఒకరికొకరు చెప్పుకోవడంతో ఈ విషయం కాస్త గ్రామంలో మొత్తం వైరల్ అవడంతో ఆ తాటికల్లును చూసేందుకు గ్రామస్తులు తాటివనానికి ఎగబడ్డారు. ఏది ఏమైనా రోజువారీగా తాటికల్లును గీసే సత్తన్న గౌడ్ తాడిచెట్టుకు పసుపు రంగులో తాటికల్లు రావడంతో ఆ తల్లి మహిమ అంటూ ఎల్లమ్మ తల్లికి మొక్కుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని త్వరలోనే గుడి ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే సిఎం లక్ష్యం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి:** తెలంగాణ రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మహిళలకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంపై తొలి సంతకం చేసి మహిళలకు బస్సు సౌకర్యం కల్పించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో మణిదీప, వినాయక గ్రామ పరస్పర సహాయక పొదుపు, పరపతి సహకార సంఘం నూతన భవనాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరుల చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకి ఆర్టీసీ బస్సులు నడిపించుకునే అవకాశం కల్పించడంతోపాటు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు సంఘటితంగా ఆర్థిక పరిపుష్టి సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాజారాం పల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి చెందడానికి సహకరిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో మటన్ ప్రాసెసింగ్ యూనిట్ తో పాటు మరిన్ని పథకాలను తీసుకురావడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కోసం అవకాశాలు కల్పించాలని గ్రామ సర్పంచి సంగ రమేష్ మంత్రి గారిని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీమతి లత,మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక తదితరులు పాల్గొన్నారు.





**నృసింహుడి ఆశీస్సులు ప్రభుత్వంపై ఉండాలి**

జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రథోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కు మార్ మాట్లాడుతూ ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవ కార్యక్రమం ప్రతి యేటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దయతో పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ లో తనకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం తరుపున పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ధర్మపురి పుణ్యక్షేత్రాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి , ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరలు పెంచడం ప్రజలపై భారం మోపడమే

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, రమేశ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** వంట గ్యాస్ ధరలను చమురు మార్కె టింగ్ సంస్థలు భారీగా పెంచి సామాన్య ప్రజల పై పెను భారాన్ని మోపడాన్ని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. పెరిగిన ధరలు ఈ రాత్రి నుంచే అమలులోకి వస్తున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. గృహ వినియోగ సిలిండర్ పై రూ.60, కమర్షియల్ సిలిండర్ పై రూ. 115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ పెంపుద లతో గృహ వినియోగ సిలిండర్ ధర వెయ్యి రూపాయలకు చేరు తుందన్నారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు పెరగడంతో హోటల్స్ లో, రెస్టారెంట్లో వినియోగదారుల పై ఆర్థిక భారం పడు తుందన్నారు. అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు ఇరాన్ దేశానికి మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినందున వంట గ్యాస్ ధరలు పెంచక తప్పలేదని చమురు సంస్థలు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పుడు దేశంలో ధరలు తగ్గించిన దాఖలాలు లేవన్నారు. త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయని ఇస్తున్న సంకేతాలను బట్టి వాటి ధరలు కూడా అంతులేకుండా పెరిగి సామాన్య ప్రజల బ్రతుకులు ఆగమయ్యే పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. మోడీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల అనుకూల విధానాలతో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలంటి ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతం అన్నారు. వంట గ్యాస్ ధరలు తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహిళా దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బి.సౌజన్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్భంగా మహిళా సిబ్బందిని,స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న తమ తల్లులను,భార్యలను శాలువాతో సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజల భధ్రత కోసం నిబద్దతతో విధులు నిర్వహించాని అందుకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇస్తామన్న 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు డిమాండ్ చేశారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సిపిఐ కార్మిక భవనం సుభాష్ నగర్ లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1911 మార్చ్ 8 న న్యూయార్క్ నగరం లో మహిళకు సమాన హక్కులు, పనిగంటల తగ్గింపు, లింగ సమానత్వం కోసం మొట్టమొదటి సారీగా పోరాటం చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. నేటి సమాజంలో మహిళలు, చిన్నపిల్లల పై లైంగిక దాడులు, అణిచివేత, వేధింపులు ఉండద్దన్నారు. భద్రమైన ప్రదేశాలు, భరోసా ఏర్పడేలా చూడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిపెస్టో లో పెట్టిన విధంగా విదంగా 4016 ఆసరా పెన్షన్, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలు స్వయం ప్రతిపత్తి సాధించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం సిపిఐ పార్టీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కె.వి. అనసూర్య, మ్యాన సిద్దమ్మ, కోడం ప్రమీల,గుంటుకు మనవ్వ, వెంగల లత, చింత కింది మనవ్వ తదితర మహిళా సంగం నాయకులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల లోపు బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** జిల్లాలోని 14 నుంచి 15 ఏండ్ల వయసులోపు బాలికలకు హెచ్ పీ వీ (హ్యూమన్ పాపి లోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు అనగా (ఏప్రిల్1 తేదీ 2011 మార్చి31 తేదీ 2012 మధ్య పుట్టిన) పలువురికి వ్యాక్సిన్ లు వేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఆడపిల్లల తల్లిదండ్రులు బాధ్యత వహించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని పిలుపు ఇచ్చారు. జిల్లాలో 3, 773 మంది బాలికలను గుర్తించారని, బాలికల తల్లి దండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టామని తెలిపారు.

**మహిళా దినోత్సవ వేడుకలు..**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, డీఎం హెచ్ ఓ రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టింటిలో మహిళ మొదటి దైవం




**ప్రజాపక్షం/సిద్దిపేట:** పుట్టింటిలో మహిళ మొదటి దైవం తల్లి అని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ప్రతి ఇంటి బాధ్యత మహిళా హక్కును దాన్ని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. దేశంలో వృద్దాశ్రమంల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుందని.. వాటిని తగ్గించే విధంగా అందరు సహకరించాలన్నారు. మెట్టింట్లో అత్తమామలను తల్లిదండ్రుల వలే చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట కోమటిచెరువుపై సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మహిళలు ప్రతిరోజు మహిళా దినోత్సవం వలే ఆనందంగా గడుపాలని,సుబీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మహిళలందరికి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు. కమిషనర్ అశ్రీత్‌కుమార్, మహిళా కౌన్సిలర్లు బింగి బాల్ లక్ష్మి. బందారం శ్రీలత. మెప్మా అధికారి హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌పివి టీకా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ**

**వృద్ధాశ్రమాల సంఖ్యను తగ్గించే విధంగా మహిళలు చర్యలు తీసుకోవాలి**

**కలెక్టర్ హైమావతి**

**కవచం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హెచ్‌పివి టికా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ హెచ్ పివి టికా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం అన్నారు. ఈ వ్యాక్సివేషన్ జిల్లాలో ఉన్న 10147 మంది 14 ఏండ్ల బాలికలందరు హెచ్ పివి వ్యాక్సిన్ తీసుకునే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కలిగించి ప్రతి ఒక్క బాలిక తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారించవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ధనరాజ్, డాక్టర్ శ్రీనివాస్, వినోద్ బాబ్జి, దీప్తి ప్రియాంక. శ్రీకాంత్. డాక్టర్ జ్యోతి, సదానందం, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సురేష్, నాసర్‌పురా పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది, ఎన్సీడి కోఆర్టినేటర్సు రాజేందర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ హత్య కేసు నిందితులు అరెస్ట్, రిమాండ్: సిఐ



**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** వేములవాడ పట్టణంలో జరిగిన భూక్య మోహన్ హత్య కేసును వేములవాడ టౌన్ పోలీసులు త్వరితగతిన చేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా మృతుడు భూక్య మోహన్ కు బైరి శారద అలియాస్ కళ్యాణి (నర్స్, అంజనీ నగర్, వేములవాడ) తో అక్రమ సంబంధం ఉన్నట్లు, మోహన్ తరచూ శారదని డబ్బులు అడుగుతూ మరియు వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలు బయటపెడతానని బెదిరించడంతో, శారద తన భర్త బైరి శేకర్ తో కలిసి మోహన్ ను హత్య చేయాలని పథకం రచించారు. ఈ పథకంలో గుండం రవి అలియాస్ రవీందర్ కూడా సహకరించాడు. తేదీ 04–03–2026 రోజున శారద మోహన్ ను వేములవాడలోని సిద్ధార్థ కాంప్లెక్స్ కు పిలిపించింది. కాసేపటికి అక్కడికి వచ్చిన శేకర్ మరియు రవి ఇద్దరు కలిసి మోహన్ ను నైలాన్ తాడుతో ఉరివేసి హత్య చేశారు. తిప్పాపూర్ బస్ స్టాండ్ వద్ద నిందితులు బైరి శారద, బైరి శేకర్ మరియు గుండం రవి లను పోలీసులు అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన బైక్, నైలాన్ తాడు మరియు చాకు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ కు తరలించారు. కేసును త్వరితగతిన చేదించిన వేములవాడ టౌన్ సిఐ వీర ప్రసాద్, ఎస్ ఐ రామ్మోహన్, ఎస్ ఐ ప్రేమానందం, కానిస్టేబుల్ ఇమ్రాన్, సల్మాన్, శ్రీనివాస్ లను, డిఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

# బాలికల ఆరోగ్యానికి ప్రజా ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** బాలికల ఆరోగ్యానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం రోజున జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను నూగిల్ల మల్లయ్య మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ముస్కాన్ నాజ్ నియర్ అలీ, కౌన్సిలర్ కొట్టే స్వరూప, ఇతర స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవము రోజున మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వాక్సినేషన్ కార్యక్రమంను 14 ఏండ్ల బాలికలు వేయించుకొని సద్వినియోగం చేసు కావాలని కోరారు. మన జిల్లా లో సుమారు 7602 బాలికలు ఉన్నారు, వారందరికీ వ్యాక్సిన్ అందించబడుతుందని అన్నారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ మరియు డి.సి.ఎచ్.ఎస్ డా. శ్రీధర్ మాట్లాడుతూ హెచ్‌పివి అనేది హ్యూమన్ పాపిలోమా వైరస్ ద్వారా సోకే గర్భాశయ క్యాన్సర్ కు ముఖ్య కారణం. దీని వలన భారతీయ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్ అని ఈ తీవ్రతను తగ్గించుటకు హెచ్ పి వీ వ్యాక్సిన్ ను ఇవ్వడం జరుగుతుందని, ఇది కొత్త వ్యాక్సిన్ కాదను, భయపడవలసిన అవసరం లేదనీ,ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్లకు పైగా ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని,ఈ వ్యాక్సిన్ వలన తీవ్రమైన దుష్ప్రభావాలు ఉండవని, అన్ని వ్యాక్సిన్ ల లాగానే తేలిక పాటు తాత్కాలికమైన దుష్ప్రభావాలు అరుదుగా సంభవించ వచ్చని, ఈ టీకా వల్ల వ్యంధత్వం. గర్భస్రావం మరియు పుట్టుకతో వచ్చే లోపాలకు కారణం అవుతుందనేది అపోహ మాత్రమే, ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని, ఈ వ్యాక్సిన్ 2006వ సంవత్సరం నుండి వాడుతున్నారనీ, ఈ టీకా కొన్ని అధ్యయనాల ప్రకారం 93100 శాతం సామర్థ్యంతో పని చేస్తుందనీ, రుతుస్రావం ఉన్నప్పటికిని ఈ టీకా వేయించుకోవచ్చనీ, భారత ప్రభుత్వం అందించే క్వాడ్రి వాలెంట్ ఎచ్ పి వి టీకా యొక్క ఒకే మోతాదు ప్రభావంత మైనదనీ, ఎచ్‌పివి. సంక్రమణకు వ్యతిరేకంగా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నూగిల్ల మల్లయ్య మున్సిపల్ చైర్మన్, అలీ, స్వరూప, ఇతర కౌన్సిలర్‌లు, డాక్టర్ కె ప్రమోద్ కుమార్, డా. శ్రీధర్ డా. బి. కిరణ్ కుమార్, డా. బి శ్రీరాములు, డా. సుధాకర్ రెడ్డి మరియు స్థానిక ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్య తరగతి ప్రజల కల కాంగ్రెస్ తోనే సాధ్యం: జువ్వాడి

**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం ఆదివారం చేపట్టగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నెరవేరని పేద మధ్య తరగతి ప్రజల కల సహకారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని ప్రొసిడింగ్ పత్రాలను తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు, అంజిరెడ్డి, రాజం, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యమే కాంగ్రెస్ ధ్యేయం

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం / దండేపల్లి :** గ్రామ స్వరాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు అన్నారు. దండే పల్లి మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆది వారం నిర్వహించిన గ్రామ శుభ్రత ఆరోగ్య భద్రత కార్యక్రమంలో ఆ యన పాల్గొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి ఇ బ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రా మాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని, పనిచేసే అధికారులను ఆదరిస్తామని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోనే దండేపల్లి మండలాన్ని ఉత్తమ మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులను ఎంఎల్‌ఏ శాలువాలతో సత్కరించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంక టేశ్వరరావు, ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, ఆర్జిపిఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపిపి గడ్డం శ్రీనివాస్, సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, అధి కారులు, నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఉట్నూర్ :** మండలంలోని మారుగూడలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మారుగూడలో నూతన గ్రామ పంచా యతీ భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన ఆయన, సర్పంచ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవుగూ డలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచిం చారు. గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో అవసరమైన భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## వన్యప్రాణుల సంరక్షణే ముఖ్యం

వైల్డ్ లైఫ్ పిసిసిఎఫ్ వినయ్ కుమార్



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంతతి పెరి గేలా అధికారులు మరిన్ని చర్యలు తీసుకోవాలని వైల్డ్ లైఫ్ పిసిసిఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ సూచించారు. కొమురం భీం ఆసిఫా బాద్ జిల్లా సిర్పూర్ రేంజ్ పరిధిలోని ఇటుకలపహాడ్ బీట్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్ వాచర్ల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చెక్ డ్యాంలు, సోలార్ నీటి కుంటలు, ఇతర నీటి వనరులను ఆయన తనిఖీ చేశారు. కెమెరా ట్రాప్‌ల ద్వారా నీటి కోసం వచ్చే జంతువుల చిత్రాలను పరిశీలించారు.మ హారాష్ట్ర నుంచి ఇటుకలపహాడ్ ప్రాంతంలోకి పులులు ప్రవేశించే మార్గా లను పరిశీలించి, అక్కడ కనిపించిన పాదముద్రలను గుర్తించారు. టైగర్ ట్రాకింగ్ విధానంపై సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావును అడిగి తెలుసుకు న్నారు. మొక్కల పెంపకం ద్వారా వన్యప్రాణులకి అనువైన ఆవాసాన్ని కల్పించినందుకు సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావు, బీట్ ఆఫీసర్ నరేష్‌లను అభినందించారు. కవ్వాల్ ఎఫ్‌డిపిటి శాంతారాం, ఆసిఫాబాద్ డిఎఫ్ఒ నీరజ్ కుమార్ టిబ్రేవాల్, నిర్మల్ డిఎఫ్ఒ సుశాంత్ సింగ్ బొబడే, ప్రొబేష నరీ ఐఎఫ్ఎస్ భార్గవ్ కుమార్, కాగజ్‌నగర్ ఎఫ్‌డిఒ అప్పయ్య, ఎఫ్ఆర్ ఒలు అనిల్ కుమార్, రమాదేవి, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ బలోపేతం కోసం కృషి చేస్తుందని విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మహిళలు అ న్ని రంగాల్లో రాణించాలని , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 150 మంది మహిళ లను పీఆర్‌టీయు టిఎస్ జిల్లా శాఖ పక్షాన సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నగర మేయర్ ఉమారాణి, డీఈఓ అశోక్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్ప డ్డాక 30 వేల ఉపాధ్యాయ ప్రమోషన్లు ఇచ్చామన్నారు. కొత్తగా డీఎస్సీ ద్వారా పదివేల ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి పాఠశాలకు ఉచిత కరెం ట్‌తో పాటు పాఠశాలకు స్కావెంటజర్లను ఇచ్చామన్నారు. పీఆర్‌టీయు ఆధ్వర్యంలో 150 మంది మహిళలను సన్మానించటం గొప్ప విషయమ న్నారు. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడే సిరి సంపదలతో పాటు అభివృద్ధి జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందన్నారు.మహిళలకు ఐదు సిఎల్‌లు ఇప్పించటంలో గానీ 90 రోజులు చైల్డ్‌కేర్ ఇప్పించటంలో గానీ 180 రోజులు ఇప్పించ టంలో గానీ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు. నగేష్‌రెడ్డి, కేశ వేణు, నరేష్, రవీందర్రెడ్డి పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# ఏరియా ఆసుపత్రిలో మహిళా ఆరోగ్య.. రక్షణకు మరో ముందడుగు

హెచ్‌పివి వ్యాక్సినేషన్ ..

ప్రారంభించిన : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భైంసా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భైంసా పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మహిళల ఆరోగ్య రక్షణ కు కీలకమైన హెచ్.పి.వి(హ్యూమన్ పాపిలోమా వైరస్)వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభిం చారు.మహిళల ఆరోగ్యం కాపాడటం ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు.గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాం తక వ్యాధుల నుంచి మహిళలను రక్షించేందుకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని చె ప్పారు.చిన్న వయస్సు బాలికలకు ఈ టీకా అం ంచడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమా దాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నా రు.ప్రజలీఉ ఆరోగ్యంపై అవగాహన పెంపొంది చుకొని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.మహిళ సంక్షేమ, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్య క్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. వైద్యాధికారులు,ఆసుపత్రి సిబ్బంది,ప్రజాప్రతిని ధులు,మహిళలు పా ల్గొన్నారు.ప్రజలు అపో హాలు పెట్టుకోకుండా తమ పిల్లలకు ఈ టీకాను వేయించుకోవాలని,ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెలే పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,ఆసు పత్రిమహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టిన మహిళల ఆరోగ్య రక్షణలో మరో కీలక అడు గుగా నిలిచింది 'మహిళల ఆరోగ్యం బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది' అని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.

## విద్యావంతులైనప్పడే ఉన్నత స్థాయికి



**ప్రజాపక్షం/నిర్మల్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూనే,తమ పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య సూచిం చారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత సరస్వతి మాత చిత్రపటానికి పూలమాల వేసి,జ్యోతి ప్రజ్వలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన,వైద్య శిబిరం,మహిళల కోసం నిర్వహించిన క్రీడలను ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ..ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా భాగస్వా ములవుతున్నారని హర్షం వ్యక్తం చేశారు.విద్యావంతులైనప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని,నిర్మల్ పట్టణంలో అధునాతన హంగులతో విద్యాసంస్థలు అందుబాటులో ఉన్నాయని,తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వాసవి పాఠశాల వాతావరణం,విద్యార్థుల ప్రతిభ తనను ఎంతో ఆకట్టుకున్నాయని ఆమె ప్రశంసించారు.అనంతరం విద్యార్థుల తల్లిదం డ్రులు,డాక్టర్లతో కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వినీశ,రేజొనెన్స్ ప్రిన్సిపాల్ లావణ్య,వాసవి పాఠశాల నిర్వాహకులు ముత్యం రెడ్డి,జగదీశ్ రెడ్డి,పోతారెడ్డి,ఉపాధ్యాయులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎడపల్లి మండలంలో ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 99రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్య మెరుగుదలే లక్ష్యం గా ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఈ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యచరణలో భాగంగా మొదటిరోజు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ప్రధాన రహదా రులపై పేరుకుపోయిన చెత్తచెదారాన్ని, తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణలను ఊడ్చి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. అదేవిధంగా డ్రైనేజీలను శుభ్రం చేయించారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ఈ 99రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు ఒక నిర్దిష్టమైన పనని చేపడతామని వెల్లడించారు. గ్రామాల్లోని పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు పచ్చదనం, పరి శుభ్రతకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల రూపు రేఖలు మారునున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళా సాధికారత లక్ష్యంపై సర్కారు దృష్టి సారించాలి

ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్ర భుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా దృష్టి పెట్టా లని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వం టేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మహిళలను సత్కరించి మహిళా దినోత్సవ శుభా కాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మాట్లా డారు. మహిళలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బాగుపడుతుందని తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజిం చబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని స్పష్టం చేశారు. మహిళా చైతన్యంతోనే సమా జంలో మార్పు సాధ్యపడుతుందని చెప్పారు. మ హిళలు అన్ని రంగాల్లో ముందుండి ఆత్మవిశ్వాసం తో సాగాలని ఆకాంక్షించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, గోదా వరి జలాలతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, సురక్షిత త్రాగు నీటిని అందించిందని అన్నారు. మేనమామ కానుకగా, ఆడబిడ్డలను గౌరవిస్తూ కల్యాణ లక్ష్మి పథకం కింద రూ లక్ష ఆర్థిక సాయం చేసిన ఘనత కేసీఆర్ కు దక్కిందని అన్నారు. అంతేకాకు ండా గర్భిణీ స్త్రీలకు మంచి పౌష్టికాహారం, చిన్నా రులకు కెసిఆర్ కిట్టు అందించినట్లు గుర్తు చేశారు. బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతు వులు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లను నేరుగా ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. చదువుకునే పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి కావలసిన వసతులను కల్పించి నాణ్యమైన విద్య, భోజంన అందించినట్లు పేర్కొన్నారు. అయితే రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో విస్మరించి ఇచ్చిన హామీలకు మొండి చేయి చూపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సిం గరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సి లర్లు, నేతలు గోలి మమత సంతోష్, బొగ్గుల స్వప్న సురేష్, మన్నెరూప వెంకటేష్, కప్ప మమత పోచయ్య, కొలిచెల్మ భవానీ కరుణాకర్, కోట బాబు, ఫర్జానా బేగం, రజియా బేగం, గుంటూకు రాజు, రమేష్, అహ్మద్, పాల రమేష్ గౌడ్, హన్మంత రెడ్డి, స్వామి చారి పాల్గొన్నారు.

## ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్‌కు ఎంపికైన పెంబి బ్లాక్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాకు గర్వకారణంగా పెంబి బ్లాక్‌ను నితి ఆయోగ్ ని ర్వహిస్తున్న ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినా ర్‌కు ఎంపిక చేశారు.ఈ సెమినార్ మార్చి 9న విశాఖపట్నంలో నిర్వహించబడుతుంది ఆస్పిరే షనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రల ప్రతినిధులతో పంచుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నారు.సౌత్ జోన్ 3 కు చెందిన ఆరు రాష్ట్రాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొ ననున్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం నిర్మల్,జోగులాంబ గద్వాల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషం,నిర్మల్ జిల్లాలోని పెం బి బ్లాక్ విద్య,ఆరోగ్యం,అమ్మ రక్షిత,బాలశక్తి, వ్యవసాయం,ప్రాథమిక వసతుల రంగాల్లో చేప ట్టిన కార్యక్రమాలను ఈ సెమినార్‌లో ప్రదర్శిం చనుంది.జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ ఈ కార్యక్రమానికి హాజరై పెంబి బ్లాక్ లో అమలవు తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు.గిరి జన ప్రాంతమైన పెంబి మండలంలో గతంలో విద్యారంగంలో తక్కువ అక్షరాస్యత,పత్తి కోత కాలంలో విద్యార్థుల డ్రాప్ అవుట్‌లు,ఉపాధ్యా యుల కొరత,తక్కువ పరీక్షా ఫలితాలు వంటి స మస్యలు ఉండేవి.ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద గత రెండు సంవత్సరాల్లో పలు చర్యలు తీసుకున్నారు.విద్యా వాలంటీర్లను నియమిం చడం,సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిం చడం,మోడల్ పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.విద్యార్థులను క్రీడలు ,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్స హించడం వల్ల చదువుపై ఆసక్తి పెరిగి పదవ తరగతి ఫలితాలు 100 శాతం నమోదు అ య్యాయి.పెంబి బ్లాక్ అభివృద్ధిని పర్యవేక్షించేం దుకు సీనియర్ జిల్లా అధికారులను ప్రత్యేక అధి కారులుగా నియమించారు.బాలశక్తి,అగ్రో ఫారెస్ట్రి, మ హిళా శక్తి, అమ్మ రక్షి త వంటి కార్య క్రమా లు,అన్ని శాఖల సమన్వయంతో పెంబి బ్లాక్ ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఉత్తమ పద్ధ తులలో ఒకటిగా నిలి చింది. ప్రజలకు మెరు గైన ఆరోగ్య సేవలు అందడం ,మట్టితపరీక్ష కార్డులు అందించడం, పోషకాహార లోపం తగ్గడం వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధించబడింది. శాఖల సమిష్టి కృషే కారణమని అధికారులు తెలి పారు.2024 డి సెంబర్‌లో నితి ఆయోగ్ నిర్వ హించిన ర్యాంకింగ్స్ లో దేశంలో ని 500 బ్లాకుల్లో పెంబి బ్లాక్ నాలుగో స్థానం సాధించి రూ.1 కోటి పోత్సాహక నగదు అందు కుంది.భవిష్యత్తులో కూడా జిల్లా పరిపాలన, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## చదువు ఒత్తిడితో 'టెన్త్' విద్యార్థి ఆత్మహత్య



**ప్రజాపక్షం / మందమర్రి :** వార్షిక పరీక్షల చదువు ఒత్తిడిని తట్టుకోలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మందమ ర్రి పట్టణంలో ఆదివారం వి షాదాన్ని నింపింది. పట్టణంలోని సిఎస్‌పి రోడ్డుకు చెందిన క్యాతన సత్యనారా య ణ కుమారుడు క్యాతన్ తనై (16) సింగరేణి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో మంచి మార్కులు రావేమో నని గత కొన్ని రోజులుగా తనై ఆందోళన చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున తండ్రి సత్యనారాయణ నిద్రలేపి చదు వుకోవాలని చెప్పి వెళ్లగా, గంట వ్యవధిలోనే తనై ఇంటి ముందున్న రేకుల షెడ్డు ఇనుప పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనిం చి కిందకు దించేలోపే విద్యార్థి మృతి చెందాడు. ఘటన స్థలంలో పోలీసులకు ఒక సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో తల్లిదండ్రులకు, శ్రీనిధికి క్షమాపణలు చెబుతూ రాసి ఉంది. చదువు ఒత్తిడి కారణంగానే తన కుమారుడు అఘాయి త్యానికి పాల్పడ్డాడని తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని డాక్టర్ ఇందిరా చౌహాన్ అన్నారు. ఆదివారం ఇందూరు జిల్లా జిల్లా అర్బన్ 7వ డివిజన్‌లో జనసేన పార్టీ నాయకులు నూర రాహుల్ (శివ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వ హించారు. ముఖ్యఅతిథులుగా జనసేన పార్టీ ఇందూరు జిల్లా అధ్యక్షులు గుండా సంతోష్, మహిళా మండలి అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, చైతన్య విద్యా సంస్థ ప్రిన్సిపాల్ యోజనరెడ్డి, ఎస్ బాలాజీ హాస్పిటల్ ప్రసూతి నిపుణులు డాక్టర్ ఇందిరా చౌహాన్, ప్రజా సేవకురాలు నూర నాగమణి, శివమ్ సవ్యసాచి ఆర్ట్స్ భగవ ద్గీత అకాడమీ భగవద్గీత బోధన అధ్యాపకురాలు కావ్యప్రభ జోషి, ఈ అకాడమీ ముఖ్యసలహాదారులు నూర స్రవంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుజ్జ రాజేశ్వరి మహిళ ప్రాముఖ్యత కుటుంబంలో ఏ విధంగా ఉండాలో తెలి పారు. ఇందిరా చౌహాన్ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ప్రతి మహిళ ముందంజలో నిల బాలని ప్రస్తావించారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. తాను వైద్య వృత్తిలో రాణిస్తున్నానని గుర్తు చేశారు. మహిళకు ఉన్న ఓపిక, సహనం ఇంకా ఎవరికి రాదన్నారు. జనసేన పార్టీ నాయకులు రాహుల్ మాట్లాడుతూ భగవద్గీత జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివ రించి విజయవంతం చేసిన జనసేన పార్టీ వీర మహిళలను సన్మానించి భగవద్గీత పుస్తకాలను అందజేశామన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గర్భా శయం ముఖద్వార క్యాన్సర్ నిరోధం కోసం ప్రభుత్వం ఉచితంగా అందజే స్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 1415 ల మధ్య వయస్సు కలిగిన బాలికలు అందరికి త ప్పనిసరిగా ఇప్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమైనదని, దీనిని తీసుకోవటం తో 95 శాతం వరకు గర్భాశయ ముఖ ద్వార క్యా న్సర్‌ను నిరోధించుకో వచ్చున్నారు. ఈ వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపో హాలు అవసరం లేదని, ఎవ రు కూడా ఆందోళ నకు గురి కాకుండా జిల్లాలో 14,15 వయస్సు కలిగిన 12363 మంది బాలికల కు మిషన్ మోడ్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని సూచిం చారు. ఇప్పటివరకు కేవలం ప్రైవేట్ ఆస్పత్రుల లోనే అందుబాటులో ఉండేదని, సర్వైకల్ క్యాన్స ర్‌ను నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రస్తుతం ఉచితంగా ఈ వ్యాక్సిన్‌ను అందిస్తోందని తెలిపారు.వ్యాక్సిన్ వేయించుకున్న వారు సర్టిఫి కెట్ తీసుకోవాలని, తెలంగాణ ప్రభు త్వం త్వర లోనే అందుబాటులోకి తేనున్న హెల్త్ ప్రొఫైల్ కోసం ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుంద న్నారు.వైద్యులు అశోక్, శ్రీనివాస్, రాము లు, శ్రీనివాస్ ప్రసాద్, అశ్విని, చంద్రకళ పాల్గొన్నారు.

# నాచగిరిలో ఆధ్యాత్మిక సంబురానికి శ్రీకారం



**ప్రజాపక్షం/గజ్వేల్:** తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర గిరి ప్రదక్షిణ పూర్వజన్మ సుకృతమని, లోక కళ్యా ణార్థం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో పాల్గొన్న భక్తు లకు ఆధ్యాత్మిక అనుభూతి దక్కుతుందని శ్రీ గురు మద నానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం నాచగిరి క్షేత్రంలో గిరి ప్రద క్షిణ కార్యక్రమాన్ని చైర్మన్ రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రారంభించగా, ఆలయ అధికారి బెల్లంకొండ రంగా చారి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీ నారసింహుడు నడయాడిన ఈ ప్రాంతం ఎంతో పవిత్ర మైనవని, దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్తికి మార్గం దక్కుతుందని అన్నారు. స్వామివారి జన్మ నక్షంత్ర స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వైకుంఠ ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యకార్యమని, చక్కటి ఫలితాలిస్తుందని, భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని.దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని స్వామీజీ ఆకాంక్షించారు. సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక భావన తదితర గుర్తు చేస్తుం డగా, ఈ సంస్కృతి వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరిం చాలని కోరారు. పరమేశ్వరుడి కృప, భగవంతునిపై భక్తి, సేవాభావం, మనో నిగ్రహం, దాతృత్వం, ధర్మబద్ధమైన జీవనం తదితర మానవుడిని సన్మార్గంలో నడిపించను డగా, పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు, గోసంపద తదితర రక్షించుకునే బాధ్యతను మర్చిపోవద్దని వివరిం చారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్టు బోర్డు సభ్యులు ఉషశ్రీ రాజశేఖర శర్మ, చందా నాగరాజు గుప్త, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, సురేందర్ రెడ్డి, కర్రె పద్మ వెంకటేష్, సర్పంచ్లు సారిక యాదగిరి, రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య స్వామీజీ నాచగిరి వార్షిక బ్రహ్మోత్సవాలకు జ్యోతి ప్రజ్వలనతో అంకురా ర్పణ చేశారు.ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమి టీ ఆధ్వర్యంలో తీర్థ, మహా ప్రసాదం అందజేశారు.

# ప్రపంచకప్‌లో మూడో హాఫ్ సెంచరీ

## అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించిన శాంసన్..



పొట్టి ప్రపంచకప్‌లో శివాలెత్తిపోతున్న భారత ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. మెగా టోర్నీలో భీకర ఫామ్‌ను కొనసాగించిన ఈ చిచ్చరపిడుగు పొట్టి కప్ సెమీఫైనల్, ఫైనల్లో అర్ధ శతకం బాదిన మూడో ఆటగాడిగా అవతరించాడు. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై అర్ధ శతకంతో రెచ్చిపోయిన సంజూ.. ఫైనల్లోనూ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. తద్వారా.. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, పాకిస్థాన్ వెటరన్ షాహిద్ అఫ్రిదిల సరసన చేరాడీ డాషింగ్ బ్యాటర్. ఫైనల్లో 89 పరుగుల వద్ద ఔటైన భారత స్టార్.. మార్లోనే శామ్యూల్స్(85 నాటౌట్), కేన్ విలియమ్సన్(85) అత్యధిక స్కోర్ రికార్డును బ్రేక్ చేశాడు. టీ20 వరల్డ్ కప్‌లో విధ్వంసక ఆటతో భారత్‌ను ఫైనల్ చేర్చిన సంజూ శాంసన్.. టైటిల్ పోరులోనూ గర్జించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి 92 పరుగులతో శుభారంభమిచ్చిన సంజూ.. వరుసగా మూడో అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. పొట్టి ప్రపంచకప్ సెమీస్, ఫైనల్లో ఫిఫ్టీ కొట్టిన రెండో భారత అటగాడిగా చరిత్రపుటల్లో నిలిచాడీ పవర్ హిట్టర్. తొలుతు పాకిస్థాన్ ఆటగాడు షాహిద్ అఫ్రిది 2009లో ఈ ఫీట్ సాధించగా.. 2014 ఎడిషన్‌లో విరాట్ కోహ్లీ నాకౌట్‌లో వరుస అర్ధ శతకాలు బాదాడు. ఇప్పుడు సంజూ వీరిద్దరి సరసన నిలిచాడు. మొత్తంగా.. ఈ టోర్నీ చరిత్రలో ఈ మైలురాయిని అందుకున్న ఏడో ఆటగాడిగా మరో రికార్డు పట్టేశాడు శాంసన్. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ తర్వాత మూడో భారతీయుడు శాంసనే కావడం విశేషం. అందరికంటే ముందు మహేల జయవర్ధనే(2010), విరాట్ కోహ్లీ(2016, 2021), బాబర్ ఆజాం(2021), కేఎల్ రాహుల్(2021), కుశాల్ మెండిస్(2026), షహిబ్జద ఫర్హాన్(2026)లు మూడేసి అర్ధ శతకాలు బాదేశారు.

## భారత మహిళల జట్టు ఘోర ఓటమి

ఆస్ట్రేలియాతో ఏకైక పింక్ బాల్(డే/నైట్) టెస్ట్‌లో భారత మహిళల జట్టు ఘోర పరాజ యాన్ని మూటగట్టుకుంది. పెర్త్ వేదికగా ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో టీమిండియాను చిత్తు చేసింది. రెండున్నర రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. 25 పరుగుల స్వల్ప లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 4.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసి విజయాన్నం దుకుంది. అంతకుముందు 105/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలింది. ప్రతికా రావల్(137 బంతుల్లో 8 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. స్నేహ్ రాణా(54 బంతుల్లో 3 ఫోర్లతో 30) పర్వాలేదనిపించింది. మిగతా బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్(14), హర్మన్‌ప్రీత్ కౌర్(11) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమ య్యారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 62.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది, జెమీమా రోడ్రిగ్స్(84 బంతుల్లో 7 ఫోర్లతో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ(48 బంతుల్లో 6 ఫోర్లతో 35), కాశ్వీ గౌతమ్(54 బంతుల్లో 3 ఫోర్లతో 34 నాటౌట్) పర్వాలేదనిపించారు. అనాబెల్ సదర్లాండ 4 వికెట్లు పడగొట్టగా.. లూసీ హామిల్టన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 90.4 ఓవర్లలో 323 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌటైంది. అన్నబెల్ సదర్లాండ171 బంతుల్లో 17 ఫోర్లతో 129) సెంచరీతో రాణించగా.. ఎల్లిస్ పెర్రీ(116బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 76) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. భారత బౌలర్లలో సయాలి సత్ఘరే(4/50) నాలుగు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్2/72), దీప్తి శర్మ(2/67) రెండేసి వికెట్లు తీసాడు. స్నేహ్ రాణా, షెఫాలీ వర్మ చెరో వికెట్ తీసారు. 125 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 149 పరుగులకే ఆలౌటైంది. దాంతో ఆసీస్ ముందు 25 పరుగుల స్వల్ప లక్ష్యం నమోదైంది. దాదాపు 20 నెలల తర్వాత భారత మహిళల జట్టు టెస్ట్ క్రికెట్ ఆడుతుండటం.. అందులో పింక్‌బాల్‌తో ఆడిన అనుభవం పెద్దగా లేకపోవడంతో ఆసీస్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. ఆల్‌రౌండ ప్రదర్శనతో సత్తా చాటిన అన్నబెల్ సదర్లాండ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ మ్యాచ్‌తో అలీసా హీలీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది.




# ఆరోగ్యం

## హెచ్‌ఐవిపై డెన్మార్క్ నియంత్రణ

హెచ్‌ఐవిని నియంత్రిచడంలో డెన్మార్క్ కీలక పురోగతిని సాధించింది. యూరోపియన్ యూనియన్‌లో తల్లి నుంచి శిశువుకు సంక్రమించే హెచ్‌ఐవి, సిఫిలిస్ వ్యాధుల ప్రసరణను పూర్తిగా నియంత్రించిన మొదటి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ధ్రువీకరించింది. తల్లి నుంచి శిశువుకు వ్యాధి సంక్రమణను 'మదర్ టు చైల్డ్ ట్రాన్స్‌మిషన్' (ఎంటిసిటి) అంటారు. దీనిని అరికట్టడాన్ని 'ఎలిమినేషన్ ఆఫ్ మదర్ టు చైల్డ్ ట్రాన్స్‌మిషన్' (ఇఎంటిసిటి)గా పిలుస్తారు. గర్భధారణ సమయంలో, ప్రసవ సమయంలో లేదా తల్లి పాలిచ్చే సమయంలో కొన్ని అంటువ్యాధులు శిశువుకు సంక్రమించవచ్చు. ముఖ్యంగా హెచ్‌ఐవి, సిఫిలిస్ వంటి వ్యాధులు త్వరగా సోకుతాయి. సరైన వైద్య చికిత్స లేకపోతే శిశువుల్లో తీవ్రమైన సమస్యలు వస్తాయి. ఉదాహరణకు శిశువుకు వ్యాధి సోకడం, గర్భస్రావం, పుట్టిన వెంటనే మరణం లేదా జన్యుపరమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడవచ్చు.



ఈ వ్యాధి సంక్రమణను నిర్మూలించిందని ఒక దేశాన్ని ప్రకటించడానికి డబ్ల్యుహెచ్‌ఒ కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. ముఖ్యంగా ప్రతి లక్ష జననాలలో తల్లి నుంచి శిశువుకు వ్యాధి సంక్రమణ రేటు 50 కన్నా తక్కువగా ఉండాలని పేర్కొంది. అలాగే గర్భిణులలో కనీసం 95 శాతం మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని సూచించింది. కాగా, డబ్ల్యుహెచ్‌ఒ చేసిన సూచనలను, నిర్దేశించిన లక్ష్యాలను, సూచించిన ప్రమాణాలను డెన్మార్క్ ఈ విజయవంతంగా సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 20కు పైగా దేశాలు ఈ లక్ష్యాన్ని సాధించాయి లేదా ఆ దిశగా పురోగతి సాధిస్తున్నాయి. అయితే, ఐరోపా దేశాల్లో డెన్మార్క్ ఈ ఘనతను అందుకున్న తొలి దేశంగా అవతరించింది. కరేబియన్ ప్రాంతంలోని కొన్ని చిన్న దేశాలు, దక్షిణ అమెరికాలోని బ్రెజిల్, ఆఫ్రికాలో బోట్స్వానా, ఆసియాలో మలేసియా, మాల్దీవులు వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

## పెరుగుతున్న ఒబేసిటీ



ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారతదేశంలో స్థూలకాయం ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్ విడుదల చేసిన నివేదికను అనుసరించి, స్థూలకాయం అనేది ప్రస్తుత కాలంలో భయాందోళనలు కలిగిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ)ను అనుసరించి, శరీరంలో అసాధారణంగా అధిక కొవ్వు పేరుకుపోవడాన్ని స్థూలకాయంగా పరిగణిస్తారు. బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) 25 కంటే ఎక్కువ ఉంటే ఓవర్‌వెయిట్, 30 కంటే ఎక్కువ ఉంటే ఒబేసిటీగా గుర్తిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో స్థూలకాయం వేగంగా పెరుగుతోందని, చైనా, భారతదేశం, అమెరికా వంటి దేశాల్లో 10 మిలియన్లకు పైగా పిల్లలు స్థూలకాయంతో బాధపడుతున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. చైనాలో అత్యధికంగా సుమారు 62 మిలియన్ పిల్లలకు అధిక బిఎంఐ ఉండగా, భారతదేశం రెండవ స్థానంలో ఉంది. భారతదేశంలో సుమారు 41 మిలియన్ పిల్లలు అధిక బిఎంఐ సమస్య కలిగి ఉన్నట్లు అంచనా. భారతదేశానికి సంబంధించిన వివరాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. 2025 నాటికి 5–9 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 15 మిలియన్లు, 10–19 సంవత్సరాల మధ్య వయస్సు గల 26 మిలియన్లు అధిక బరువు లేదా స్థూలకాయంతో ఉన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే 2040 నాటికి ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరుగుతాయని నివేదిక హెచ్చరిస్తోంది. అధిక బిఎంఐ కారణంగా వచ్చే వ్యాధులు కూడా పెరుగుతాయి. 2025 నుండి 2040 మధ్య రక్తపోటు కేసులు 2.99 మిలియన్ నుండి 4.21 మిలియన్‌కు పెరగవచ్చు. అలాగే షుగర్, ట్రైగ్లిసరైడ్లు, కాలేయానికి సంబంధించిన ఎంఎఎస్‌ఎల్‌డి వంటి సమస్యలు కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు జీవనశైలిలో వచ్చిన మార్పులే. 11–17 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతలో 74% మంది తగిన శారీరక వ్యాయామం చేయడం లేదు. పాఠశాల ఆహార కార్యక్రమాల లాభం కేవలం 35.5% పిల్లలకే అందుతోంది. అలాగే తగిన స్థాయిలో తల్లిపాలు ఇవ్వకపోవడం మరియు ఎక్కువగా చక్కెర పానీయాలు తీసుకోవడం కూడా సమస్యను పెంచుతున్నాయి. ఈ సమస్యను తగ్గించడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని నివేదిక సూచించింది. ముఖ్యంగా చక్కెర పానీయాలపై పన్నులు విధించడం, పిల్లలను లక్ష్యంగా చేసుకుని చేసే ప్రకటనలను నియంత్రించడం, పాఠశాలల్లో ఆరోగ్యకరమైన ఆహార ప్రమాణాలను అమలు చేయడం, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరమని పేర్కొంది.

## ఆరోగ్యానికి ఉపవాసం..

రంజాన్ మాసంలో ముస్లింలు 'రోజా' అంటారు. అంటే పూర్తి ఉపవాసం. ఈ ఉపవాసం అనేది ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని మతాల్లోనూ ఉంది. కాకపోతే, ఆచరించే విధానం వేరువేరు. నిర్దిష్ట కాలం పాటు ఆహారం తీసుకోకుండా ఉండడాన్ని సాధారణంగా ఉపవాసంగా పేర్కొంటారు. ఉపవాసం పాటించడం ద్వారా మనిషి తన కోరికలను అదుపులో ఉంచుకోవడం నేర్చుకుంటాడు. వైద్య శాస్త్ర దృష్టిలో ఉపవాసానికి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. సాధారణంగా మనం ఆహారం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థ నిరంతరం పనిచేస్తూ ఉంటుంది. ఉపవాసం సమయంలో జీర్ణ వ్యవస్థకు కొంత విశ్రాంతి లభిస్తుంది. ఈ సమయంలో శరీరం బయట నుంచి వచ్చే ఆహారంపై ఆధారపడకుండా, తనలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించడం ప్రారంభిస్తుంది. మొదట కాలేయంలో నిల్వ ఉన్న గ్లైకోజెన్‌ను శక్తిగా ఉపయోగిస్తుంది. తరువాత అవసరమైతే శరీరంలో ఉన్న కొవ్వును శక్తిగా మార్చుకుంటుంది. దీనివల్ల అధిక కొవ్వు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే కొంతమంది శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఉపవాసం సమయంలో శరీరంలోని పాత లేదా దెబ్బతిన్న కణాలు తొలగించే ప్రక్రియ కూడా జరుగుతుంది. దీనిని శాస్త్రీయంగా 'ఆటోఫగీ' అంటారు. చరిత్రలో కూడా ఉపవాసానికి ప్రాధాన్యం ఉంది.



## పేదలపై భారం మోపిన మోదీ

### గ్యాస్ ధర పెంపుపై సిపిఐ నిరసన

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్యాస్ ధర పెంపుతో మోడీ పేదలపై భారం మోపుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోడీది ఎప్పుడు కార్పోరేట్, సంపన్న వర్గాల పక్షమేనని మరోసారి తేలిపోయిందన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొత్తగూడెం అల్లిపురం రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్యాసబండతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి దండి సురేష్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే గ్యాస్ ధర పెంచి పేదలు బతకలేని స్థితికి మోడీ ప్రభుత్వం నెట్టివేస్తుందన్నారు. క్షేత్రస్థాయి మొదలు అంతర్జాతీయ విధానాల వరకు మోడీ నిర్ణయాలు ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సాగిల పడటం వల్ల ఇప్పుడు యుద్ధం జరుగుతున్నదని దేశ అలీన విధానానికి మోడీ తిలోదకాలు ఇచ్చారని సురేష్ తెలిపారు. యుద్ధం కారణంగానే గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. భవిష్యత్తులో డీజిల్, పెట్రోల్, ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయని ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సురేష్ పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, సిహెచ్ సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐలో భారీగా చేరికలు

- నల్లగొండ జిల్లా చామలేడు గ్రామంలో నలుగురు వార్డు సభ్యులతో పాటు 50 కుటుంబాలు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో పార్టీలో చేరిక
- పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతర పోరాటాలు





**ప్రజాపక్షం/నల్లగొండ (గుర్రంపోడు)**

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని చామలేడు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)లో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీకి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన వార్డు సభ్యులు దోటి శ్రీను ఆధ్వర్యంలో మరో ముగ్గురు వార్డు సభ్యులతో పాటు సుమారు 50 కుటుంబాలకు చెందిన యువతీ, యువకులు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో సిపిఐ పార్టీలో చేరారు. వారికి పార్టీ ఎర్రకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చామలేడు గ్రామంలో జరిగిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో అనేక రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు అధికార పార్టీల వైపు మారుతున్నారని పేర్కొన్నారు. అయితే ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో ఆ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. పార్టీలు మారడం కొంతమంది నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజా ప్రయోజనాల కోసం కాదని అన్నారు. దేశంలో సిపిఐ పార్టీ శతాబ్దకాలంగా పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. ప్రజల హక్కుల సాధనలో పార్టీ ఎప్పటికప్పుడు ముందుండి పని చేస్తోందని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ పాత్ర ఎంతో కీలకమని, ప్రజల ఆశీస్సులతో పార్టీ రోజురోజుకు మరింత బలపడుతోందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పార్టీలో చేరిన వారికి ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజచారి, మండల కార్యదర్శి రేపాక లక్ష్మిపతి, సహాయ కార్యదర్శి ఏరెడ్ల వెంకట్ రెడ్డి, నాయకులు ఎస్‌కే మదర్, శేపూరి శంకరాచారి, శంకర్,పగిల్ల రమేష్, ఆవుల రాంబాబు, దోతీ లింగమ్మ,పగిల్ల కళ్యాణి, సిలువేరు యాల్రాద్రి,పగిడిమర్రి బిక్షపతి,దాము లింగస్వామి,ఆవుల సైదులు, జక్కల శ్రీకాంత్,దోటి తరుణ్, పగడాల ముత్యం,పగడాల అంతమ్మ,పగడాల రమేష్, పగిడిమర్రి కవిత,పగడాల నరసింహ,సంగెం విష్ణు, కొప్పోజు శంకరాచార్య,పగడాల కిరణ్,కట్ట నాగ రాజు, పగిడిమర్రి రాములమ్మ తోపాటు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించివ్వాలి

- ఇప్పటికే కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా అర్హులైన పేద ప్రజలకు పంచాలి
- సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




**ప్రజపక్షం /వరంగల్ :** పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇప్పటికే కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా అర్హులైన పేద ప్రజలకు పంచాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ వరంగల్ జిల్లా కార్యలయం తమ్మెర భవన్ లో సిపిఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు.

పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసె లు, ఇండ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి ప ట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా పేదలకు పంచడానికి కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా పేద ప్రజలకు పెంచాలని లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆ ఇండ్లను అర్హులైన పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మాట్లాడుతూ వరంగల్ నగరంలో భారీ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ ఉద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నగర సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో పేరుకుపోయిన అనేక సమస్యలను త్వరగా పరిష్కరించాలని, కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మ ణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, బుస్స రవీంధర్, అక్కపల్లి రమేష్, వీరగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

## పోరాటాలతోనే హక్కుల సాధన

- మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష : ఏపూరి లతాదేవి
- ఘనంగా మహిళా దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాటాల ద్వారానే మహిళా హక్కుల సాధన సాధ్యమవుతుందని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న హక్కులు మోడీ పాలనలో కోల్పోతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వన్‌టౌన్ సిపిఐ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగిన సభలో లతాదేవి మాట్లాడుతూ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు ఆశించిన స్థాయిలో హక్కులు, అవకాశాలు దక్కడం లేదన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన చట్ట సభల్లో మాత్రం 33 శాతం రిజర్వేషన్‌లు మాత్రం కల్పించడం లేదు. అనేక దశాబ్దాల పాటు గీతాముఖర్జీ లాంటి వారు పోరాడిన ఫలితం దక్కలేదని ఆమె తెలిపారు. 21వ శతాబ్దంలోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతుండటం అత్యంత బాధాకరమన్నారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు ముందు వరుసలో ఉన్న లైంగిక వేధింపులు తప్పడం లేదని వైద్యులు, న్యాయవాదులు సైతం కామాంధులకు బలవుతున్నారని ఇటువంటి కామాంధులకు తక్షణ శిక్షలు అమలు జరిగేలా చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలకు సానుకూలంగా మార్పులు రావాలని లతాదేవి కోరారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళలు చైతన్యవంతులైనప్పుడే కుటుంబం తద్వారా సమాజం, దేశం పురోగమిస్తుందన్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సందేశాలు ఇవ్వగా మహిళా సమాఖ్య బాధ్యులు సిహెచ్ సీతామహలక్ష్మి, తాటి నిర్మల, కన్నెబోయిన విజయమ్మ, జమ్ముల లక్ష్మి, ఓరుగంటి ప్రమీల, సౌజన్య, సరోజనమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాణీ రుద్రమ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న

# మహిళా ఉద్యోగినులు

### హనుమకొండ కలెక్టర్ చాహత్ బజ్ పాయ్



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:**టిఎన్‌జిఒ యూనియన్ అధ్యక్షులు జెఏసిచైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అలంకార్ జంక్షన్ లోని టిఎన్‌జిఒ భవన్లో అత్యంత ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటపాటలతో సాంస్కృతిక కార్యకలాపాలతో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బజ్ పాయ్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా మహిళల్లో చైతన్యం ఎక్కువ అని రాణి రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ లక్షణాలను పునికిపుచ్చుకున్నారనీ, వారందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండ జిల్లాను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించిన టిఎన్‌జిఒబాధ్యులను అభినం దించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బజ్ పాయ్ నీ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఘనంగా సన్మానించారు.డాక్టర్ గోదా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతిరోజు తమ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ,తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మహిళా ఉద్యోగినులు అందరికీ అంతర్జాతీయ దినోత్సవం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండం లక్ష్మి రామానంద్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా టీఎన్జీవో నేతలు తనను ఘనంగా సన్మానించినందుకు వారికి అభి నందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారినీ ఘ నంగా సన్మానించడం జరిగింది.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంత ఘనంగా మహిళా దినోత్సవ ఏర్పాట్లు చేసిన టిఎన్‌జిఓస్ నేతలను అభినందించారు.జిల్లా టిఎన్‌జిఒ అధ్యక్షులు జెఏసిచైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ,డాక్టర్ గోదా విష్ణువర్ధన్ రె డ్డి, పెండం లక్ష్మి రామానంద్ గార్లు వేడుకలకు వచ్చిన సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేస్తూ వేడుకలకు విచ్చేసిన మహిళ సోదరీమణులకు అభినందనలు తెలియచేశారు.ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విజేతలు అందరికీ అతిధుల చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికిల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, రాష్ట్ర నేతలు రాము నాయక్, లక్ష్మీ ప్రసాద్ ,టీఎన్జీవో మహిళా గౌరవ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, పావని, జయంతి ,విజయలక్ష్మి ,కళ్యాణి,జయంతి,మమత, శ్రీలత ,సరస్వతి, మంజుల, కల్పన, రజిత, నాగరాణి,కల్పన, రాజమౌళి ,సురేష్,రాజేష్ ఖన్నా,భగవాన్ రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి,రాజీవ్,భరత్,ప్రణయ్, అశోక్,అనూప్,పృధ్వి, నరేష్ లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొని సందడి చేశారు.

## అహింసకు ప్రతిరూపం మహిళ: కలెక్టర్

**ప్రజాపక్షం /వరంగల్ :** అహింసకు ప్రతిరూపం మహిళ అని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని ఓ సిటీ క్రీడా మైదానంలో ఆదివారం మేరా యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఓర్పు, సహనం, అహింసకు ప్రతి రూపమని అన్నారు. మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళల కోసం 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, మ్యూజికల్ చెయిర్, లెమన్ అండ్ స్పూన్ రన్, తాడు తీయుట (టగ్ ఆఫ్ వార్) వంటి పలు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, అదనపు కలెక్టర్,సంధ్యారాణి, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ కలిసి ప్రారంభించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పలత, జిల్లా యువజన సేవల అధికారి అనిల్ కుమార్, సుబేదార్ రమేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, జీసీఐ గాయత్రి, మార్గం మూర్తి, శేషనారాయణ, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ వరంగల్ ఈస్ట్ కళాశాల డాక్టర్ రాజలక్ష్మి, సమత, వరంగల్ వెస్ట్ కళాశాల డాక్టర్ రాధిక, డాక్టర్ మానస, మేరా యువ భారత్ వాలంటీర్లు వెల్దండి సురేష్, నవీన్ యాదవ్, విజయ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడులు



**ప్రజాపక్షం/ములుగు:**ములుగు మండలంలోని దేవగిరిపట్నం గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై ములుగు ఎస్‌హెచ్‌ఓ యూ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించగా 7 మందిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పి కేకన్ సుధీర్ రామ్నాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో జూదం ఆడుతున్న వ్యక్తులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.23,600 నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి దాడిలో ఎస్ఐ ఉపేందర్ రావుతో పాటు ములుగు రెండవ ఎస్ఐ బి చంద్రశేఖర్, సివిల్, టిజిఎస్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్నికి పామాయిల్,మామిడి ఆహుతి



**ప్రజాపక్షం/నర్సింహులపేట:**నర్సింహులపేట మండల కేంద్రంలోని డంపింగ్ యార్డుకు ఆనుకుని ఉన్న ఫామాయిల్ తోటకు నిప్పు అంటుకుంది.దీంతో వేముల రమేష్ రెడ్డికి చెందిన 30 ఎకరాల ఫామాయిల్ తోటకు మంటలు అంటుకుని మొక్కలు అగ్నికి అహుతి అయ్యాయి.మరో రైతు సుంకరి చంద్రయ్యకు చెందిన 3ఎకరాల మామిడి తోటకు నిప్పు కూడా అంటుకుని కాయ దశలో ఉన్న సుమారు 30 మామిడి చెట్లు,వంద చెట్లు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి.మంటల వల్ల రైతుల బోరుబావుల స్టాటర్లు ,కరెంట్ వైర్లు ,డ్రిప్ పైపులు కాలిపోయాయి. గ్రామ పంచాయాతీ సిబ్బంది నిర్లక్ష్యంగా డంపింగ్ యార్డులోని చెత్తకు నిప్పు పెట్టడం వల్లనే తమకు పెద్ద మొత్తంలో ఆస్తి నష్ట జరిగిందని రైతులు ఆరోపించారు.అదే విధంగా డంపింగ్ యార్డుకు ఆనుకుని ఉన్న రింగన్ గుట్టకు కూడా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం వల్ల తమకు 30 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని సంబందిత అధికారులు అంచన వేసి నష్ట పరిహారం అందించాలని కోరారు.విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకుచ్చారు. మంటలకు కారకులైనా వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడికి వివాహ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:**హన్మకొండ జిల్లా కేంద్రంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ వివాహ మహోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో గా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పాల్గొని దంపతులిద్దరికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జక్కుల రేవంత్ యాదవ్, ప్రభు, వేల్పుల భరత్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోషకాహారం అందించాలి:కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. జిల్లాలోని రఘునాథపల్లి మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఎప్పటికపుడు శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని, సమయానికి తిని, సరిగ్గా నిద్రపోవాలని, క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. వారి వెంట జీవశాస్త్ర ఉపాధ్యాయులుశ్రీలత,అధికారులు,సిబ్బంది,పాల్గొన్నా రు.

## ఇసుక అక్రమ రవాణాపై అటవీ శాఖ కొరడా



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అటవీ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై అటవీ శాఖ అధికారులు కఠన చర్యలు ప్రారంభించారు.ఆదివారం తెల్లవారుజామున గూడూరు అటవీ శాఖ రేంజ్ అధికాకరి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను అధికారులు పట్టు కున్నారు.అటవీ ప్రాంతాలు నిషేదిత ప్రాంతాలు కావం దతోఅక్కడ నుంచి కట్టేలు ఇసుక వంటి ప్రకృతి సంపదను తరలించడం చట్ట విరుద్ధమని అధికారులు తెలిపా రు.అయినప్పటికీ కొంద మంది అక్రమ దారులు అటవీ ప్రాంతంలో నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు. అదేవిధంగా కొంద మంది యదేచ్ఛగా అటవీ సంపదను సంపాదనగా మలుచుకొని రోజు 6000 నుండి 8000 వరకు ఈస్మగ్లర్ల కాంటాక్టర్లులకు విక్రయి స్తున్నారు.ప్రతి రోజు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ వేల రూపాయలు సంపాదిస్తున్న ఇసుక మాఫియాపై కఠన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చుస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు పర్యాంటున్నారు రాత్రి వేళల్లో ట్రాక్టర్లు తిరగడం వల్ల అడవిలోని జంతువులు కూడా భయాందోళనకు గురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాత్రి వేళ్లలో నిఘాపెంచినట్లు అధికారులు తెలిపారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవిని అక్రమ రవాణా దారుల నుంచి కాపాడాలని రెవెన్యూ పోలీస్ మరియు అటవీ శాఖలు కలిసి కట్టుగా చర్యలు తీసుకోవాలని గూడూరు మండల ప్రజలు కోరుతున్నారు.

## సర్వికల్ కేన్సర్ రాకుండా హెచ్‌పివి వ్యాక్సినేషన్

### ప్రతి ఒక్కరూ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:**మహిళలకు సర్వికల్ క్యాన్సర్ రాకుండా వేస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 నుండి 15 సంవత్సరాల వయసు గల యువతులు(14 సంవత్సరాల అనగా సంవత్సరాలు 1/2/2011 నుండి 28/2/2012 సంవత్సరాలలో పుట్టిన తేదీ బాలికలు అర్హులని) తమ పేర్లను పోర్టల్‌లో నమోదు చేసుకున్న అనంతరం వ్యాక్సిన్ వేసుకోవాలని, యువతుల తల్లిదండ్రుల అనుమతి మేరకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం లాగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ములుగు, ఏటూరునాగారం, వెంకటాపురం మండల కేంద్రాలలోని ఆసుపత్రులలో వ్యాక్సిన్ వేస్తారని వివరించారు. యువతులు ఏఎన్ఎం, ఆశా వర్కర్లను కలిసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు, ఆసుపత్రి సూపరింటిండెంట్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో పరిశుభ్రత కార్యక్రమం

### పాల్గొన్న కలెక్టర్, అధికారులు, సిబ్బంది



**ప్రజాపక్షం / వరంగల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొని కార్యాలయ పరిసరాలు , చాంబర్లను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ గదులు, కారిడార్లు, సమావేశ మందిరాలు , ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన, సానుకూలమైన పని వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ, సమర్థవంతమైన సేవలందించే వాతావరణాన్ని నెలకొల్పడం లక్ష్యంగా పరిశుభ్రత కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా పరిశుభ్రతపై మంచి సందేశం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని ఏవో విశ్వ ప్రసాద్, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ మంజూరుపై హర్షం

### సిఎం రేవంత్ రెడ్డికి ఎంపి, ఎమ్మెల్యేల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ మహానగరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్యతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి గారు వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని ఎంపీ తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే వరంగల్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త దశకు చేరుకుంటుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## బడ్జెట్‌లో బిసిలకు రూ.50 వేల కోట్లు

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్

**ప్రజాపక్షం / వరంగల్ :** మహాత్మ జ్యోతిబాపూలే బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి బడ్జెట్లో బిసిలకు 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ 9 న జరిగే ధర్నాలను జయప్రదం చేయలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే బిసి సబ్ ప్లాన్ ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర బడ్జెట్లో బిసిల సంక్షేమానికి అభివృద్ధికి 50 వేల కోట్ల రూపాయల కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు 9వ తేదీన మండల ,రెవెన్యూ డివిజన్ , జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు చొప్పున ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయల నిధులు బిసిలకు కేటాయించి వారి అభివృద్ధికి సంక్షేమానికి ఖర్చు చేస్తామని చేసిన వాగ్దానాలు కాగితాలకే పరిమితమైనాయన్నారు. గత రెండు బడ్జెట్ లలో 40 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా 20వేల కోట్ల వరకు కేటాయించి ఖర్చు చేసింది కేవలం 5 వేల కోట్లు మాత్రమేనన్నారు. మాయ మాటలతో బిసిలను వంచించే ప్రయత్నం ఇంకెంతకాలం చేస్తారన్నారు. రానున్న బడ్జెట్లో 50 వేల కోట్లు కేటాయించి బిసిల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఎన్నికల ముందు కామారెడ్డి లో ప్రకటించిన బిసి డిక్లరేషన్లోని అంశాలను అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. బిసి, చేతివృత్తుల వారికి చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. బిసిల ఎడల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ న్యాయమైన డిమాండ్స్ సాధనకై సోమవారం జరిగే ధర్నాలలో పాల్గొని జయప్రదం చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,మెప్మ పీడీ, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. మహిళల సాధికారత కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారు విద్య, ఉ ద్యోగాలు,ఇతర అవసరాల కోసం సులభంగా ప్రయాణించే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నాయకులు మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసి వారి అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు

### గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు




**ప్రజాపక్షం/మహాదేవపూర్;**మంచి విద్య విద్యార్థుల భవిశ్యత్తుకు పునాది అని,విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని జిల్లా గ్రందాలయ చైర్మన్ కోట రాజ బాబు.అన్నారు.శనివారం మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించిన 20 వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా శ్రమించాలని అన్నారు.క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్స్ గ్రీన్‌వుడ్ పాఠశాల అన్నారు.మారుమూల ప్రాంతంలో గత 20 సంవత్సరాలుగా క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తూ ఎందరో విద్యార్థుల భవిశ్యత్తుకు పూనాదులు వేసి దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో నిలిపిన ఘనత పాఠశాలకు దక్కుతుందని విద్యార్థుల భవిశ్యత్తుకు పునాదుల వేస్తున్న కరస్పాండెంట్,ప్రధానోపాద్యాయుడు చీర్ల శ్రీనివాస్ రెడ్డి ద్వయంతో పాటు పాఠశాల డైరెక్టర్ ఆకుతోట రాజ్‌కుమార్ లను అభినందిస్తున్నామని అన్నారు.ప్రతీ సంవత్సరం పదవ తరగతిలో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లాలోనే గుర్తింపు పొందిందని పాఠశాలలో అందుతున్న క్రమశిక్షణతో కూడిన విద్యను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల భవిశ్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. ఐటి పరిశ్రమ శాఖ మంత్రిదుద్దిళ్ల శ్రీధర్ బాబు ఐటి,విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతతో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందని అన్నారు.అనంతరం సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,మాజీ జడ్పిటిసి చల్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యతో సాధించలేనిది ఏదీ లేదని,క్రమశిక్షణతో కూడిన విద్యకు ప్రతీ తల్లిదండ్రులు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు.విద్యార్థులు కలలను సాకారం చేసుకోవడానికి విద్య మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు.అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల పరిసరాలు,తరగతి గదులను పరిశీలించి జ్ఞపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు.అనంతరం వారు మాట్లాడుతూ తాము నేడు ఉన్నత స్థాయిలో ఉన్నామంటే ముఖ్యంగా గ్రీన్‌వుడ్ పాఠశాలలో చదువుకున క్రమశిక్షణతో కూడిన విద్య మాత్రమే అన్నారు.క్రమక్షశణతో కూడిన విద్యనందిస్తూ ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా 20 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యనందించి విద్యార్థుల ఉన్నత భవిశ్యత్తును తీర్చిదిద్ద డానికి పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమలాగే రాబోయే విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మండల పాత్రికేయులను శాలువాతో సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ,మాజీ ఎంపిటిసి ఆకుతోట సుదాకర్,నాయకులు అన్మారి ప్రకాష్,పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి,ప్రధానోపాధ్యాయుడు చీర్ల శ్రీనివస్ రెడ్డి,డైరెక్టర్ ఆకుతోటరాజ్ కుమార్,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## టిఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో.. మహిళా దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టిఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలను మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, టిజిఈజెఎసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజాభివృద్ధిలో, పరిపాలనలో మహిళా ఉద్యోగులు పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా వారు కొనియాడారు. విధి నిర్వహణలో మహిళలకు ఎదురవుతున్న సవాళ్లు, హక్కుల గురించి చర్చించారు. మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాసరావు, మహిళా విభాగం నాయకులు లలిత కుమారి, రాధికారెడ్డి, విజయ, మృదుల, సుబ్బమ్మ, లావణ్య, శ్రావణి, పద్మ, రాంబాయి పాల్గొన్నారు.

**టిజివోస్ ఆధ్వర్యంలో..**

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను టిజీవో భవనం నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిజివో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, టిజీవో మహిళా కార్యదర్శి సుధారాణి, టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి విజయ్‌కుమార్, మహిళా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎం. విజయకుమారి, మహిళా గెజిటెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంజాల ఐలయ్యకు ఉగాది పురస్కారం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన కవి,రచయిత పంజాల ఐలయ్యకు ఉగాది పురస్కారం ఆదివారం లభించింది. దీనిని ఖమ్మం నగరంలోని భక్తరాందాస్ కళాక్షేత్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్వరమాధురిమ కల్చరల్ ఆధ్వర్యంలో ప్రధానోత్సవం చేశారు. అవార్డుతో పాటు మెమొంటో సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఉగాది పురస్కారం అందుకోవడంపై పలువురు సాహిత్యవేత్తలు అభినందించారు.

## మహిళల ఎదుగుదల అభివృద్ధికి నాంది

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు ప్రపంచ మహిళా దినోత్సవం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహిళా దినోత్సవం కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతూ ముందుకు పోతున్నారని మరింత అభివృద్ధి చెందాలని ఆదర్శంగా ఉండాలని ఆమె అన్నారు. మహిళలు సమాజ అభివృద్ధికి కీలక శక్తిగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు మాదినేని సునీత, తిరుపతి శివకుమారి, ముళ్ళపాటి విజయలక్ష్మి, నల్లమోతు శైలజ, బత్తుల సుమతి, గోరింట్ల శ్రీదేవి, చింతనిప్పు సులోచన, వుంద్రు వరలక్ష్మి, కమీషనర్ గురులింగం, మెప్మా టిఎంసి బండారుపల్లి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వీరన్న, మున్సిపాలిటీ సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.

## రామ భక్తులకు సరైన ఏర్పాట్లు చేయాలి

శ్రీరామ నవమి ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం, వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం రామాలయాన్ని దర్శించుకున్న ఆయన రామ నవమి ఏర్పాట్లను సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి తాపాన్నితగ్గించేందుకు ప్రత్యేక పాలీహౌస్ ఏర్పాటుచేయాలన్నారు. దేవస్థానం తరుపు పనులు పూర్తయ్యాయని, కల్యాణ మండపం ఏర్పాట్లకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు బస చేసే ప్రాంతం నుండి కల్యాణ మండపానికి రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నామని, ఇందుకు భక్తులు కూడా అధికారులకు సహకరించాలన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం తలంబ్రాలు,ప్రసాదాలను అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాలు కల్తీ కాకుండా ఫుడ్ సేఫ్టీఅధికారులు తగిన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ దామోదర్ రావు, తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, గ్రామపంచాయితీ ఇఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

సమాజసేవకు అంకితం కావాలి

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** సమాజంలోని అన్ని వృత్తులకన్నా నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆ కోర్సును చదువుకోవటానికి ముందుకు వచ్చిన మీరు సమాజ సేవకు అంకితం కావాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి కిన్నెరసాని రహదారిలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో 2026 ఫ్రెషర్స్ డేను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కూనంనేని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ హరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ ఎంచుకొన్న విద్యార్థినిలు కష్టపడి చదువుకొని పైకి ఎదగాలన్నారు. తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ బోధన చేస్తున్న అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో చదువుకోవటం శుభ పరిణామన్నారు. అన్ని వృత్తులకన్నా అత్యుత్తమమైన నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పలు ఇబ్బందులను ఎదుర్కొంటూ ఇతరులు ప్రాణాలను కాపాడే వృత్తిలో ఉంటున్న మీరు తల పైకెత్తి గర్వపడాలని సూచించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో నర్సులు చేసిన సేవ వెలకట్టలేనిదని చెప్పారు. వారి సేవలను ఎంత కొనియాడినా తక్కువేనన్నారు. వృత్తి ధర్మం పాటిస్తూ ఇతరులకు సహాయం చేస్తూ సమాజ సేవకు అంకితం కావాలని కోరారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం శాలువా, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, 44వ, డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, స్టూడెంట్స్, పేరెంట్స్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు హెచ్‌పివి టీకా ఓ వరం..**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బాలికల ఆరోగ్య పరిరక్షణతోనే సమాజం సురక్షితంగా ఉంటుందని, బాలికలకు అందించే గర్భాశయ కేన్సర్ నిర్మూలనకు హెచ్‌పివి టికా ఓ వరం అని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుండి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన హెచ్ పి వి టీకా కార్యక్రమాన్ని ఆదివారం ఆయన కొత్తగూడెం ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో కలెక్టర్ అంకిత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేన్సర్ వంటి మహమ్మారిని ప్రాథమిక దశలోనే నివారించేందుకు ఈ టీకాలు ఎంతగానో ఉపయోగపడతాయని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో అర్హులైన బాలికలు అందరికీ ఈ టీకాలు అందేలా వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ పద్ధతుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మహిళల సంక్షేమం కోసం యంత్రాంగం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. రాధా మోహన్ పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్‌తో కేన్సర్ నివారణ

వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హెచ్‌పివి వ్యాక్సినేషన్‌తో మహిళలకు గర్భాశయ కేన్సర్ రాకుండా నివారించవచ్చునని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జనరల్ ఆసుపత్రిలోని రేడియాలజీ హబ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలకు వచ్చే గర్భాశయ కేన్సర్ నివారణ కోసం వ్యాక్సిన్ వచ్చిందన్నారు. కౌమార బాలికలకు హెచ్‌పివి టీకాను అందించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ కేన్సర్‌ను కట్టడి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒకే మోతాదులో ఇవ్వనున్న హెచ్‌పివి టీకా గర్భాశయ కేన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని, టీకా సురక్షితమైందని ఖమ్మం జిల్లాలో బాలికలకు తల్లిదండ్రుల ఆమోదంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా టీకా వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. టీకా వల్ల లాభాలను తల్లిదండ్రులకు వివరించి అధిక సంఖ్యలో బాలికలకు టీకా అందేలా చూడాలన్నారు. బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేయడం ద్వారా దేశంతో పాటు విదేశాల్లో కూడా అవకాశాలు ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిసిహెచ్‌ఎస్ రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేందర్, ఆర్‌ఎంవో రాంబాబు, రాజేంద్రప్రసాద్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' కథనాలపై నిఘావర్గాల ఆరా?

ఎన్నికల ఆడిట్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తింపు

కోడ్ ఉల్లంఘనలో అధికారుల తీరుపై వివరాల సేకరణ

అప్పుడే రిటర్న్స్ పొందుతున్న కౌన్సిలర్లపై నిఘా ఏర్పాటు


గెలుపు పెట్టుబడి మంచిదే..
- కొందరు కౌన్సిలర్లకు కలిసి వస్తున్న రిటర్న్‌గిఫ్ట్స్
- ప్రసన్నం చేసుకునే పనిలో వ్యాపారులు
- చర్చనీయాంశంగా మారిన ప్రజాపక్షం కథనాలు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఇటీవల జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో చోటు చేసుకున్న డబ్బు పంపిణీపై ప్రజాపక్షం దినపత్రిక పతాక స్థాయిలో వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం విధితమే. అలాగే ఆడిట్లో జరుగుతున్న

మిగతా 2లో

ప్రజాపక్షం
epaper.prajapaksham.in
Khammam Tab - Page 1 - 08 Mar 2026




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఇటీవల జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రజాస్వామ్యాన్ని కూని చేయడం, ఎన్నికల ఆడిట్‌లోని అవతవకలపై 'ప్రజాపక్షం' ప్రచురించిన వరుస కథనాలపై నిఘా వర్గాలు స్పందించాయి. ఏదులాపురం మున్సిపాలిటీలోని ఓ ఉన్నత స్థాయి అధికారిని తన ఛాంబర్‌లో కలిశాయి. ఆడిట్ విభాగంలో అభ్యర్థుల నుంచి ఎటువంటి వివరాలను తీసుకుంటున్నారని, ప్రశ్నించారు. అక్కడి నుంచి నేరుగా కొందరు అభ్యర్థులను కలిసి ఆడిట్‌లో పెట్టిన ఖర్చులు సరి చేయడం కోసం కొంత డబ్బును ఇచ్చినట్టు వారి ద్వారా తెలుసుకున్నారు. అలాగే ఎన్నికలలో డబ్బు ప్రభావంపై సైతం ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటిని క్రోడీకరించి, ప్రభుత్వానికి నివేదికను పంపించినట్లు సమాచారం.

**కొందరు కౌన్సిలర్లపై నిఘా...**

అప్పుడే రిటర్న్స్ మొదలైన కొందరు కౌన్సిర్లపై నిఘా వర్గాలు ప్రత్యేక నిఘాను ఏర్పరిచాయి. వారి వద్దకు ఎవరు వచ్చి కలుస్తున్నారు. ఏ పని నిమిత్తం వారి వార్డుల్లో ఉన్న ఇన్‌లీగల్ ఇన్‌కమ్ సోర్స్ ఏంటనే దానిని తెలుసుకునే పనిలో పడ్డారు. వ్యాపారులు ఎందుకు కొందరు కౌన్సిలర్లను కలుస్తున్నారనే వివరాలను సైతం సేకరించినట్లు సమాచారం. ఏవైన నిబంధనలకు వ్యతిరేక విధనాలను చేయాలని అధికారులపై ఏమైన ఒత్తిడి తెస్తున్నారా? అంటూ రహస్య పరిశీలన చేస్తున్నారు. అలాగే కౌన్సిలర్లుగా గెలిచిన తర్వాత వారు ఎవరెవరిని కలుస్తున్నారనేది తెలుసుకుంటున్నట్లు విశ్వాసనీయ సమాచారం.

## డబ్బు కోసం భర్తను చంపించిన భార్య

పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు

నిందితులను రిమాండ్‌కు తరలింపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఇన్సూరెన్స్ సొమ్ము కోసం కట్టుకున్న భార్య కుట్ర పన్ని భర్తను హత్య చేయించిన ఘటన సంచలనం రేపింది. పోలీసులు మొదట ప్రమాదంగా భావించి దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు ఏదులాపురంమున్సిపాలిటీలోని ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు వివరాలను వెల్లడించారు. ఖమ్మం నగరం గాంధీనగర్‌కు చెందిన చాగంటి రవి(55) పెయిటింగ్ పని చేస్తూ జీవినం సాగిస్తున్నాడు. వరుసకు బావమరిదైన ఖమ్మంకు చెందిన దేశబోయిన శ్రీనివాస్, అతని స్నేహితులు బోగి రాజ్‌కుమార్, జోగి వెంకటేష్, చాగంటి ప్రశాంతి రవి పేరు మీద రూ.66లక్షల బీమా చేయించారు. బీమా సొమ్ముతో పాటు అతని కారును కాజేసేందుకు నిందితులు పథకం వేశారు. ఇందులో భాగంగా ఈనెల 2న రాత్రి సుమారు 8గంటల సమయంలో దేశబోయిన శ్రీనివాస్ పథకం ప్రకారం మందు తాగుదాం అని తన ఆటోలో రవిని బైటికి తీసుకువెళ్లి అందరూ కలిసి మద్యం తాగి ఖమ్మంరూరల్ మండలంలోని ఎం.వెంకటయ్యపాలెం శివారులో రవిని దింపి వెళ్లిపోయినట్లుగా నమ్మించారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న చాగంటి రవి గ్రామం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెంకటేష్‌కి చెందిన కారును నిందితుడు జోగి రాజ్‌కుమార్ వేగంగా నడపుతూ వెనుక నుంచి ఢీ కొట్టి హత్య చేశారు. అనంతరం నిందితులు కారును సమీపంలోని తన గంపాడు గ్రామంలోని నిందితుడు వెంకటేష్ మిత్రుడైన దంచినాల సురేష్ ఇంటి వద్ద యాక్సిడెంట్ అయ్యిందని తరువాత తీసుకెళ్తా అని కవర్‌తో కప్పి దాచారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు గుర్తించి కారు, ఆటో, నిందితుల సెల్‌ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. చట్ట ప్రకారం నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఎంతో చాకచక్యంగా త్వరితగతిన విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌హెచ్‌ఓ అభినందించారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన అవసరం

అదనపు కలెక్టర్ విద్యా చందన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన అవసరమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధ్యాతనిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం చుంచుపల్లి మండలంలోని నంద తండా గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ యూనిట్‌ను సందర్శించి కార్యకలాపాలను పరిశీలించారు. గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలను సక్రమంగా సేకరించి శుద్ధి చేసి వినియోగించే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజర గ్రామపంచాయితీలో స్వయం సహాయక సంఘా మహిళలు, గ్రామస్తులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తడిపొడి చెత్తను వేరు చేయాలని, తద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ స్వచ్ఛ బారత్ మిషన్ కన్సల్టెంట్, సంబంధిత ఎంపిడిఓలు, గ్రామ సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంత ఇంటి కల సాకారానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/మణుగూరు :** పేద ప్రజలకు సొంత ఇంటి కల సాకారం చేయడానికి ప్ర భుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం పీకే1 సెంటర్ ప్రాంతంలో ఆదివా రం నిర్వహించిన మణుగూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురం రవి నూతన ఇందిరమ్మ ఇంటి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపా రు. పేద ప్రజలకు సొంత ఇల్లు కల సాకారం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సంతోష్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదు లు, మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు త రుణ్ రెడ్డి, మణుగూరు మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సిరియాల చైతన్య నాయుడు, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, పోలమూరి రాజు, రామ్ రెడ్డి, బానోతు లక్ష్మ ణ్ , చింతల కృష్ణ, బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు, పాతూరి వెంకన్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పద్మ, శ్యామల, నాగమణి, స్వరూప, మంగా, జీవి, శ్రీను, రేసు ఉప్పయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ తీరు షరా'మామూ(ళ్లే)లే'

మద్యం మత్తులో పల్లెలు

సిండికేట్ చెప్పిందే వేదం!

వైరా ఎక్సైజ్ పరిధిలో సిండికేట్ దందా

వైరాలో చేతులెత్తేసిన ఎక్సైజ్‌శాఖ

ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసిన మద్యం వ్యాపారులు




**ప్రజాపక్షం/వైరా :** వైరాలో మద్యం వ్యాపారులు వారికి నచ్చినట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిని నియంత్రించాల్సిన వారు మామూళ్ల పేరిట ప్రోత్సహిస్తుండడంతో దుకాణాల వద్ద నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ఎక్కడ లేనివిధంగా వైరా ఎక్సైజ్ పరిధిలో మద్యం వ్యాపారులు సరికొత్త దందాకు తెరలేపారు. వైరా మున్సిపాలిటీలో మూడు వైన్‌షాపులు రెండు బార్ షాపులు ఉన్నాయి. వైరా ఎక్సైజ్ పరిధిలో కొణిజర్ల మండలంలో మూడు వైన్ షాపులు తల్లాడ మండలంలో నాలుగు వైన్ షాపులు టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొన్ని వైన్ షాపుల్లో రిటైల్ అంటూ మద్యం విక్రయిస్తున్నారు. మరికొన్ని వైన్ షాపుల్లో కేవలం బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కొన్నిదుకాణాలకు పర్మిట్ రూమ్‌లు కూడా లేవు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని వైన్ షాపులకు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ నిబంధన ప్రకారం వస్తువులు ఏర్పాటు చేయడంలో చేతులెత్తేశారు. ఇదంతా ఎక్సైజ్ అధికారులు కనుసన్నల్లోనే జరుగుతున్నా వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా సిండికేట్ బెల్ట్ దందాకు పై అధికారుల అండదండలు ఉన్నాయి, రాజకీయ నాయకు సపోర్ట్ ఉంది అనే విధంగా కొందరు వైన్ షాపుల నిర్వాహకులు అంటున్న మాటలు ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. ఎక్సైజ్ అధికారుల పనితీరు పట్ల విమర్శలు వస్తున్నా ఎవరేమనుకుంటే మాకేంటి ఆ దందాకు అడ్డుకట్ట ఏంది అనే ధోరణి వారిలో కనిపిస్తుంది. ఉన్నతాధికారుల అండదండలు రాజకీయ పలుకుబడితో సిండికేట్ బెల్టు వ్యాపారం నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారు.

**బెల్ట్ సిండికేట్ దందాకు అధికారుల అండ...**

మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి నడిపిస్తున్న మద్యం దందాకు అధికారులు అండదండలు మాకు ఉన్నాయి. వైన్స్ షాపుల్లో నామమాత్రపు తనిఖీలు మాత్రమే చేస్తారు. వారు తనిఖీలకు వస్తుంటే ముందుగానే మాకు సమాచారం అందుతుంది. సమాచారం అందిన వెంటనే బెల్ట్ షాపు నిర్వాహకులకు మేము సమాచారం అందిస్తాం. అప్పుడు అధికారులు వచ్చి తనిఖీలు చేస్తారు. ఏమీ దొరకదు వెళ్లిపోతారు. ఇది అంతా మా మధ్య ఉన్న అంతరంగిక ఒప్పందం అని పలువురు వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికారులు బెల్ట్ షాపులను నిర్వహణ కోసం చేతులు కలిపారా అభయం ఇచ్చారా అనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బెల్టు షాపుల నిర్వహణకు అభయమిస్తూ పల్లెల్లో బెల్టు దుకాణాలకు ఊతమిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్టు షాపుల నిర్వాహకుల దగ్గర నుంచి కూడా నెల నెల మామూళ్లు వైన్‌షాపు నిర్వాహకులు తీసుకుంటూ బెల్టు షాపుల కట్టడిని విస్మరిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు వద్ద తీసుకున్న మామూళ్లు ఎక్కడికి వెళుతున్నాయి. నిద్ర మత్తులో ఎక్సైజ్ అధికారులు జోగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకు బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా ముందే వారికి అధికారులే సమాచారం ఇస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ఎ క్కడా లేనివిధంగా వైరా ఎక్సైజ్ అధికారుల తీరుపై స ర్వ త్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామాల్లో గల్లీకొ క బెల్ట్‌షాపు ఏర్పాటు చేశారు. నిత్యం బెల్ట్ షాపుల్లోనే మద్యం మత్తుకి బానిస అవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్ బెల్టు సిండికేట్ వ్యాపారంపై దృష్టి సారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల జాడేదీ?**

ఖమ్మం జిల్లాలో అప్పుడప్పుడు దాడులు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు మచ్చుకు కూడా వైరా ఎక్సైజ్ పరిధిలో తనిఖీలు చేసింది కూడా కనిపించడం లేదు. అంతేకాకంపడా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు కూడా పూర్తిస్థాయిలో చేసినట్లు కనిపించడం లేదు. ఒక వేళ వాళ్లు తనిఖీలకు వచ్చిన స్థానిక అధికారులు మద్యం వ్యాపారులకు ముందే సమాచారం ఇస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సిబ్బంది తనిఖీలు జాడ కనిపించకపోవడం టాస్క్‌ఫోర్స్ దాడులు తగ్గిపోవడంతో వ్యాపారులు నిబంధనలు పక్కన పెట్టి తమకు ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని అధికారులు మౌఖిక ఆదేశాలిచ్చినట్లు బయట ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు వైరా ఎక్సైజ్ పరిధిలోని బెల్టు సిండికేట్ వ్యాపారంతో నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మద్యం షాపులపై దాడులు చేసి వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, మహిళలు కోరుతున్నారు. జిల్లాలో అడపాదడపా దాడులు చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల జాడ మచ్చుకు కనిపించడం లేదు. ఒక వేళ ఎక్కడైనా దాడులు చేసినా కేసులు ఎక్కడ కనిపించడం లేదు. అంతేకాకుండా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు కూడా ఇక్కడ కనిపించడం లేదు.

ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
సోమవారం
09-03-2026
www.prajapaksham.in

"బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా అంతర్జాతీయ నటి మారియా ర్యాబోషాప్కా నటించనుందని ప్రకటించారు."

రీల్



## ఆకట్టుకుంటున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' గ్లింప్స్

'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి తాజాగా విడుదలైన శక్తివంతమైన గ్లింప్స్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేపుతోంది. పవన్ కళ్యాణ్ అద్భుతమైన, కమాండింగ్ అవతార్‌లో కనిపించిన ఈ గ్లింప్స్.. ప్రేక్షకులు తెరపై చూడటానికి ఇష్టపడే మాస్ ఎనర్జీ, చరిష్మాను సంపూర్ణంగా స ంగ్రహించింది. ఈ గ్లింప్స్ విడుదలైన క్షణం ను ంచే సామాజిక మాధ్యమా ల్లో అద్భుతమైన స్పందన లభిస్తోంది. పవన్ క ళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, ప్రభావవంతమైన డైలాగులు, శక్తివంతమైన బాడీ లాంగ్వేజ్ అభిమానులు, ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అభిమానులచే 'కల్ట్ కెప్టెన్' అని ప్రశంసించబడే దర్శకుడు హరీష్ శంకర్, ప్రేక్షకులు ఆరాధించే విధంగా పవన్ కళ్యాణ్‌ను మరోసారి ఉత్తేజపరిచే రీతిలో ప్రదర్శించడ ంలో సఫలమయ్యారు. ఈ గ్లింప్స్ సినిమా తీవ్రతను, పవర్ స్టార్ పాత్రను మరింత బలంగా చూపించే విధంగా రూపొందించబడింది. గ్లింప్స్‌కు వస్తున్న అ ద్భుతమైన స్పందనపై చిత్రబృ ందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఇది చిన్న భాగం మాత్రమేనని, త్వ రలో విడుదల కానున్న ట్రైలర్‌తో మరింత ఉ త్సాహం పెరుగుతుందని నిర్మాతలు చెప్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి పాటలను స్వరపరచగా, ఎస్. తమన్ నేపథ్య సం గీతం అందిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' తరువాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కల యికలో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తా ద్ భగత్ సింగ్'పై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి వి డుదలైన ప్రతి కంటెంట్కు అద్భుతమైన స్ప ందన లభించింది.త్వరలోనే ట్రైలర్ విడుదల కానుండగా, సినిమాపై ఉత్సాహం మరింత పెరగనుంది.'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సి ంగ్' థియేటర్‌లలో అడుగుపెట్టనుంది. పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశిఖన్నా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథనం: కె. దశరథ్, రమేష్ రెడ్డి, రచనా సహకా రం: ప్రవీణ్ వర్మ, చంద్ర మోహన్, కూ ర్పు: కార్తిక శ్రీనివాస్, ప్రొడ్యూసర్లు: ఆర్. చంద్రశేఖర్, దినేష్ నరసింహన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: హరీష్ పై, ఫైట్స్: రామ్‌లక్ష్మ ణ్, నబకాంత్, పృథ్వీ.



## 'విక్రమ్ ఆన్ డ్యూటీ' కంటెంట్ ఇంట్రెస్టింగ్

### సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి

బిగ్ బాస్ విన్నర్ నిఖిల్ మలియక్కల్ హీరోగా బ్రహ్మ రు ద్ర దర్శకత్వంలో రూపొందిన క్రై మ్ థ్రిల్లర్ 'విక్రమ్ ఆన్ డ్యూటీ'. జ్ఞాపిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై ప్రవీణ, అనిల్ కడియాల నిర్మించారు. జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ సిరిస్ టాప్‌వన్‌లో ట్రెం డ్ అవుతోంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ కి ఎం ఎం కీరవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ ఈ వెబ్ సిరీస్ లో కొన్ని గ్లింప్స్ చూ శాను. హంట్ అనే యూనిట్ ద్వారా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ జరుగుతుంది. హంట్ తో టాలెంట్ హం ట్ జరగడం చాలా సంతోషాన్ని ఇస్తుంది. ఇండస్ట్రీకి చాలామంది కొత్త వాళ్ళు రావాలి. కొత్త మ్యూజిక్ డైరెక్టర్ సుహాస్‌కి ఆల్ ది వెరీ బెస్ట్. తన మ్యూజిక్ బిట్స్ బా వున్నాయి. ఇది ఆల్రెడీ నెంబర్ వన్ స్ట్రీమింగ్ లో ఉందని తెలిసింది. హర్ష తన అనుభవాన్ని రంగరి ంచి చేస్తున్నారు. చిన్నప్పుడు కొమ్మూరి సాంబశివరా వు డిటెక్టివ్ నవల చదివాను. అందులో డిటెక్టివ్ తన బ్రెయిన్ ఉపయోగించి కొన్ని నేరాలని పరిశోధిస్తుంటా డు. అలాగే మధుబాబు నవలల్లో యాక్షన్ కూడా ఉంటుంది. ఈ సిరిస్ ఆ రెండూ ఉంటాయని ఆశిస్తున్నాను. చివరిగా ఒక హుక్ లైన్ ఇవ్వాలంటే.. విక్రమ్ ఆన్ డ్యూటీ బికాస్ ఆఫ్ హర్ష అఫ్ డ్యూటీ అని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో బిగ్ బాస్ విన్నర్ నిఖిల్, యాక్టర్ అమర్, ప్రొడ్యూసర్ ప్రవీణ, నిర్మాత అనిల్ కడియాల, డైరెక్టర్ బ్రహ్మ రుద్ర, నటి ఆషు రెడ్డి, సంగీత దర్శకుడు సుహాస్, రచయిత శ్రీ హర్ష పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న 'రపప్పా.. రపప్పా' పాట



కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాలతో కలిసి 'రాకాస' మూవీని నిర్మించా రు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతున్నారు. 'రపప్పా.. రపప్పా' అంటూ సాగే ఈ పాట ఎంతో చక్కగా ఉంది. హీరోయిన్ ప ట్ల హీరోకి ఉన్న ప్రేమ, తనకి బదులుగా వేరే వాడిని పెళ్లి చేసుకుంటోన్న తరుణంలో హీరోయిన్ గురించి హీరో చెప్పడం, తన బాధను వివరించడం ఈ పాటలో కనిపిస్తోంది. ఆ బాధని కూడా ట్రెండీ పదాలతో, చాలా ఫన్నీగా చెప్పే ప్రయత్నం చేశారు. అనుదీప్ దేవ్ అం దించిన బాణీ, రఘురాం సాహిత్యం, రామ్ మిర్యాల గాత్రం ఈ పాటను మరింత స్పెషల్ గా మార్చేశాయి. ప్రస్తుతం ఈ పాట మ్యూజిక ల్ లవర్స్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చి త్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫర్‌గా, ఎడిటర్‌గా అన్వర్ అలీ పని చేశారు.ఈ మూవీ ఆడియో హక్కుల్ని సరిగమ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమాని ఓవర్సీస్‌లో అథర్వణ భద్రకాళి పిక్చర్స్, కెనడాలో ప్రత్యంగిరా సినిమాస్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నా రు. సంగీత్ శోభన్, నయన్ సారిక, వెన్నెల కి షోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను, సుక్విందర్ సింగ్, అన్నపూర్ణ, అమన్, అనూప్ సింగ్ ఠాకూర్, రమణ భా ర్గవ్, వాసు ఇంటూరి, రోహిణి (బజర్దస్త్), రో హన్ (నైంటీస్) తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికికథ, స్క్రీన్ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: మానస శర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మ న్యం రమేష్, ఆడిషన్ స్క్రీన్ ప్లే: మహేష్ ఉప్పా ల, సంగీతం: అనుదీప్ దేవ్, సినిమాటోగ్రాఫ ర్: రాజు ఎదురోలు, యాక్షన్ కొరియోగ్రాఫ ర్: విజయ్, ఎడిటర్: అన్వర్ అలీ, ప్రొడక్షన్ డిజైనర్: రామాంజనేయులు,ఆర్ట్ డైరెక్టర్: పుల్ల విష్ణు వర్ధన్, కాస్ట్యూమ్ డిజైనర్: సంధ్య.

## రాప్ సాంగ్ పాడు-తున్న 'గాయపడ్డ సింహం'



నటుడు తరుణ్ భాస్కర్ రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అ లరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్సకి, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.తాజాగా సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాట సినిమా సెటైరికల్ గా ఉంది. ఈ పాట హీరో అమెరికన్ డ్రీమ్ ఎలా ఒక్కసారిగా తలకిందులవుతుందో చూపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ ప్రకటించిన డిపోర్టేషన్ నిర్ణయం తర్వాత హీరో జీవితంలో ఏర్పడే గందరగోళ పరిస్థితులను సరదాగా చూపించారు. ట్రెండీ బీట్స్‌తో రూపొందిన ఈ ర్యాప్ సాంగ్‌ను సంగీత దర్శకుడు స్వీకర్ అగస్తీ స్వయంగా ఆలపించగా, ర్యాప్ పారట్స్ అసుర పాడారు. సాహిత్యాన్ని కూడా స్వీకర్ అగస్తి రాయగా, అసురా ర్యాప్ వెర్షన్ అందించారు. రిజెక్షన్ స్టాంపులు, ట్రంప్ విగ్రహాలు, హ్యాపీ డిపోర్టేషన్ కేక్ కట్టింగ్ వంటి సరదా సన్నివేశాలతో పాట వినోదాత్మకంగా సాగుతుంది.వీడియోలో ఎనర్జీతో నిండిన డ్యాన్స్ మూమెంట్స్, సరదా విజువల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. తరుణ్ భాస్కర్ తన హ్యూమర్‌తో నవ్వులు పండించాడు. టైటిల్‌కుర తగినట్లు ఒక సింహం కూడా విజువల్గా కనిపిస్తూ కథలోని గాయపడ్డ సింహంను సూచిస్తుంది. స్వీకర్ అగస్తి, అసురా కూడా వీడియోలో కనిపిస్తూ ఫన్ మరింత పెంచారు.ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విద్యా సాగర్ చింతా సినిమాటోగ్రఫీ, విప్లవ్ నైషదం ఎడిటింగ్, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైన్, సూర్య ప్రకాష్ జ్యోసుల కథను అందిస్తున్నారు.ఈ చిత్రం వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది.

## 'మృత్యుంజయ్' బ్లాక్ బ్లస్టర్ 'సక్సెస్ మీట్'

శ్రీ విష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కించిన చిత్రం 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. 'సామజవరగమన'తో బ్లాక్ బస్టర్ హిట్ పెయిర్‌గా నిలిచిన శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ ఈ చిత్రంతో మరోసారి అలరించారు. మార్చి 6న ఈ మూవీ విడుదలైన ఈ మూవీ బ్లాక్ బస్టర్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే చిత్రయూనిట్ థ్రిల్లింగ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ హుస్సేన్ రైటింగ్, ట్విస్ట్‌లు అద్భుతంగా అనిపించాయి. కాళ భైరవ ఆర్ఆర్ చూసి నేను కూడా షాక్ అయ్యాను. ఆయన ఆర్ఆర్ వల్లే సినిమా స్థాయి పెరిగింది. ఈ చిత్రానికి ఆయనే నిజమైన హీరో. సినిమా చూసిన వాళ్లంతా గొప్పగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఇంకా చూడని వాళ్లుంటే వెంటనే మా మూవీని చూడండి. తెలుగులో చాలా అరుదుగా వచ్చే థ్రిల్లర్‌లో ఇదొక మంచి సినిమా అవుతుంది. ఇంకా మా మూవీని ఇలానే చూసి పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ మాట్లాడుతూ మేం రిలీజ్ సినిమాలోని కంటెంట్‌తోనే ఆడియెన్స్ కనెక్ట్ అయ్యారు. మూవీ చూసిన తరువాత ఆడియెన్స్ సోషల్ మీడియాలో చెబుతున్న రివ్యూలు చూసి ఎంతో ఆనందమేసింది. మా సినిమాని ఆదరిస్తున్న ఆడియెన్సుకు థాంక్స్. మా సినిమాని ఇంకా ఇలానే ఆడియెన్స్ ఎంకరేజ్ చేస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు. నిర్మాత సందీప్ గుణ్ణం మాట్లాడుతూ మీడియా నుంచి మా 'మృత్యుంజయ్'కి చాలా మంచి సపోర్ట్ లభించింది.



## విశాల్ - సుందర్ కాంబో కొత్తచిత్రం 'మొగుడు'



విశాల్, సుందర్. సి కాంబోలో ఇది వరకు వచ్చిన 'ఆంబళ', 'మదగద రాజా' చిత్రాలు బ్లాక్ బస్టర్గా నిలిచాయి. ఇక ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టే క్రమంలో ఈ ఇద్దరూ కలిసి 'మొగుడు' అనే మూవీ చేస్తున్నారు. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్గా నటిస్తున్నారు. డా. ఎ.సి. షణ్ముఖం ఆశీస్సులతో అవని సినిమాస్ ప్రై.లి., బెంజ్ మీడియా ప్రై.లి. బ్యానర్లపై ఈ మూవీని అరుణ్ కుమార్, ఖుష్బూ సుందర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నవదీప్, సంపత్, అజయ్ ఘోష్, గరుడ రామ్, వీటీవీ గణేష్, యోగి బాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. 'మొగుడు' సినిమాకి సంబంధించిన టైటిల్ ప్రోమోను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓ సాధారణ మొగుడిలా ఇంట్లో అన్ని పనులు చేస్తూనే.. అండర్ కవర్ పోలీస్గా రౌడీలను చితక్కొట్టేశాడు విశాల్. అన్ని రకాల అంశాల్ని జోడించిన ఈ మూవీని ఫుల్ మాస్ కమర్షియల్ యాంగిల్‌లో సుందర్. సి ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్టుగా టైటిల్ ప్రోమోతో తెలుస్తోంది. ఇక సుందర్. సి ఇప్పటి వరకు తీసిన 40కి పైగా చిత్రాలకు మాస్ ఆడియెన్సకి ఉన్న క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఈ 'మొగుడు' మూవీని కూడా వాటికి ఏ మాత్రం తగ్గకుండా ఉండేట్టు ప్లాన్ చేసుకుంటున్నారు.'మొగుడు' సినిమా ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ఇక నెకట్స్ షెడ్యూల్ను కోల్ కత్తా , గోవా, చెన్నైల్లో ప్లాన్ చేశారు. ఈ మూవీకి హిప్హాప్ తమిళ సంగీతాన్ని అందిస్తున్నారు. రోడ్జర్ ఎడిటర్గా, గోపీ అమర్ నాథ్ కెమెరామెన్‌ను, గురు రాజ్ ఆర్ట్ డైరెక్టర్గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి కొరియోగ్రఫర్‌గా బృందా పని చేస్తున్నారు.



# హైదరాబాద్‌కు రానీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌లో తిరిగే ఆర్‌టిసి బస్సులను 2026 డిసెంబర్ 9 నాటికి వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెట్టనున్నామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, అంతర్జాతీయ నగరంగా రాణించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలని కోరారు. దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో మహిళా జర్నలిస్టులు విశ్లేషించాలన్నారు. వర్షాలొస్తే ముంబయ్ అతలాకుతలమవుతోందని, వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతమవుతోందని, బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు, వరదలొచ్చినప్పుడు చెన్నైలో ఏర్పడే ప్రమాదకర పరిస్థితులను గమనిస్తూనే ఉన్నామని సిఎం వివరించారు. సమీప భవిష్యత్తులో హైదరాబాద్ నివాస యోగ్యం కాని నగరంగా మారే పరిస్థితులు రావొద్దని, ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ నగరానికి తలెత్తకూడదనే ప్రణాళికలు రూపొందించామని, హైదరాబాద్‌లో వాయు నాణ్యత (ఎక్యూ) ఇప్పటికే ఆరెంజ్ కేటగిరీలోకి చేరిందని, మరింత ప్రమాదకంగా జీవించడానికి వీలులేని పరిస్థితులు తెచ్చుకోవద్దన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగిన కారణంగానే కొన్ని దేశాలు ఆర్థికంగా బలమైన దేశాలుగా నిలబడ్డాయన్నారు. సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు ముగింపు పలకాలంటే మహిళల శక్తిని గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదని, కష్టపడే వారికి గుర్తింపునివ్వాల్సిన బాధ్యత అందరిపైనా, ప్రభుత్వాలపైనా ఉందన్నారు.

**ప్రభుత్వ కార్యాచరణ లేకుండా కాలుష్య నివారణ ఎలా సాధ్యం**

హైదరాబాద్‌లో చెత్త పేరుకుపోతోందని, దోమలు పెరిగాయని, మూసీలో కాలుష్యం పారుతోందని, నియంత్రించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారని, ప్రభుత్వం అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టకుండా వాటి నివారణ ఎలా సాధ్యమన్నారు. నదుల్లో కాలుష్య నివారణకు ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యూపీలో గంగా నది ప్రక్షాళన, గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టినట్టే, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఎందుకు చేపట్టొద్దని సిఎం ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ నదికి సంబంధించి బఫర్ జోన్ విషయంలో 2012లో నిబంధనలు రూపొందించారని, నాలా అయితే బఫర్ జోన్ ఎంత ఉండాలి, చెరువులైతే ఎంత ఉండాలి, నదులైతే ఎంత ఉండాలన్నది ఖరారు చేశారని, ఆ మేరకు మూసీ నది వెంట నాలా అయితే 10మీటర్లు, నదికి 50మీటర్ల బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు.

**నిర్వాసితులకు ప్రభుత్వం సరైన సహాయం అందిస్తాం**

కాలుష్య కారక మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో నిర్వాసితులకు ప్రభుత్వం సరైన సహాయం అందిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టును అడ్డుకోవడంకన్నా బాధ్యత కలిగిన వారంతా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడం లేదా వారికి మరే ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వంతో చర్చించవచ్చు.

**13న గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని, ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు వద్ద ఒక అపార్ట్‌మెంట్‌పై ఈ మధ్య చర్చ జరుగుతోందని, 7 ఎకరాల ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు అంతే స్థలమిచ్చి, కొత్తగా నిర్మాణానికి అయ్యే ఖర్చును బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పామని, లేదా నష్టపరిహారం తీసుకుని వేరేప్రాంతంలో కట్టుకుంటామన్నా ఇబ్బంది లేదని ప్రభుత్వం పలు ప్రత్యామ్నాయాలను సూచించిందన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ఫేజ్–1లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రూ.5వేల కోట్లు, రూ.10వేల కోట్లు వెచ్చిస్తున్నారని చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారని, గాంధీ విగ్రహం కోసం దాదా పు రూ.70కోట్లు, విజ్ఞాన కేంద్రం, ఆ ప్రాంత అభివృద్ధి మొత్తంగా రూ.200కోట్లు మాత్రమే ఖర్చవుతుందని సిఎం స్పష్టం చేశారు.

**ఆటోల రెట్రోఫిటింగ్‌కు ప్రణాళికలు**

నగరంలో 2 లక్షల ఆటోలున్నాయి. డీజిల్, పెట్రోల్ ఇతర ఇంధన ఆధారంగా నడుస్తున్న ఈ ఆటోలను రెట్రోఫిటింగ్ కింద ఈవీలుగా మార్చాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సిఎం చెప్పారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్‌కు పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. నగరంలో కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ కేటగిరీలోని పరిశ్రమలను నగరం అవతలి వైపునకు తరలిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్.ప్రియాంకతో పాటు మహిళా జర్నలిస్టులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### మహిళా జర్నలిస్టుల రక్షణ కోసం కమిటీలు..

మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేసే చోట మహిళలకు రక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రక్షణ కల్పించడమే కాకుండా ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుందని, డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగబోదని స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తరహాలో ఫిర్యాదుల అథారిటీ ఉన్నదని,అలాగే సోషల్ మీడియా ప్రసారం అవుతున్న అవాస్తవాలపైన ఫిర్యాదుచేసే అథారిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. నిజం, అబద్ధం అనేది తోడు, నీడ లాంటిదని, నిజమైన జర్నలిస్టులకు, జర్నలిస్టుల ముసుగులో వ్యాపారాలు, వ్యవహారాలు చేసే వారిమధ్య ఉన్న తారతమ్యం విషయంలో ఒక చట్టాన్ని తీసుకొచ్చే అంశాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులకు ఎటువంటి తేడా లేదాన్నారు. దేశంలో అగ్రస్థానంలో తెలంగాణనను నిలపాలన్న లక్ష్య సాధనలో మహిళా జర్నలిస్టుల సహకారం ఉండాలని, మహిళలకు ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చుకుందామని చెప్పారు.

### ఫ్యూచర్‌సిటీలో ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జర్నలిస్టుల కాలనీలు

జర్నలిస్టుల ఇండ్ల విషయంలో 'ఒక వే ఫార్వర్డ్' ఆలోచన చేస్తున్నానని, త్వరలోనే ఒక మంచి వార్త చెబుతానని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. చట్టంలో సమస్యలు రాకుండా అవకాశం ఇవ్వాలన్నదే తన ఆలోచన అని అన్నారు. ఇప్పటి వరకు చట్టం వల్లనే ఇబ్బందులు వస్తున్నాయని, ఈ విషయమై తాను అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడుతున్నానని వివరించారు. ఫ్యూచర్ సిటీలో ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలకు, జర్నలిస్టులకు ఒక మంచి కాలనీలను ఏర్పాటు చేసుకుందామని సిఎం స్పష్టం చేశారు. జర్నలిస్టులకు కచ్చితంగా మంచి రోజులు వస్తాయన్నారు.



## తీవ్ర అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

జూపల్లి కృష్ణారావులతో కలసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.1550 కోట్లతో రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఇందుకు గ్రీన్ ఛానల్ లో విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం లో కృష్ణ జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటామని, ఉమ్మడి మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లా లకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తర్వాత అత్యధిక వరి సాగు ఈ ఖరీఫ్ పంటలో వచ్చిందని, కృష్ణా, గోదావరి బేసిన్ లలో అత్యధిక పంటలు పండాయని తెలిపారు. సాగు ప్రాజెక్టు పనులను త్వరలోనే పూర్తి చేస్తామని,ఇ ందుకు సంబంధించిఅన్ని ప్రాజెక్టు లను పురోగతిపై సమీక్షించామని చెప్పారు. ప్రాజెక్టు లకు భూ సేకరణ పనులను జూన్ 2 లోపు రూ. 5వేల కోట్ల తో పూర్తి చేస్తామని, పాలమూరు రంగా రెడ్డి ప్రాజెక్టు కు నిధుల అంశాన్ని చర్చించామని మంత్రి వెల్లడించారు. పాలమూరు ను 90 శాతం చేశామని గత పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రూ..55 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే అది 90 శాతం పూరైనట్లా అన్ని ప్రశ్నించారు. పాలమూరు అంచనాలు రూ.84 వేల కోట్ల కు పెంచిన గత ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి నీరు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్టుల నిర్మాణంపై బిఆర్‌ఎస్ నేతలు అన్ని అబద్దాలు చెబుతున్నారని మంత్రి వాకిటి శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మక్తల్ – నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోత్తల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి రైతులకు 99 శాతం భూములకు నష్ట పరిహారం అందించడం పట్ల ఆయన సిఎం కృతజ్ఞతలు తెలిపారు.




## అన్నింటా వివక్షే

(మొదటి పేజీ తరువాయి)

పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రదర్శన అనంతరం జరిగిన సభను ఉద్దేశించి పశ్యపద్మ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యాచారాలు పెరగడంతో పాటు వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు కూడా దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్తంభాలైన రాజ్యాంగం, లౌకికవాదం బిజె, సంఘ్ పరివార్ నేడు చేస్తున్న దాడి మహిళల హక్కులపై తీవ్ర ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతున్న ఈ నేపథ్యంలో మహిళల పురోగతికి ప్రత్యామ్నాయ దృక్పథంతో లౌకిక, ప్రగతిశీల భారతదేశాన్ని పరిరక్షించడానికి పోరాటాలు తీవ్రతరం చేయాలని పశ్యపద్మ పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కార్మిక కోడ్లు తో మహిళల ఉపాధి, వేతనం తీవ్ర ప్రభావం పడడంతో పాటు పని ప్రదేశాలలలో మహిళలకు రాత్రి వేళ్లాలో చేయించుకునేందుకు అనుమతించడం దుర్మార్గమన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే 4 కార్మిక కోడ్లను తక్షణమే రద్దు చేయాలనీ ఆమె డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన మాట్లాడుతూ స్త్రీలు ఎప్పుడు పురుషులకు లోబడి ఉండాలని, మహిళలు కుటుంబ ఆలనతో పాటు వంటింటికే పరిమితం కావాలని, సంప్రదాయం, మతపరమైన ఆచారాల పేరుతో వారిని పితృస్వామ్య ఆచారాల చీకటిలోకి తిరిగి నెట్టాలని చూస్తున్న మనువాద బిజెపి ని తీవ్రంగా ప్రతిఘటించవాల్సిన అవసరముందన్నారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ఆర్థిక అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్న మహిళలు రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్ ధరలతో వారి కుటుంబాలు కుదేలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకాశానంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేకపోతే ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యనిర్వహాక అధ్యక్షురాలు మండ సదా లక్ష్మీ మహిళ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లో తక్షణమే ఆమోదించి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహిళ రక్షణ చట్టాలను కఠినతరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమీద, రాష్ట్ర కోశాధికారి జె. లక్ష్మి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, ఎఐఎస్‌ఎఫ్ గర్ల్స్ రాష్ట్ర కన్వినర్ కాసోజు నాగజ్యోతి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నేతలు సక్రి బాయ్, బండి జంగమ్మ, శ్రావణి, కే.పద్మావతి, అమినా, మదాసి ఉమా, జీ. భార్గవి అడ్వకేట్ విజేత, .అరుణ దేవి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com